ఆదివారం
ప్రజాశక్తి
30 డిసెంబర్, 2001



సంచలన భరిత సంవత్సరం
2001

లోపలి కవర్‌పేజీలో
కులాతీత వివాహవేదిక



కులాతీత వివాహవేదిక

వధువు కావలెను

✡ 21/5'.3"/ఎస్ఎస్‌సి/గుమస్తా-2000 ఆదాయం/తూ.గో.జిల్లా వరునికి 18/5'/చదువు, ఆదాయం లేకున్నా ఫరవాలేదు/ఏ జిల్లావారైనా సంప్రదించవచ్చు. బాక్స్ నెం : **101** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 32/4'.5"/బి.ఎ/చామన ఛాయ/టీచర్-6000 ఆదాయం/ఖమ్మం జిల్లా వరునికి తగిన వధువు కావలెను. బాక్స్ నెం : **102** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 29/5'.4"/బి.ఎ/తెలుపు/కంప్యూటర్ ఆపరేటర్-25వేల ఆదాయం -సంవత్సరానికి/స్వంత ఇల్లు, ఫ్లాటు ఉన్న నిజామాబాద్ జిల్లా వరునికి 25/డిగ్రీ ఉన్నాలేకున్నా ఫరవాలేదు/ఫెయిర్/ కనీసం 20వేల ఆదాయం-సంవత్సరానికి/ఏ జిల్లావారైనా సరే ఖచ్చితంగా శాఖహారి అయి ఉండాలి. బాక్స్ నెం : **104** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 45/5'.7"/ఎస్ఎస్ఎల్‌సి/డ్రైవర్/ఆదాయం 5 వేలు/కృష్ణా జిల్లా వరునికి 30-45/5-5'.7"/5వతరగతి/ఆదాయం ఉన్నా లేకున్నా/ ఏ జిల్లా వారైనా ఫరవాలేదు. బాక్స్ నెం : **105** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 24/160సెం.మీ/ఎస్ఎస్‌సి/సర్పంచ్‌గా పనిచేస్తున్న వరునికి తగిన వధువు కావలెను. బాక్స్ నెం : **106** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 32/164సెం.మీ/బిఎస్‌సి బిఇడి/మీడియం/ఎల్ఐసి ఏజెంట్/ఆదాయం-నెలకు 6వేలు/ఎలాంటి బాదరబందీ లేని కర్నూలు జిల్లా వరునికి 35 లోపు వయస్సు/165 సెం.మీలోపు ఎత్తు/ఉద్యోగం ఉన్నా లేకపోయినా/ ఏ జిల్లాకు చెందిన వారైన ఆర్థికస్థోమత గల వధువు కావలెను. బాక్స్ నెం : **108** కేరాఫ్ ప్రజాశక్తి.

వరుడు కావలెను

❋ 20/4'/చైనీస్‌వైట్/ఎస్ఎస్‌సి/తల్లిదండ్రులు ప్రైవేట్‌జాబ్ చేస్తున్న శ్రీకాకుళం జిల్లా వధువుకు తగిన వరుడు కావలెను. బాక్స్ నెం : **103** కేరాఫ్ ప్రజాశక్తి.

❋ 20/5'.2"/ఎరుపు/3వ తరగతి/ఆయా-నెలకు వేయి ఆదాయం/ప.గో.జిల్లా వధువుకు తగిన వరుడు కావలెను. బాక్స్ నెం : **120** కేరాఫ్ ప్రజాశక్తి.

❋ 27/5'.5"/ఎస్ఎస్‌సి/ఆదాయం రూ. 2500/డైవోర్సీ/హైదరాబాద్ జిల్లా వధువుకి 30 ఏళ్ళలోపు వయస్సు/5'.5" ఆపై ఎత్తు/ఎస్ఎస్‌సి లేదా ఆపై చదువు/ఏదేని ఉద్యోగం లేదా వ్యాపారం/సి.పి.ఎం. దాని అనుబంధ సంస్థలతో సంబంధం గల వరుడు కావలెను. బాక్స్ నెం :**123** కేరాఫ్ ప్రజాశక్తి.

❋ 20/5'.6"/చామనఛాయ/ఎస్ఎస్‌సి/టీచర్-ఆదాయం 1000/డైవోర్సీ/కృష్ణా జిల్లా వధువుకి 25-30 ఏళ్ళ వయస్సు/చదువు ఎంతైనా ఫరవాలేదు/5.'8" వరకు ఎత్తు/ఆదాయం మూడువేలు/రెండవ వివాహం వారైనా/ ఏ జిల్లా వారైనా సంప్రదించవచ్చు. బాక్స్ నెం : **125** కేరాఫ్ ప్రజాశక్తి.

ప్రజాశక్తి **వివాహ వేదిక కూపన్**

వధువు/వరుడు కావలెను

వయస్సు : ....
చదువు : ....
ఎత్తు /ఛాయ: ....
ఉద్యోగం : ....
జిల్లా : ....
ఇతరములు : ....
....
గల వధువు/వరునికి......
వయస్సు : ....
చదువు : ....
ఎత్తు/ఛాయ: ....
ఉద్యోగం : ....
జిల్లా : ....
ఇతరములు : ....
...................................గల కుల, మత ప్రసక్తిలేని వారు కావలెను.
బాక్స్ నెంబర్:
ఇచ్చిన వారి సంతకం — పూర్తి చిరునామా:

నోట్ : ఈ శీర్షికలో వివరాల ప్రచురణ ఉచితం. ఈ కూపన్‌ను మాత్రమే ఉపయోగించాలి. రు. 8 స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవర్ జత చేయాలి.

వివాహవేదిక, ప్రజాశక్తి కార్యాలయం, 1-1-298/4, ఫ్లాట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

మా 'డబ్బు సంపాదన' కోర్సు చదివితే చాలు... మీరు 'ఖచ్చితంగా' 100 % డబ్బు సంపాదించగలరు!

మనీ ఎర్నింగ్ మేజిక్

డబ్బు సంపాదన ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ముఖ్యమైన విషయం. ఖచ్చితంగా డబ్బు సంపాదించే మంచి అవకాశాలను ఎవరూ వదులుకోలేరు! మీరు కూడా!....నిజమే కదా? ఇందుకు మీరు కేవలం 200/- రూ. ఖర్చుతో, 'డబ్బు సంపాదించటం ఎలా?' కోర్సు తెప్పించి, చదవండి! మీరు ఖచ్చితంగా డబ్బు సంపాదించగలరు. ఇందుకు 100% గ్యారంటీ.

డబ్బు వాపసుకి 100% గ్యారంటీ

ఈ కోర్సు చదివి, ఎందరో తమ సంపాదన మార్గాల్ని మెరుగుపర్చుకుంటున్నారు. అధికంగా సంపాదిస్తున్నారు. మా కోర్సు చదివిన వారి అనుభవాలు ఇదే ప్రకటనలో చూడండి... మీరు ఈ కోర్సు చదివి, డబ్బు అధికంగా సంపాదించి మాకు లెటర్స్ రాస్తారు. ఇది నిజం. ఈ కోర్సు మీకు ఉపయోగపడలేదని అనిపిస్తే మీ డబ్బు 100% మీకు వాపసుపంపిస్తాం. మా కోర్సు మెటీరియల్ త్రిప్పి పంపండి. పోస్టుఖర్చులు మినహా మీ డబ్బు మీకు వాపసు పంపగలం.

కోర్స్ చదివిన వారి అభిప్రాయాలు

నాకు నమ్మకం లేదు.

మీ ప్రకటన చదివినప్పుడు నాకు నమ్మకం కలగలేదు. అయినా మీ కోర్సు తెప్పించి, చదివాను. నా ఆలోచనలు పెరిగాయి. అలాగే నా సంపాదన కూడా అనేక రెట్లు పెరిగింది. I.K డైరెక్టర్ గారికి నా కృతజ్ఞతలు.

-K. రామకృష్ణ, హైదరాబాద్

నా జీవితాన్ని మార్చిన కోర్స్.

మా ఆఫీసులో ఒకరివద్ద ఈ కోర్స్ చూసి నేనూ ఒకటి తెప్పించుకున్నాను. డబ్బు సంపాదనకి ఇది ఎంతో ఉపయోగపడింది. ప్రస్తుతం నా జీవితాన్నే మార్చిన కోర్స్! ఇది నమ్మలేని నిజం!

-B.V. రాజు, హైదరాబాద్.

డబ్బు సంపాదన యింత ఈజీనా!

డబ్బు సంపాదించడం ఎంత కష్టమో అందరికీ తెలిసిన విషయమే! కానీ, ఈ కోర్స్‌కొని డబ్బు సంపాదించడం యింత ఈజీనా! అనిపించేంత గొప్ప కోర్స్ యిది! నేను చాలా తేలికగా డబ్బు సంపాదిస్తున్నందుకు I.K. డైరెక్టర్‌గారికి నా కృతజ్ఞతలు!

-M.S. నారాయణమూర్తి, కర్నూలు.

నేను నిజంగా నమ్మలేదు.

అవును, నేను నిజంగా నమ్మలేదు! మంత్రాలకు చింతకాయలు రాల్తాయా! పుస్తకాలు చదివితే సంపాదన పెరుగుతుందా? అనుకుంటూనే కోర్సు తెప్పించాను. నాకు తెలియకుండానే కోర్స్ చదివాను. మళ్ళీ మళ్ళీ చదివాను. ఆ సూత్రాలను జీవితంలో ఉపయోగించాను. నా సంపాదన పెరగటంతో నాకు నిజంగా ఆశ్చర్యం, ఆనందం కలిగింది.

-M. రామలింగేశ్వరరావు, విశాఖపట్నం.

టైమ్ ఈజ్ గోల్డ్!

రైలు ప్రయాణంలో కేవలం కాలక్షేపానికి కొన్న ప్రతికలో మీ ప్రకటన చూడటమే నా గుడ్‌టైమ్! ఎంతో కాలం వృధాచేసిన నాకు మీ కోర్స్ వల్ల ప్రతి క్షణం గోల్డ్‌గా మారింది! ఇప్పుడు నేను ఒక్కక్షణం వృధాకాకుండా నా సంపాదనకి వినియోగిస్తున్నాను. సంపాదన పెరిగినందుకు మీకు నా ధన్యవాదాలు!

-K. కిరణ్‌కుమార్, రాజమండ్రి.

మీరు ఖచ్చితంగా డబ్బు సంపాదించగలరు. ఎందుకంటే ఈ కోర్సు మీ మెదడుకి పదును పెడ్తుంది. మీ ఆలోచనలు తీక్షణంగా మారి, మీ సంపాదన మార్గాలు ఇంకా ఇంకా పెరుగుతాయి!

కావాలి ☐ **సరియైన గడిలో ఇలా(✓) టిక్ చేయండి..** వద్దు ☐

నాకు 'డబ్బు సంపాదించటం ఎలా' కోర్సుని పంపండి. రూ. 200/-లు పోస్ట్‌మేన్‌కి చెల్లించి వెంటనే కోర్స్ తీసుకుంటాను.

2048

Name: --

Address: --

-- Pincode: ☐☐☐☐☐☐

INSTITUTE OF KNOWLEDGE
No. 205, Habibullah Road,
T.Nagar, Chennai - 600 017.

మనలో మాట

నెవ్వర్ సే నో

లేదు కాదు అనే పదాలు వినడానికి బావుండవు. ఏది అడిగినా - లేదు నావల్ల కాదనే ఆన్సరు చిరాగ్గా వుంటుంది. ఈ జీవితమింతేనేమోనని నీరసం కలుగుతుంది. బతికినంత కాలమూ - ఈలేదూ, కాదూల్తోనే బతకాలేమోనని భయం కలుగుతుంది. ఇంతకంటె - యింత విషం మింగి చావడమే బెటరనిపిస్తుంది. మనది లేదు కాదనే వాతావరణంలో సాగే బ్రాండు బ్రతుకైనా - ఉత్సాహంగా బతికేందుకే అప్పుడప్పుడు అవతలి వాళ్లు తమ బాణీ తప్పనిసరిగా మార్చుకోవాలి. పచ్చిగా లేదు, కాదని చెప్పకుండా - లేకపోవచ్చు, కాకపోవచ్చనే సమాధానాలతో మనల్ని బుజ్జగించాలి. కచ్చితంగా లేదు, కాదని చెప్పలేదు కాబట్టి పనవుతుందేమోననే భ్రమ మనకి కలుగుతుంది. ఆ భ్రమతో నీరసం ఎంతోకొంత తొలిగిపోయి కొద్దోగొప్పో ఉత్సాహం కలుగుతుంది! ఆ ఉత్సాహం వల్ల మరికొన్నాళ్ల పాటు బతుకుబండి నడిచే అవకాశం కలుగుతుంది!

ఈ బ్రాండు మాటలు ఎక్కువగా వైద్యులు ఉపయోగిస్తుంటారు. తన దగ్గిరకొచ్చిన రోగి - ఆర్నెల్లకంటె ఎక్కువ కాలం బతకడని వైద్యుడికి తెలుసు. ఆ మాట యిప్పుడే చెప్పేస్తే రోగితో పాటు అతని ఆత్మీయులు కూడా ఘొల్లుమంటారు. వేలకువేలు పోసి వైద్యం చేయించడం వేస్టనుకుంటారు. వెళ్లొస్తామని రోగిని తీసుకెళ్లిపోతారు. తద్వారా ఎప్పుడో ఆర్నెల్ల తర్వాత ఏడ్చేవాళ్లని ఇప్పట్నుంచే ఏడ్పించవలసి వస్తుంది. పైగా - ఆర్నెల్లు వైద్యం చేసి బిల్లు పెంచే అవకాశం కూడా వైద్యులకు దూరమవుతుంది. ఈ కారణంగా వాళ్లు ఎంత సీరియస్ కేసైనా ప్రమాదం లేకపోవచ్చని చెబుతుంటారు!

కొందరు వైద్యులు ఉత్తుత్తి మాటల్తో రోగినీ, అతని ఆత్మీయుల్నీ ఉత్సాహపరుస్తుంటారు! రెండో రోజులేచిపోయే కేసని తెలిసినా - మీకేం ఫర్లేదని భుజం తడతారు. నిండా నూరేళ్లు గ్యారంటీ అని హామీ యిస్తారు. నిశ్చింతగా వుండమంటారు. ఈ బాపతు మాటల్తో - కనీసం రెండు రోజుల పాటైనా వాళ్లని సుఖపెట్టినందుకు సంతోషిస్తారు. అదే వైద్యుడి లక్షణమని సభల్లో చెబుతారు. అంచేత వాళ్లు నెగిటివ్ పలుకులు పలకరు. ఏం మాటాడినా పాజిటివ్‌గానే మాటాడుతారు. నెవ్వర్ సే నో అనే ఫీటు పిల్లల మీద బాగా పని చేస్తుంది! పసివాడు విమానమ్మీద మనసుపడి - నాన్నా విమానం కొనమంటాడు. బొమ్మ కాదు నిజం విమానమని నొక్కి మరీ చెబ్తాడు. విమానం కొనడం అంత సుళువు కాదు. అంతడబ్బు కూడబెట్టాలంటే ఏడేడు తరాలు చాలవని ఆ తండ్రికి బాగా తెలుసు. తనకి తెలిసిన లెక్క పసివాడికి తెలీదు. వాడికి నిజం చెప్పి నిరుత్సాహపరిచే కంటే - తప్పకుండా కొంటాను కన్నా అని తప్పుడు మాట చెప్పి సంతోష పెట్టడమే తక్షణ కర్తవ్యంగా ఎంచుకుంటాడు: సే నో తత్వాన్ని విడిచిపెట్టి - సే యస్ థియరీని పట్టుకుంటాడు. తండ్రి తాలూకు ఈ థియరీ వింటో పసివాడు పెద్దవాడవుతాడు. పెద్దయిన తర్వాత తండ్రి థియరీ శ్రేష్టమైనదని తెలుసుకుంటాడు!

ప్రజలేం కోరినా ఏలికలు సాధారణంగా నో అనరు. వాళ్ల పెదవి నుంచి వచ్చే నో అనే మాట వాళ్ల పదవికి పెద్ద గండమని వాళ్లకి బాగా తెలుసు. అంచేత నెవ్వర్ సే నో అనే సూక్తిని వాళ్లెప్పుడూ నిర్లక్ష్యం చేయరు! మాకు తిండీ బట్టా చవగ్గా దొరకాలని ప్రజలు డిమేండు చేసినప్పుడు - ఆ ప్రయత్నమ్మీదే వున్నానంటాడు ఏలిక! నిరుద్యోగం నుండి మమ్మల్ని విముక్తుల్ని చేయండని ఒకవర్గం వారు అడిగినప్పుడు - నా ధ్యేయం కూడా అదేనంటాడు ఏలిక! విమానం కొనమని పసిపిల్లలు తండ్రికి పెట్టిన ఇండెంటు మాదిరి- ఈ రెండు డిమేండ్లూ వుంటాయి. తండ్రి హామీ యివ్వగానే పసిపిల్లలు ఎంత సంబరపడతారో - ఏలికల ఉత్తుత్తి హామీలతో ప్రజలంత సంతోషపడతారు! ఇది నిన్నా జరిగింది. ఇవాళా జరుగుతోంది. రేపు జరిగే అవకాశముంది!

కామెర్లంటే ఏమిటి? ...6, 7



'లఘుమిత్ర' 11

అతను అమెరికా ...15



పోలీసు తూటాలకు బలైపోయిన తొలి విప్లవ దీపం ...22, 23

ఇంకా ....

బాలవికాసం ...10
బాలనేస్తాలు ...12, 13
కచేరి ...14
టూరిస్ట్‌గైడ్ ...16
క్రీడారంగం ...17
కథ ...18, 19
పలుకుబడి ...24
వగైరా ....

సంచలనభరిత సంవత్సరం 2001

గుడిపూడి విజయరావు

2001 రేపటితో గడిచిపోతున్నది. గడచిన సంవత్సరం గురించి ఒకసారి బేరీజు వేసుకోవడం ఆనవాయితీ. సంవత్సరమంతా సంచనాలతో, సంభ్రమాశ్చర్యాలతో గడిచిపోయిందని కూడా సాధారణంగా చెప్పుకుంటాము. కాని ఈ ఏడాది నిజంగా సంచలనాల సంవత్సరం. ఈ ధరిత్రిపై 12 మాసాల ఘటనల పరంపరను నెమరు వేసుకుంటే అన్నింటికన్నా మన ముందుకు వచ్చేది సెప్టెంబర్ 11న అమెరికాలోని ప్రపంచ వాణిజ్య కేంద్రం డబ్ల్యు.టి.సి. శిఖరాలపై ఉగ్రవాదులు జరిపిన దాడి. ఈ దాడి సంచలనమే కాదు అతి అనాగరికమైనది.అమానుషమైనది. ప్రతిరోజు 40 వేల మంది పని చేస్తూ ఉండే ఆ ఆకాశ హర్మ్యాలను హైజాక్ చేసిన విమానాలనే ఆయుధాలుగా ఉపయోగించి ఉగ్రవాదులు ధ్వంసం చేశారు. ఈ పరిణామానికి ప్రపంచమంతా నివ్వెరపోయింది. ఈ ఘాతుకాన్ని ఒక్క మాటగా ఖండించింది. కాని ఆ తర్వాత ప్రపంచంలో అమెరికా పాత్ర గురించిన చర్చ కూడా ముమ్మరంగా సాగింది. దాడికి సానుభూతి తెలిపిన ప్రపంచ ప్రజలే అమెరికా వ్యవహరించిన తీరును తీవ్రంగా నిరసించారు. సామ్రాజ్యవాద దురహంకారం నిలువెల్లా నిండిన అమెరికా తనపై నేరుగా జరిగిన ఈ దాడిని జీర్ణించుకోలేకపోయింది. మొదటి ప్రపంచ యుద్ధంలో గాని, రెండవ ప్రపంచ యుద్ధంలో గాని అమెరికా ప్రధానపాత్ర వహించినప్పటికీ యుద్ధం మాత్రం అమెరికా భూభాగంపై జరగలేదు. పెరల్ హార్బర్‌పై జపాన్ దాడి చేసినా అది స్వల్ప ఘటన మాత్రమే. పైపెచ్చు యుద్ధాన్ని ఆసరా చేసుకొని అమెరికా ఆర్థికంగా లాభం పొందింది. వియత్నాంలో దీర్ఘకాలం పాటు యుద్ధం జరిపినా, ఇంకా అనేక ఇతర దేశాల్లో సైనికంగా జోక్యం చేసుకున్నా అది పరాయి భూభాగాలపైనే. ఇప్పుడు డబ్ల్యు.టి.సి.తో పాటు, పెంటగాన్‌పై కూడా దాడి జరిగింది. ఇది అమెరికా ఆర్థిక ఆధిపత్యాన్ని, సైనిక పాటవానికి సవాలు చేసిన చర్య అని కూడా ప్రపంచం భావించడంతో ఆ పరాభవానికి అమెరికా తట్టుకోలేక పోయింది. దాడికి పాల్పడింది అంతర్జాతీయ ఉగ్రవాది బిన్ లాడెన్ ముఠాయేనంటూ ఎటువంటి సాక్ష్యాధారాలు చూపకుండానే ఏకపక్షంగా ఆరోపణలు చేసి, ఆ ఉగ్రవాదులకు, వారికి ఆశ్రయం కల్పించిన వారికి బుద్ధి చెపుతామంటూ ఆఫ్ఘనిస్తాన్‌పై విచక్షణా రహితంగా బాంబుదాడులకు పాల్పడింది. బిన్‌లాడెన్ ఉగ్రవాదిగా మారడం వెనక అమెరికా హస్తం ఉంది. అలాగే లాడెన్‌కు ఆశ్రయమిచ్చిన తాలిబాన్లు పెరగడంలోనూ పరోక్ష పాత్ర ఉంది. కాని ఆ ఉగ్రవాద మతఛాందస శక్తులే తనకు ప్రమాదంగా పరిణమించే సరికి వారిపై దాడికి దిగింది. అంతేకాదు డబ్ల్యు.టి.సి.పై దాడిని ఒకసాకుగా తీసుకొని చమురు సంపన్నమైన అరబ్బు దేశాలకు, మాజీ సోవియట్ రిపబ్లిక్కులకు కీలక స్థానంలో ఉన్న ఆఫ్ఘనిస్తాన్‌పై ప్రాబల్యం సాధించడం అన్న లక్ష్యంతో అమెరికా వ్యవహరించింది. ఇప్పుడు తాలిబాన్లు తొలగిపోయారు. బిన్‌లాడెన్ ఏమైపోయాడో అసలు బ్రతికున్నాడో, చనిపోయాడో కూడా తెలియదు. కాని అమెరికా చెప్పు చేతల్లో ఉండే మాజీ రాజు జహీర్ షా అనుచరుడైన కర్జాయ్ మాత్రం తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఆఫ్ఘనిస్తాన్‌పై సైనికంగా ఆధిపత్యం సంపాదించిన నార్తరన్ అలయెన్స్ తాత్కాలిక ప్రభుత్వంలోను ప్రధాన భాగస్వామిగా ఉంది. ఈ అలయెన్స్ అమెరికాకు ఎంత అనుకూలంగా వ్యవహరిస్తుంది అన్నది వేచి చూడాలి. డబ్బ్యు.టి.సి.పై దాడి అనంతరం అమెరికా వ్యవహరించిన తీరు అమెరికా సామ్రాజ్యవాద స్వభావాన్ని మరింత బట్టబయలు చేసింది. అమెరికా ఇదే సంవత్సరం ఆయుధ పోటీని మరింత తీవ్రతరం చేసే చర్యలక్కూడా పాల్పడింది. జాతీయ క్షిపణి వ్యవస్థ పేరుతో స్టార్‌వార్స్ నూతన ఎడిషన్‌ను ఆరంభించింది. దీనికి కొనసాగింపుగానే ఖండాంతర క్షిపణి వ్యతిరేక ఒప్పందం (ఎ.బి.ఎం.)ను రద్దు చేసింది.

అమెరికా ఆధిపత్య ధోరణికి ఈ ఏడాది తగిలిన మరొక ఎదురు దెబ్బ ఏప్రిల్ మాసంలో చైనా గగన తలంలోకి అక్రమంగా ప్రవేశించిన అమెరికా గూఢచారి విమానాన్ని అందులోని సిబ్బందితో సహా చైనా



డబ్ల్యు.టి.సి.పై ఉగ్రవాద దాడి

అమెరికాపై ఉగ్రవాదులు సెప్టెంబర్ 11న జరిపిన దాడి 2001లో అత్యంత ప్రధానమైన సంఘటన. దీని పర్యవసానాలు అనేక విధాలుగా ప్రపంచ దేశాలపై పడింది. ఆర్థిక, సామాజిక రంగాలపై దాడి తరువాత పరిణామాలు ప్రభావాన్ని చూపాయి. అమెరికా విమానాలనే ఉపయోగించి, వాటిలోని ఇంధనాన్నే ఆయుధాలుగా చేసుకుని ఉగ్రవాదులు జరిపిన దాడి అమెరికా రక్షణ వ్యవస్థలోని లోపాలను ప్రపంచానికి వెల్లడించాయి. ఈ దాడిలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ పెట్టుబడిదారి వ్యవస్థకు కేంద్ర స్థానమైన 110 అంతస్తుల ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యుటిసి) రెండు భవనాలు కుప్పకూలిపోయాయి. మరో విమానంతో ఉగ్రవాదులు ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా రక్షణ కేంద్ర కార్యాలయమైన పెంటగాన్‌పై దాడి చేశారు. ఉగ్రవాదులు మొత్తం నాలుగు ప్రయాణికుల విమానాలను హైజాక్ చేశారు. రెండు విమానాలతో రెండు డబ్ల్యుటిసి టవర్లను ఢీకొట్టారు. మరో విమానం పెన్సిల్వేనియా వద్ద కూలిపోయింది. ఈ దాడిలో ఆరువేల మందికిపైగా మృతి చెందినట్లు అమెరికా అధికారికంగా ప్రకటించింది. ఈ దాడితో అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తి స్థాయి మాంద్యంలో కూరుకుపోయింది. 2000 సంవత్సరం మధ్య నుండే మందగిస్తున్న అమెరికా ఆర్థిక వ్యవస్థ ఈ దాడితో పూర్తిగా మాంద్యంలో పడిపోయింది. విమానయానం, టూరిజం బాగా దెబ్బతిన్నాయి. ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయి అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలు కూడా సంక్షోభంలో కూరుకుపోయాయి. ఒక్క విమానయాన రంగంలోనే లక్ష మంది ఉపాధి కోల్పోయారు. ఆర్థిక నష్టం వేల కోట్ల డాలర్లు చేరుకుంది. ఉగ్రవాదుల దాడులకు అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామాబిన్ లాడెన్‌నే కారణమని అమెరికా ఆరోపించింది. లాడెన్‌ను వెంటనే తమకు అప్పగించాలని ఆఫ్ఘనిస్తాన్‌ను డిమాండ్ చేసింది. లాడెన్ ఆఫ్ఘనిస్తాన్ పాలకులైన తాలిబాన్ల అతిథిగా అక్కడ ఉంటున్నారు. లాడెన్, ఆయన ఆధ్వర్యంలోని అల్‌ఖైదానే దాడులకు ప్రణాళిక రూపొందించినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని అమెరికా పేర్కొంది. దాడి జరిగిన తరువాత నేర ప్రపంచ చరిత్రలోనే అత్యంత భారీ స్థాయిలో అమెరికా ఆరు వేల మంది ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) ఎజెంట్లను రంగంలోకి దించింది. విమాన దాడుల్లో పాల్గొన్నారని భావిస్తున్న 19 మంది ఉగ్రవాదుల ఫోటోలను కూడా ఎఫ్‌బిఐ విడుదల చేసింది. ఈ కేసుకు సంబంధించి దేశ వ్యాపితంగా రెండు వేల మందిని అదుపులోకి తీసుకున్నారు. అమెరికాతో పాటు జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఇటలీ వంటి దేశాల్లో కూడా పలువురిని అరెస్ట్ చేశారు.

వట్టివేయడం అమెరికా ఎన్ని దబాయింపులకు, ఆదరగండానికి పాల్పడినా చైనా ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. చివరికి అమెరికాయే డబుల్ సారీ చెప్పి తన సిబ్బందిని విడిపించుకోవలసి వచ్చింది. క్యూబా అధ్యక్షుడు ఫైడల్ కాస్ట్రో అమెరికా దురహంకార ధోరణులను నిరంతరం ఎండగడుతూనే వున్నారు. సోషలిజం ధ్యేయంగా ఆ దేశం ముందుకు సాగిపోతూనే ఉన్నది. మరో సోషలిస్టు దేశం చైనా ఆర్థికాభివృద్ధి క్రమాన్ని వేగవంతంగా ముందుకు తీసుకెళ్తున్నది. ఇటీవలనే డబ్ల్యు.టి.ఓ.లో సైతం భాగస్వామి అయింది. సోషలిజం వనైపోయిందని పెట్టుబడిదారీ విధానమే అంతిమ వ్యవస్థ అని విర్రవీగిన అనతి కాలంలోనే ఆ వ్యవస్థ ప్రపంచ వ్యాపితంగా మాంద్యంలో పడిపోయింది. జపాన్‌లో కనీవిని ఎరుగని ఆర్థిక సంక్షోభం దీర్ఘకాలంగా కొనసాగుతున్నది. దానిలోనుండి బయటపడటం ఎలా అన్నది దానికి ఎంత మాత్రం అంతు చిక్కడం లేదు. ఇప్పుడు అమెరికా సైతం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. తీవ్రమైన నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆర్థిక దివాళాకోరుతనం కూడా ఈ ఏడాది మరింత బయట పడింది. తాజాగా అర్జెంటీనాలో సంక్షోభం, అల్లర్లు, అధ్యక్షుడే దేశాన్ని విడిచిపెట్టిపారిపోవడం, ఈ పెట్టుబడిదారీ సంక్షోభానికి ఐ.ఎం.ఎఫ్., ప్రపంచ బ్యాంకు మార్గాలు ఎంత మాత్రం సరిపోవని పైపెచ్చు ఆ సంక్షోభాన్ని మరింత తీవ్రం చేస్తాయని స్పష్టం చేశాయి. అయినప్పటికి సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తమ పట్టును పెంచుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూనే వున్నాయి. ఇటీవల దోహాలో జరిగిన డబ్ల్యు.టి.ఓ. మినిస్టీరియల్ సమావేశం ఈ అంశాన్ని స్పష్టం చేసింది. వర్ధమాన దేశాల న్యాయబద్ధమైన కోర్కెలను త్రోసిపుచ్చి తమ అజెండాను వర్ధమాన దేశాలపై రుద్దాయి.

అయితే ఈ పరిణామాలకు ప్రతిఘటన కూడా అభివృద్ధి చెందుతున్నది. ఇటలీలోని జినోవాలో జి-8 శిఖరాగ్ర సభకు వ్యతిరేకంగా లక్ష మంది నిరసన ప్రదర్శన చేయడం, శాంతియుతంగా ప్రదర్శనలు జరిపే వారిపై ప్రభుత్వం కాల్పులకు పాల్పడటంతో ఒక యువకుడు మృతి చెందడం జరిగింది. ఆ తర్వాత గోథెన్‌బర్గ్‌లో ఐ.ఎం.ఎఫ్. సమావేశానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిగాయి. ఈ నిరసనల నుండి తప్పించుకోవడానికే సామ్రాజ్యవాద దేశాలు దోహాలో డబ్ల్యు.టి.ఓ. సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఇదే సమయంలో ప్రపంచంలోని పలు దేశాల్లో మాజీ కమ్యూనిస్టులు, కమ్యూనిస్టులు ఎన్నికల ద్వారా అధికారంలోకి రావడం కూడా జరిగింది. ముఖ్యంగా బెర్లిన్‌లో మితవాద శక్తులు పరాజయం పాలై, వామపక్ష శక్తులు విజయం సాధించాయి. స్థూలంగా ఇవన్నీ ప్రపంచంలో ఈ ఏడాది సానుకూల ప్రతికూల పరిణామాలు. ప్రపంచ పురోగామి శక్తులకు ఉత్సాహాన్నిచ్చే పరిణామాలు కూడా.

జాతీయ పరిణామాల విషయానికొస్తే మూడేళ్ళుగా పరిపాలిస్తున్న బి.జె.పి. అవినీతి, అసమర్థత, దివాళాకోరుతనం మరింతగా బట్టబయలయ్యాయి. తెహల్కా డాట్ కాం వెల్లడించిన అవినీతి వ్యవహారాలు అవినీతికి ఆమడదూరం అని చెప్పుకునే ఆ పార్టీ అసలు రంగును బయటపెట్టాయి. సాక్షాత్తు ఆ పార్టీ అధ్యక్షుడే నోట్ల కట్టలు అందుకుంటూ కన్నంలో దొంగలా పట్టుబడ్డాడు. గత్యంతరం లేక అప్పటికప్పుడు అధ్యక్షుడిని ఆ పార్టీ మార్చివేసింది. బి.జె.పి. కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉంటూ రక్షణ మంత్రి పదవిని వెలగబెడుతున్న జార్జి ఫెర్నాండెజ్ అధికారగృహమే ఆయుధ కొనుగోళ్ళ ముడుపుల స్వీకరణకు స్థానంగా మారిందన్న విషయాన్ని తెహల్కా బయటపెట్టింది. ఈ కేసులో రాజీనామా చేసిన ఫెర్నాండెజ్‌కు ఆ విషయంపై విచారణ జరుగుతుండగానే మళ్ళీ రక్షణ మంత్రిత్వ శాఖను కట్టబెట్టింది. అలాగే పార్టీ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్‌కూ పునరావాసం కల్పించింది. మంత్రివర్గ సహచరులే కాకుండా సాక్షాత్తు ప్రధానమంత్రి కార్యాలయమే స్థావరంగా చేసుకొని అవినీతి వ్యవహారాలు కొనసాగుతున్నాయన్న విషయమూ పత్రికలకెక్కింది. ఇవన్నీ ఆ పార్టీ ప్రతిష్టను దిగజార్చాయి. వీటన్నింటినీ మించి ఇటీవలనే వెల్లడైన కార్గిల్ శవపేటికల కుంభకోణం తీవ్ర సంచలనం సృష్టించింది. కార్గిల్ పోరాటం గురించి గొప్పలు చెప్పుకొని సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నించిన ఈ ప్రభుత్వమే కార్గిల్‌లో ప్రాణాలు కోల్పోయిన వీర జవానుల భౌతిక కాయాలు చేరవేసే శవపేటికల కొనుగోళ్ళలో సైతం అక్రమాలకు పాల్పడిందన్న విషయం తెలుసుకొని మొత్తం దేశమే నిర్ఘాంతపోయింది.

అవినీతితో పాటు ఈ ప్రభుత్వ అసమర్థత కూడా ఈ ఏడాది మరింత బట్టబయలయింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి, దాని మిత్రపక్షాలకు ఎదురు దెబ్బలు తగిలాయి. పలు ఉప ఎన్నికల్లోనూ పరాజయం పాలయ్యాయి. తమపార్టీ అధికారంలో వున్న రాష్ట్రాలలో కూడా అంతర్గత కుమ్ములాటలు అధికమయ్యాయి. దీనితో త్వరలో వివిధ రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికల్లోనూ పరాజయం పాలవుతామన్న భయం ఆ పార్టీకి పట్టుకొంది. ఫలితంగా గుజరాత్‌లోను, ఉత్తరాంచల్‌లోను, పూర్తిగా ఆర్.ఎస్.ఎస్. నాయకులుగా వున్న వారిని ముఖ్యమంత్రి పీఠాలపై కూర్చోబెట్టింది. అంతకుముందు యు.పి.లో. రాజనాథ్‌సింగ్‌ను కూడా ఎన్నికల దృష్టితోనే ముఖ్యమంత్రిని చేసింది. ఇప్పటివరకు సమాజంలోని అన్ని సెక్షన్లకు, మతాలకు ప్రాతినిధ్యం కల్పిస్తుందని చెప్పుకుంటూ వచ్చిన బి.జె.పి. ఇప్పుడు ఆ నటనను సైతం మానుకొని హిందుత్వ శక్తులను గట్టిగా ఉపయోగించుకొని హిందువులను ఓటు బ్యాంకులుగా మార్చుకోవాలని తంటాలు పడుతున్నది. ఈ క్రమంలోనే హిందూమత ఛాందసాన్ని ప్రేరేపించడానికి మరింతగా ప్రయత్నిస్తున్నది. అయోధ్యలో రామాలయ నిర్మాణం జరిగి తీరుతుందని సంఘ్‌పరివార్ శక్తులు బహిరంగంగా చెబుతున్నాయి. అయోధ్యలో నిషిద్ధ బాబ్రీ మసీదు విధ్వంసక స్థలంలో ప్రవేశించి వి.హెచ్.పి., విశ్వహిందూ పరిషత్ నేతలు పూజలు జరపడం దీనిలో భాగమే. విశ్వవిద్యాలయాల్లో జ్యోతిష్యం, పాఠ్య పుస్తకాలను తమ మతతత్త్వ ఎజెండాకు అనుగుణంగా మార్చడం లాంటి చర్యలకు పాల్పడుతున్నది.

పచ్చి మతోన్మాదాన్ని ప్రోత్సహించడంతోపాటు బి.జె.పి. విదేశాంగ విధానంలో సామ్రాజ్యవాదులకు ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదులకు పూర్తి బానిసగా వ్యవహరించడం ఈ కాలంలో అధికమయింది. డబ్ల్యు.టి.సి.పై దాడి జరిగినపుడు అమెరికా అడగకముందే ఉగ్రవాదాన్ని అణచడానికి అంటే ఆఫ్ఘనిస్తాన్‌పై దాడులు

దేశాన్ని నివ్వెరపరిచిన తెహల్కా కుంభకోణం

2001 సంవత్సరంలో యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది తెహల్కా కుంభకోణం. ఆయుధాల కొనుగోళ్ళనూ, ఇతర ఒప్పందాల విషయంలో రక్షణ శాఖలో పేరుకుపోయిన అవినీతిని ఈ కుంభకోణం వెలికి తీసింది. దేశ రక్షణను సైతం ఫణంగా పెట్టి కొందరు పెద్దమనుషులు సాగిస్తున్న అవినీతి బాగోతాన్ని తెహల్కా డాట్ కమ్ అనే సంస్థ అత్యంత సాహసోపేతంగా పరిశోధించి జాతి కళ్ళకు కట్టినట్లు చూపింది. రక్షణ మంత్రిగా ఉన్న జార్జి ఫెర్నాండెజ్ మొదలు, అధికారంలో ఉన్న బిజెపి జాతీయ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్, ఫెర్నాండెజ్ పార్టీ అయిన సమత జాతీయ అధ్యక్షురాలుగా ఉన్న జయా జైట్లీ, ఎందరో సీనియర్ సైనికాధికారులు ఈ కుంభకోణంలో కన్నంలో దొంగల మాదిరి జాతి ముందు దోషులుగా నిలబడ్డారు. తెహల్కా నుండి జనవరి 5న బంగారు లక్ష్మణ్ స్వయంగా లక్ష రూపాయలు తీసుకుంటూ కెమెరా కన్నుకు దొరికిపోయారు. మాకు మించిన దేశ భక్తులు లేరని ఢాంబికాలు పలికే ఆర్ఎస్ఎస్ నేషనల్ ట్రస్టీ ఆర్‌కె గుప్తా తనకు రక్షణ ఒప్పందాల్లో 25 లక్షల వరకు ముట్టినట్లు ప్రకటించారు. సాక్ష్యాత్తు రక్షణ మంత్రి ఇంట్లోనే జయా జైట్లీ ముడుపుల గురించి మాట్లాడారు. తెహల్కా డాట్ కమ్ అధిపతి తరుణ్ తేజ్ పాల్ ఇందు కోసం ఊరూ పేరూ లేని ఆపరేషన్ వెస్ట్‌ఎండ్ అనే సంస్థను స్థాపించారు. ఉన్నత స్థానాల్లో ఉన్న రక్షణ శాఖ అధికారులు వెస్ట్‌ఎండ్ అనే సంస్థ ఉందోలేదో కూడా విచారించకుండానే ఆయుధాల కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటామని ముడుపులు స్వీకరించారు. పార్లమెంట్‌లో పెద్దఎత్తున గొడవ జరిగి, దేశ వ్యాపితంగా తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో ప్రభుత్వం దీనిపై విచారణకు ఆదేశించింది. బంగారు లక్ష్మణ్ బిజెపి అధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించారు. రక్షణ మంత్రిగా జార్జి ఫెర్నాండెజ్ వైదొలిగారు. సమతా పీఠం నుండి జయా జైట్లీ సైతం తప్పుకున్నారు. కొందరు సైనికాధికారులను తప్పించారు. ఈ కుంభకోణాలను వెలికి తీయడానికి తెహల్కా సంస్థ సైనికాధికారులకు అమ్మాయిలను సరఫరా చేస్తిందన్న వార్తలను అసరాగా చేసుకుని ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడింది. దీనిపై వేసిన వెంకటస్వామి కమీషన్ తన విచారణను సైతం ప్రారంభించకముందే జార్జి ఫెర్నాండెజ్‌పై ఎలాంటి కేసు లేనందు వలన ఆయనకు ఇందులో సంబంధంలేదని ప్రధాని వాజ్‌పేయి నిస్సిగ్గుగా ప్రకటించారు.

చారిత్రాత్మక ఆర్టీసి సమ్మె

2001 సంవత్సరంలో రాష్ట్ర కార్మికోద్యమ చరిత్రలోనే 24 రోజుల పాటు జరిగిన ఎపిఎస్ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అక్టోబర్ 15 నుండి నవంబర్ 7 వరకు ఈ సమ్మె సాగింది. సమ్మెలో సంస్థలోని లక్ష మంది కార్మికులు పాల్గొన్నారు. ఆర్థిక సరళీకరణ విధానాలు ప్రారంభమైన తరువాత ప్రపంచ బ్యాంక్ ఆదేశాలను తూచతప్పక పాటిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అనేక రంగాల కార్మికులు ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ బ్యాంక్ ఆదేశాలను అందరి కంటే వేగంగా అనుసరిస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎదుర్కొన్న రెండో అతిపెద్ద ప్రతిఘున ఇది. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. ముగ్గురు ప్రాణాలను బలిదానం చేశారు. ఇదే బ్యాంక్ ఆదేశాల మేరకు ఆర్టీసీని ప్రైవేటీకరించాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు మొదటి సారిగా సంఘటితంగా ప్రతిఘటించి విజయం సాధించారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధకాండను ప్రయోగించింది. సమ్మెలో ప్రభుత్వ విధాన నిర్ణయాలను తప్పుపట్టడం తగదని, దీనిని సహించమని, కఠినంగా అణచివేస్తామని రకరకాలుగా బెదిరించింది. అనేక మందిని సస్పెండ్ చేసింది. వందలాది మందిపై కేసులు పెట్టింది. సమ్మె ఒత్తిడికి లొంగేది లేదని, ప్రభుత్వం అనుసరిస్తున్న సంస్కరణలు ఆగవని స్పష్టం చేసింది. సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు జరిపేది లేదని మొండికేసింది. క్యాజువల్ కార్మికులు, పోలీస్, రెవిన్యూ శాఖల నుండి పెద్దఎత్తున డ్రైవర్లను పిలిపించి బస్సులు నడిపేందుకు పూనుకుంది. సమ్మె విచ్ఛిన్నానికి తాను చేసిన చట్టాలను తానే నిస్సిగ్గుగా మమ్మ చేసి విచ్చలవిడిగా ప్రైవేట్ బస్సులకు అనుమతి నిచ్చింది. స్కూల్స్‌కు సెలవులు కావడంతో అన్ని పాఠశాలల బస్సులను కూడా ఇందుకు ఉపయోగించుకుంది. అనుభవంలేని వారికి గుడ్డిగా బస్సులను అప్పగించడం మూలంగా అనేక మంది అమాయక ప్రయాణీకులు అసువులు బాసారు. మరి కొందరు ప్రబుద్ధులు రోజంతా వచ్చిన కలెక్షన్లను తీసుకుని ఉడాయించారు. వేతన సవరణతో పాటు, ఆర్టీసీ పరిరక్షణ కోసం కార్మికులు చేసిన పోరాటానికి ప్రజల మద్దతు విస్తృతంగా లభించింది. సమ్మెకు సంఘీభావంగా ఇతర రంగాల కార్మికులు ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. 24 రోజుల సమ్మె కాలంలో 9741 మందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. ఇందులో ఆర్టీసీ కార్మికులు 5552 మంది ఉన్నారు. 2210 మంది ఆర్టీసీ కార్మికులపై కేసులు పెట్టారు. 636 మంది ఒక రోజు కంటే ఎక్కువగా జైలులో ఉన్నారు. ఇందులో 514 మంది ఆర్టీసీ కార్మికులు ఉన్నారు. శాంతి భద్రతల రక్షకులుగా ఉండాల్సిన పోలీసులను ప్రభుత్వం మొదటిసారిగా సమ్మె విచ్ఛిన్నకులుగా ఉపయోగించుకుంది. హైదరాబాద్, విజయవాడతో పాటు అనేక నగరాల్లో కార్మికులపై పోలీసులు దాడులు చేశారు. విజయవాడలో సమ్మె సందర్భంగా జరిగిన ప్రదర్శనలో పాల్గొన్న మహిళ నినాదాలు ఇవ్వకుండా ఒక భాధ్యత కలిగి ఐపిఎస్ అధికారి స్వయంగా నోట్లో లాఠి పెట్టిన పైశాచిక ఘట్టం సమ్మె పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు ప్రబల నిదర్శనం. ఆర్టీసిని ప్రైవేటీకరించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను సమ్మె వెనక్కి కొట్టింది.

జరపడానికి తాను సహకరిస్తానని పాకిస్తాన్ కన్నా ముందుగా ప్రకటించింది. అమెరికా సైనిక విమానాలు ఇంధనం నింపుకోవడానికి వీలు కల్పించింది. భారతదేశం దీర్ఘకాలంగా అనుసరిస్తూ వస్తున్న నిరాయుధీకరణ విధానానికి తిలోదకాలిచ్చింది. హిందూ మహాసముద్రంలో అమెరికాకు చెందిన డిగోగార్సియా సైనిక స్థావరాన్ని ఎత్తివేయాలని భారతదేశం నిరంతరం డిమాండు చేస్తుండగా ఆ డిమాండును బి.జె.పి. ప్రభుత్వం వదులుకోవడమే కాకుండా ఆ స్థావరంలో తనకూ కొంత స్థానం కల్పించాలని కోరిందంటే అది ఎటువంటి ప్రమాదకర మార్గంలో పయనిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. కాశ్మీర్ విషయంలో సైతం అమెరికా జోక్యం చేసుకునేందుకు దారి తీసే పరిస్థితులను బి.జె.పి. తెచ్చిపెడుతున్నది.

మరోవైపున ఈ ఏడాది దేశ ఆర్థిక పరిస్థితి మరింత అధ్వాన్నమయింది. పదేళ్ళుగా అనుసరించబడుతున్న సంస్కరణలు దేశాన్ని మరింత సంక్షోభంలో పడవేశాయి. పారిశ్రామిక రంగం అభివృద్ధి రేటు కేవలం 1.6 శాతానికి పడిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. జి.డి.పి. పెరుగుదల రేటు తొలి అంచనా ఆరు శాతాన్ని సాధించలేకపోయినా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితే కనీసం ఐదు శాతమన్నా సాధించవచ్చున్న ఆశలూ నెరవేరేటట్లు కనపడటం లేదు. ఆర్థిక మంత్రి ద్రవ్యలోటు తీవ్రమయిందని అంటూనే ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుంధని చెబుతున్నారు. ఈ కాలంలో ఎగుమతులు తగ్గిపోయాయి. డబ్ల్యు.టి.ఓ. ఒప్పందం ఫలితంగా దిగుమతులపై ఆంక్షలు ఎత్తివేసిన ఫలితంగా చౌకగా ఇతర దేశాల నుండి అనేక రకాల సరుకులు వచ్చిపడుతున్నాయి. ఇటీవల దోహాలో సైతం భారత ప్రభుత్వం వర్ధమాన దేశాల ప్రయోజనం కోసం సమర్థవంతంగా నిలబడటంలో విఫలమయింది.

ఆర్థికంగాను, రాజకీయంగాను దివాళా తీసిన ప్రభుత్వం తన అధికారాన్ని కాపాడుకోవడానికి సామ్రాజ్యవాదులకు బంటుగా తయారు కావడం, హిందూత్వ శక్తులను రెచ్చగొట్టడంతో పాటు, నిరంకుశ చర్యలకు సైతం పాల్పడుతున్నది. ఉగ్రవాద నిరోధం పేరుతో 'పోటో' ఆర్డినెన్స్‌ను పట్టుకువచ్చి దాన్ని చట్టం చేయడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నది. అక్టోబర్ 1వతేదీన జమ్మూకాశ్మీర్ అసెంబ్లీపై ఉగ్రవాదులు దాడులు జరిపి 39 మందినిపొట్టన పొట్టుకునన్నారు. డిసెంబర్ 13న పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఉగ్రవాదులు లోనికి చొరబడి కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలు అంతరంగిక భద్రతా లోపాన్ని, ముఖ్యంగా పార్లమెంటు భవనంలనే భద్రతా రాహిత్యాన్ని అద్దం పడుతున్నాయి. బి.జె.పి. ప్రభుత్వం ఈ విధమైన గుణపాఠం తీసుకోవడానికి బదులు ఈ ఘటనలను 'పోటో'నుచట్టం చేయడానికి సాకుగా వాడుకోచూస్తున్నది. ఈ ఉగ్రవాదదాడిని కచ్చితంగా ఖండించాల్సిందే. ఉగ్రవాదులపై చర్యలు గైకొనాల్సిందే. కాని ఉగ్రవాదాన్ని అణచివేసే పేరుతో నిరంకుశ చట్టాల కోసం ప్రయత్నించడం, ప్రజాస్వామ్యాన్ని హరించడం మాత్రం సరికాదని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

బి.జె.పి. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలూ అధికమవుతున్నాయి. జ్యోతిబసు నేతృత్వంలో పీపుల్స్‌ఫ్రంట్ ఏర్పాటు ఈ ఏడాది ఒక మంచి పరిణామం. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆరవసారి వరుసగా సి.పి.ఎం. నేతృత్వంలోని బెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ సాధించిన చారిత్రాత్మక విజయం కమ్యూనిస్టులకు, ఇతర పురోగామి శక్తులకు ఎంతో స్ఫూర్తినిచ్చింది. హిందూమతతత్త్వ శక్తులకు బలమైన యు.పి. మహారాష్ట్రలలో ఆ శక్తులను వ్యతిరేకించే పార్టీలు దగ్గరవడం బి.జె.పి.ని కలవరపెడుతున్నది. అలాగే ఆర్థికవిధానాలకు వ్యతిరేకంగా కూడా పోరాటాలు తీవ్రమవుతున్నాయి. బాల్కో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఆ సంస్థ కార్మికులు పెద్దఎత్తున పోరాటం చేశారు. అలాగే బొగ్గుగని కార్మికులు, బ్యాంకు ఉద్యోగులు ఇంకా ఇతర ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు సమ్మె పోరాటాలు నిర్వహించారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణలకు వ్యతిరేకంగా అనేకపోరాటాలు జరుగుతున్నాయి.

రాష్ట్రం విషయానికొస్తే చంద్రబాబు హైటెక్ కోతలు వట్టికోతలు మాత్రమేనని తేలిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా దివాళా తీసింది. అప్పులు రు.45000 కోట్లు చేరి దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో సైతం తెలుగుదేశం ఎదురు దెబ్బలు తిన్నది. రాష్ట్రంలోనే తనకు ఎదురు లేదని విర్రవీగిన చంద్రబాబుకు స్వంత పార్టీలో బహిరంగ అసమ్మతి ఎదురైంది. మంత్రివర్గ మార్పుల పట్ల అనేక మంది సీనియర్ నేతలు తిరుగుబాటు చేశారు. ఐ.టి. అంటూ ఇప్పటిదాకా పాటపాడిన చంద్రబాబు ప్రపంచ వ్యాపితంగా ఐ.టి.రంగం దివాళా తీయడంతో కొత్తగా బయోటెక్నాలజీ పల్లవి ఎత్తుకున్నారు. కొత్తగా వచ్చిన పరిశ్రమలు కనిపించడంలేదు. ప్రపంచబ్యాంకు వద్ద తీసుకువచ్చిన అప్పులు వాటి కోసం అమలు జరిపే విషమ షరతులు కనిపిస్తున్నాయి తప్ప అభివృద్ధి జాడ మాత్రం తెలియడం లేదు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటాలూ కొనసాగుతున్నాయి. గత ఏడాది విద్యుత్ ఉద్యమం జరిగితే ఈ ఏడాది ఆర్టీసి ఉద్యోగులు 24 రోజుల పాటు సమైక్యంగా సమ్మె జరిపి ప్రైవేటీకరణ ప్రయత్నాలకు తమ వ్యతిరేకతను చాటి చెప్పారు. కొన్ని డిమాండ్లనూ సాధించుకున్నారు. అలాగే రెవెన్యూ ఉద్యోగులు సమ్మె చేసి విజయం సాధించారు. ఇంకా బొగ్గుగని కార్మికుల సమ్మె పోరాటాలు జరుగుతున్నాయి. మద్దతు ధరల కోసం రైతాంగం వీధుల్లోకి వస్తున్నారు. సంస్కరణలను నల్లేరుపై బండిలా నడిపించవచ్చు ననుకున్న చంద్రబాబుకు అది ఎంతమాత్రం సాధ్యం కావడం లేదు.

మొత్తంగా చూసుకున్నప్పుడు ఈ సంవత్సరం సంచలనాల సంవత్సరం, పోరాటాల సంవత్సరం, ప్రగతి నిరోధకులకు ఎదురు దెబ్బలు తగిలిన సంవత్సరం, అభ్యుదయ వాదులకు ఉత్సాహాన్నిచ్చే సంవత్సరం. ★

కామెర్లంటే పసిరికే

డా॥ బి.శంకర శర్మ

కామెర్లు లేదా పసిరికలు నిత్య జీవిత వాడుక భాషలో రెండు విధాలు. (1) తెల్లకామెర్లు (2) పచ్చకామెర్లు.

1. తెల్లకామెర్లు : రక్తహీనత, అనీమియా లేదా ఊదు కామెర్లు అని పలు విధాలుగా అనవచ్చు. రక్త కణాలలో హిమోగ్లోబిన్ శాతం తక్కువ కావటం, రక్తస్రావం, రక్తకణాలు పగలడం, ఎముకల్లోని మూలుగ దెబ్బతినడం, బ్లడ్ క్యాన్సర్ (లుకేమియా) యింకా ఎన్నో కారణాల వల్ల ఈ వ్యాధి సంభవిస్తుంది.

2. పచ్చ కామెర్లు : కళ్ళు నాలుక క్రింది భాగము, అర చేతులు, గోళ్ళు మొదలగు భాగాలు పచ్చగా మారటాన్ని పచ్చకామెర్లు (జాండిస్) అంటారు. ఈ విధంగా పచ్చకామెర్లు రావడం అనేది ఒక లక్షణం మాత్రమే. వివిధ కారణాల వల్ల ఈ పసిరికలు సంభవిస్తాయి. దీన్లో ముఖ్యంగా రక్తానికి సంబంధించిన రక్తకణాలు పగలడం వలన కలిగే జాండిస్‌ను హిమోలైటిక్ జాండిస్ అంటారు. కాలేయపు జబ్బుల వలన కలిగే కామెర్లను హెపటో సెల్యులర్ జాండిస్ అంటారు.

పైత్యరస నాళాలలో పైత్యరస ప్రసరణకు అడ్డు కలగడం వలన కలుగు జాండిస్‌ను అబ్‌స్ట్రక్టివ్ జాండిస్ అంటారు.

ఈ కామెర్ల వ్యాధి నిర్ధారణకు రక్త పరీక్షలు, మల, మూత్ర పరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కానింగ్, ఎండోస్కోపి వైరస్‌లకు చేయవలసిన పరీక్షలు, పైత్యరస నాళాలకు సంబంధించి ఇ.ఆర్.సి.పి., పి.టి.సి. మొదలగు పరీక్షలు రోగి అవసరాన్ని బట్టి రోగ నిర్ధారణకు, దానికి తగిన చికిత్స కోసం చేయవలసి ఉంటుంది.

సాధారణ పసిరికలు : ఇవి హెపటైటిస్ అని పిలువబడతాయి. ఇందులో ముఖ్యంగా వైరల్ హెపటైటిస్ అత్యంత ముఖ్యమైనది. ఈ వైరల్ హెపటైటిస్ ఎ, బి, సి, డి, ఇ అను వేర్వేరు వైరస్‌ల వలన లివర్‌కు (కాలేయము) వ్యాధి సోకడం వలన పసిరికలు కలుగుతాయి. ఇందులో హెపటైటిస్ ఎ, ఇ, నీరు, ఆహార పదార్థాల కాలుష్యం వలన ఫేషియో–ఓరల్ రూట్ (పొల్యూటెడ్ వాటర్) ద్వారా సంభవిస్తాయి.

బి, సి, డి హెపటైటిస్‌లు రక్తం ద్వారా, సిరంజీల ద్వారా, సూదులు, రేజర్స్ ద్వారా, మంగలికత్తి ద్వారా, లైంగిక సంపర్కం ద్వారా సంక్రమిస్తాయి. రక్తం ఎక్కించే ముందు తప్పక బి, సి వైరస్ పరీక్షలు చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. ఎ, ఇ వైరస్‌ను కాచి, చల్లార్చిన నీరు త్రాగడం ద్వారా, స్వచ్ఛమైన నీటి సరఫరా ద్వారా నివారణ చేయవచ్చు.

బి వైరస్‌ను వ్యాక్సిన్ ద్వారా నివారణ చేయవచ్చును. సి, డి వైరస్‌కు ఇంతవరకు వ్యాక్సిన్ కనుగొనలేదు. కాబట్టి రక్తం ఎక్కించే ముందు సి వైరస్ కోసం కూడా పరీక్షలు చేయాల్సిన అవసరం వుంది. ఎందుకంటే చాలామార్లు సి వైరస్ రక్తం ఎక్కించడం వలననే కలుగుతోంది. బి, సి వైరస్‌ల వలన సిర్రోసిస్ అనే లివర్ వ్యాధి, లివర్ క్యాన్సర్ కూడా సంభవించే అవకాశం ఉంది. కాబట్టి వాటి గురించి సామాన్య ప్రజలు కూడా వైద్యుల నుండి సరైన సలహాలు తీసుకోవలసిన అవసరం ఉంది.

ఇకపోతే సారాయి, కొన్ని రకాల మందుల వలన కూడా పసిరికలు సంభవిస్తాయి. పైత్యరస నాళాల వ్యాధుల వలన కూడా పసిరికలు సంభవిస్తాయి. పైత్యరస నాళాల్లో రాళ్ళు అడ్డు పడటం, ఆపరేషన్ల వలన పైత్యరస నాళం సన్నగా అవడం, క్లోమరస గ్రంథి వ్యాధుల వలన కూడా పసిరికలు కలుగుతాయి.

షాల్సిపారవ్ం మలేరియా వలన, తీవ్రమైన టైఫాయిడ్ వలన పసిరికలు కలుగుతాయి.

ఈ రకంగా అనేక కారణాల వలన పసిరికలు కలుగుతాయనే విషయం సామాన్య ప్రజలకు తెలియక పోవడం వలన పసిరికలకు నాటు మందే న్యాయం చేస్తుందనే ధోరణితో చెట్టు మందో, పుట్టల మందో వాడి పుణ్యకాలం తీరిన తర్వాత ప్రాణాంతక పరిస్థితులలో స్పెషలిస్ట్ డాక్టర్ల పరిధిలోకి పేషెంట్స్ రావటం సర్వసాధారణమైంది.

కామెర్ల వ్యాధి సోకిన పేషెంట్‌కు కొన్ని కనీస రక్త పరీక్షలు తప్పక అవసరము. ఖరీదైన పరీక్షలు రోగి అవసరాన్ని బట్టి వైద్యులు నిర్ణయిస్తారు.

కామెర్ల వ్యాధి కారణాలు : వయస్సును బట్టి పలు విధాలుగా ఉండే అవకాశం ఉంది. పసికందుల్లో, నెలలోపు పిల్లల్లో కూడా పసిరికలు వస్తాయి. నెలలు నిండిన పిల్లల్లో కూడా రెండు రోజులు దాటాక 10 రోజుల వరకు కొద్ది స్థాయిలో పసిరికలు కలిగే అవకాశం ఉంటుంది. ఆ పసిరికలను ఫిజియోలాజికల్ జాండిస్ అంటారు. ఈ పసిరికలకు ప్రత్యేకమైన చికిత్స అవసరం లేదు.

ఈ విధంగా కాకుండా పుట్టిన మొదటి రోజే పసిరికలు రావడం, త్వరత్వరగా ఎక్కువగా రావడం, వారం, రెండు వారాలు దాటిన తరువాత పసిరికలు రావడం ప్రమాదకరమైనవి. రక్తగ్రూపులు ఆర్. హెచ్. టైప్ తల్లి, పిల్ల మధ్య తేడా ఉండినచో పసిరికలు వస్తాయి. ఆర్. హెచ్ నెగెటివ్ తల్లికి, ఆర్‌హెచ్ పాజిటివ్ బిడ్డ పుడితే బిడ్డలో పసిరికలు వస్తాయి. 'ఓ' గ్రూపు తల్లికి 'ఎ' గ్రూపు కాని 'బి' గ్రూపు కాని, పిల్లలు అయినపుడు వారిలో కూడా పసిరికలు కలిగే అవకాశం వుంది. ఈ పరిస్థితుల్లో పలు రకాల వైద్యం చేయవచ్చు. ఈ మధ్యన ఫోటో థియరీ పరికరాలు అందుబాటులోకి వచ్చిన తరువాత నవ శిశువుల పసిరికల వైద్యం సులభమయింది. ప్రమాద స్థితిలో ఉండే బిడ్డలకు ఎక్స్చేంజ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేస్తారు.

ఇకపోతే నవశిశువుల్లో పుట్టుకతో కొన్ని ఇన్‌ఫెక్షన్ ఏజెంట్స్, పైత్యరస నాళాలు పుట్టుకతో మూసుకొని ఉండుట మొదలగు వాటి వలన కూడా పసిరికలు వస్తాయి. ఈ పరిస్థితుల్లో దానికి తగిన వైద్యం చేయాలి.

కొద్దిగా పెద్ద పిల్లల్లో కడుపునొప్పి పసిరికలు, కడుపులో గడ్డలాగ ఉండే పసిరికలు రావచ్చు. స్కానింగ్ ద్వారా ఆ జబ్బును నిర్ధారణ చేయవచ్చు.

చిన్నపిల్లల్లో 'ఎ' వైరస్‌కు సంబంధించిన హెపాటిటి సాధారణంగా కలుగుతుంది. కాచి చల్లార్చిన నీరు త్రాగించి వాటిని నివారణ చేయవచ్చు. అలాకాని పరిస్థితుల్లో హెపాటైటి 'ఎ' వెల్లైనే వేసి నయం చేయవచ్చు.

టి.బి. జబ్బుకు వాడే మందుల వలన, కాన్సరు జబ్బుకు వాడే మందుల వలన, చర్మ రోగులకు సంబంధించి వాడే మందుల వలన కూడా పసిరికలు సంభవిస్తాయి. అలాంటప్పుడు ఆ మందులు ఆపివేస్తే, తగిన శ్రద్ధ తీసుకుంటే ఆ పసిరికలు తగ్గుతాయి.

ముసలివాళ్ళల్లో మొదటిసారిగా పసిరికలు సంభవిస్తే కాన్సరు చాలాసార్లు కారణమై ఉంటుంది. పైత్యరస నాళాల్లో పైత్యరస ప్రసరణకు అడ్డు కలగడం వలన ఈ పసిరికలు సంభవిస్తాయి. పిత్తాశయ కాన్సర్, లివర్ కాన్సర్, బైలూడక్ట్ కాన్సర్, పొట్ట కాన్సర్, క్లోమరస గ్రంథి కాన్సర్, కాలన్ కాన్సర్ వీటన్నిటి వలన పసిరికలు కలిగే అవకాశం వుంది.

ఇన్ని రకాల కారణాల వలన పసిరికల కలుగుతుండే మన సమాజంలో ఏమీ తెలియక కేవలం పసిరికలు అనగానే దానికి అల్లోపతిలో వైద్యం లేదనుకొని నానా అవస్థలకు గురి కావడం చాలా బాధాకరమైన విషయం.

కావున పసిరికలు వచ్చిన వారు లివర్ స్పెషలిస్ట్‌ల దగ్గిర పరీక్ష చేయించుకొని ఏ కారణం వలన వచ్చిందో చూచి తగిన వైద్యం చేయించుకోవాలి.

మద్యపానం – పసిరికల వ్యాధి

మద్యం విపరీతంగా ఎక్కువ సంవత్సరాలు సేవించిన వారిలో కాలేయం దెబ్బతినే అవకాశం ఉంది. ఈ జబ్బు ప్రథమ దశను ఫాటీ లివర్ అంటారు. అంటే ఆల్కహాల్ ప్రభావం వలన లివర్‌లో కొవ్వు చేరి క్రమంగా కాలేయాన్ని దెబ్బతీస్తుంది. కాని ఈ ప్రథమ దశ యందు మద్యపానం సేవించడం ఆపు చేస్తే పూర్తిగా కోలుకుంటారు.

రెండవ దశను ఆల్కహాలిక్ హెపటైటి అంటారు. ఈ దశలో మద్య పానీయాలవల్ల పసిరికలు సంభవించి లివర్ వాచి ఉంటుంది. ఆకలి మందగించి,



అలసట ఎక్కువగా ఉండి వాంతులతో రోగి బాగా అనారోగ్యంతో ఉంటాడు. కడుపుకు నీరు వచ్చి ఊదు పొట్టతో నీరసించి ఉంటాడు. ఇది ప్రమాదకరమైన ధశ.

ఈ దశలో కూడా మద్యపానాన్ని ఆపి వైద్య సహాయం తీసుకొని మంచి మందులు, విటమిన్లు, మినరల్స్, ప్రొటీన్లు మొదలగునవి వాడి రోగము నుండి బయటపడవచ్చు. కాని చాలా మంది ఈ స్థాయిలో కూడా ఆల్కహాల్ తీసుకోవడం ఆపక తరువాతి దశ అయిన సిరోసిస్ స్థాయికి చేరుకుంటారు.

సిరోసిస్ స్టేజిలో కడుపులో నీరు చేరుతుంది. కాళ్ళ వాపులు సంభవిస్తాయి. పసిరికలు కలుగుతాయి. ఆహార వాహికలో రక్త నాళాలు ఉబ్బుతాయి. ఇవి పగిలి రక్తము వచ్చి రక్త వాంతులు, రక్త విరేచనాలు సంభవించి ప్రాణాంతక పరిస్థితులు ఏర్పడుతాయి.

వీటన్నింటిని గుర్తుంచుకొని మద్యపానం సేవించే వారు తగు జాగ్రత్తలు, వైద్యుని సలహాలు పొంది, ఆరోగ్యం కాపాడుకోవాలి.

ఈ ఆల్కహాల్‌లో 'బి' వైరస్, 'సి' వైరస్ (హెపటైటిస్ బి, హెపటైటిస్ సి) కూడా ఎక్కువగా సంభవిస్తుంటాయి. ఇవి కూడా లివర్‌ను ధ్వంసం చేసి పసిరికలు, కాలేయ సంబంధ వ్యాధి వచ్చేలా చేస్తాయి.

పచ్చకామెర్లు - రోగ నిర్ధారణ

రక్త పరీక్షలు - **(ఎ) ఎల్ఎఫ్‌టి (లివర్ పని చేయు విధానము తెలిపే పరీక్షలు) :** ఈ పచ్చ కామెర్లలో పచ్చ దనానికి కారణము బిలిరూజిన్ అనే పదార్థం. రక్తంలో ఎల్ఎఫ్‌టి పరీక్షలో ఈ బిలిరూజిన్ ఎంత పెరిగిందో తెలుపుతుంది.

అందుల్లో ప్రత్యక్ష బిలిరూజిన్, పరోక్ష బిలిరూజిన్ శాతం ఎంత పెరిగిందో తప్పక తెలుసుకొనవలయును.

రక్త కణాలు పగలడంవలన వచ్చే పసిరికలో ఇన్‌డైరెక్ట్ బిలిరూజిన్ ఎక్కువ శాతంలో (80%) ఉంటుంది. హెపెటిసెల్యులార్, అబ్‌స్ట్రక్టివ్ జాండిస్‌లో డైరెక్ట్ బిలిరూజిన్ ఎక్కువగా ఉంటుంది. **(బి) ఎంజైమ్‌లు (ఎస్‌జిపిటి, ఎస్‌జిఓటి)** ఈ పరీక్షల్లో లివర్ ఎంజైమ్‌లు ఎంత పెరిగాయో తెలుస్తుంది. ముఖ్యంగా కాలేయ కణాలు నాశనం చెంది క్షీణించి, పగిలిపోవడం వలన ఈ ఎంజైమ్ రక్తంలోకి నిడుదల కావడం వలన ఎస్‌జిపిటి, ఎస్‌జిఓటి విలువలు పెరుగుతాయి. హెపటైటి వ్యాధిలో ఇవి చాలా ఎక్కువగా పెరిగే అవకాశం ఉంది.

క్రానిక్ హెపటైటి (పసిరికలు ఆరు నెలల కన్న ఎక్కువగా ఉన్నప్పుడు) చికిత్స చేసేసమయంలో ఈ ఎంజైమ్స్‌ను తప్పనిసరిగా పరీక్షిస్తారు.

ఆల్కటెనే ఫాస్పెటేమే అనే ఎంజైమ్స్ పైత్యరస నాళాల్లో పైత్యరస ప్రసరణకు అడ్డంకులు ఏర్పడినప్పుడు ఎక్కువశాతంలో పెరుగుతుంది. **(సి) సీరమ్ ప్రొటెం, ఎ.జి. నిష్పత్తి :** ఈ పరీక్షల్లో లివర్ నిర్మాణాత్మక క్రియల గురించి తెలుసుకోవచ్చు. **(డి) ప్రొతోంబీ పైన్ :** ఈ పరీక్ష పచ్చ కామెర్ల రోగుల్లో పసిరికలు ముదిరినపుడు పొంచి వున్న ప్రమాదాన్ని అంచనా వేయడానికి చాలా అవసరము. (ఇ) వైరల్ మార్కర్స్ : హెచ్.బి.ఎస్. ఎజి

యాంటీ హేవ్ ఐజిఎం : ఇందులో హెపటైటిస్ బి, ఇ పరీక్షలు మాత్రమే మనకు అందుబాటులో ఉన్నాయి. పెద్దల్లో సాధారణంగా వచ్చే పసిరికలు 'ఇ' వైరస్ వలన కలుగుతున్నాయి.

కలుషితమైన నీటి ద్వారా కలుగుతున్నాయి. ఈ 'ఇ' వైరస్ హెపాటైటి కనుగొనటానికి ఆంత్ హెచ్ఇవి ఐజిఎం పరీక్ష చేయాలి.

2. కామెర్లు : అల్ట్రా సౌండ్ స్కానింగ్ పాత్ర : లివర్‌లో (1) గడ్డలు - కాన్సర్ కిస్టర్ (2) అబ్రీమ్-పయోజెనిక్, అమీబిక్ (చీము చేరి ఉండుట) (3) లివర్ సైజ్ : పెద్దదిగా వాచిందా, చిన్నదిగా క్రుంగిందా (సిరోసిస్) తెలుసుకోవచ్చు. (4) కడుపులో నీరు చేరిందా? (5) పైత్యరస నాళాలు వాచినాయా (అడ్డంకుల వలన) (6) పిత్తాశయములో రాళ్ళు, పైత్యరస నాళ కాన్సర్, పిత్తాశయము కాన్సర్ (7) రసగ్రంధి గురించి తెలుసుకోవచ్చు. (8) మద్యపానము సేవించే వాళ్లలో లివర్ వాపు

లివర్ చిన్నదిగా క్రుంగి పీచు, పీచుగా అయిపోవడం, విషయాలు తెలుసుకోవచ్చు.

3. కామెర్లు, ఎండోస్కోప్ (1) చాలాకాలం కామెర్లు (ఆరు నెలలకు పైగా), పసిరికలు ఉండే వారిలో సిరోసిస్ వ్యాధి ఆరంభమైందని తెలిసికొనవచ్చు. ఎండోస్కోప్ అవసరం. (2) జీర్ణాశయంలో కాన్సరు వలన పసిరికలు కలిగిన వీడియో ఎండోస్కోప్ ద్వారా గుర్తించవచ్చు.

ఇ.ఆర్.సి.పి. అంటే ఏమిటి ?

ఈ పరీక్షలో ఎండోస్కోప్ ద్వారా పైత్యరస నాళాలను, క్లోమరస నాళాలను చాలా స్పష్టంగా పరీక్షించవచ్చు.

(వ్యాస రచయిత కర్నూల్ వైద్య కళాశాలలో గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్)

★

నేను డిగ్రీ చదువుతున్నాను. నా ముక్కు లావుగా ఉండి చూడటానికి ఉబ్బెత్తుగా ఉంటుంది. ఫ్రెండ్స్ హేళన చేస్తున్నారు. నా సమస్యకు పరిష్కారం చూపండి ?

- చక్రవర్తి, హైదరాబాద్

కొద్దిపాటి గద్దముక్కు మగవారికి సహజం. దానికి భిన్నంగా ఎక్కువగా ఉంటే ప్లాస్టిక్ సర్జరీ ద్వారా సరిచేసుకోవచ్చు. మీరు హైదరాబాద్‌లో ప్లాస్టిక్ సర్జన్‌ను కలిసి తగిన సలహా పొందవచ్చు.

-డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు,
ఎంఎస్,డిఎల్ఓ.
భారతి నర్సింగ్‌హోమ్, ఒంగోలు.

* * *

నా వయస్సు 37 సంవత్సరాలు. నాకు రాత్రివేళల్లో కనీసం ఆరుసార్లు యూరిన్ వస్తోంది. 10వ తరగతి నుండి ఇలాగే అవుతోంది. నేను నీళ్ళు ఎక్కువగా తాగుతాను కనుక ఎక్కువసార్లు యూరిన్ వస్తుందేమోనని అనుకుంటున్నాను. ఇది 'మధుమేహం' లక్షణమా? కాదా? వివరించగలరు

- సారెడ్డి రామచంద్రారెడ్డి, యాడికి, తిప్పారెడ్డిపల్లి

మధుమేహం వున్నవారికి మూత్రవిసర్జన అధికంగా ఉంటుంది. కానీ కొందరిలో మధుమేహం లేకపోయినా మూత్రవిసర్జన అధికంగా కనిపిస్తుంది. హార్మోను లోపం వలన ఇది ఏర్పడుతుంది. వాస్తవం వెల్లడికావాలంటే షుగరు పరీక్ష చేయించుకోవాలి. ఏమయినా మధుమేహవ్యాధి నివారణ వైద్యుని కలవడం మంచిది.

-డాక్టర్ కె.సీతారామయ్య,
ఎంబిబిఎస్,ఎఫ్ డిఐఎబి..,డిహెచ్ఏ.
వెంకటరమణ దయాబెటిక్ హాస్పిటల్,ఒంగోలు.





అనుమతి లేని కట్టడాలన్నీ కూల్చేశాం సార్. అక్కడ కనిపించేది ఒక్కటే అనుమతి తీసుకొని కట్టింది



మరో కొత్త మోడల్ కారు మార్కెట్‌లోకి రాబోతోందని విన్నాను. అదే నిజమైతే ఈ ఉద్యోగానికి గుడ్‌బై చెబుతాను



ఒక స్వాగతం కోసం

దృశ్యం నెమ్మదిగా అదృశ్యమవుతోంది
కాలం వేగంగా కళ్లముందే కదులుతోంది
ఎటు చూసినా కపోతాలు నేలకూలుతున్న విషాదమే
అన్ని వైపులా కపాలాలు పేలుతున్న శబ్దమే
ఒక కన్నీటి చుక్కకోసం ఎదురుచూద్దాం!

అధికారం నాగరికతపై పంజా విసిరింది
విధ్వంసం సంస్కృతిపై పగబూనింది
స్వప్నం పీడకలలకు వేదికైపోయింది
యుద్ధం వారి జీవితాల్లో ఒక భాగమైపోయింది
ఒక వీడ్కోలు కోసం వేచి ఉందాం!!

వాస్తవం ఒక్కోసారి చేదుగా ఉంటుంది
మౌనం శ్మశానానికి సంకేతం కాకూడదు
ప్రశాంతత అనేది డిక్షనరీలో పదం కారాదు
పతనమనేది మనిషి భవితను శాసించరాదు
ఒక స్వాగతం కోసం సన్నద్ధమవుదాం!!!

-గోలి గురుప్రసాదరావు

జనవరి ఫస్ట్

పండగ పబ్బాలకు
పెళ్లి పేరంటాళ్లకు
ఇళ్లూ వాకిళ్లూ శుభ్రం
చేసుకొని
పాతగోడల్ని వెల్లవేసి
మళ్లీ
చమ్కాయించినట్లు
చేదు అనుభవాల
సాలెగూళ్లను
ఆదరాబాదరాగా
దులిపేసుకొని
బాధాతప్త హృదయాల్ని కొత్త కోరికలతో చల్లబర్చుకొని
ఒళ్లంతా కళ్లు చేసుకొని
ఒకటే హడావిడి పడిపోతాం
ఏటేటా జనవరి ఫస్ట్ కోసం..!
మూట కట్టుకొస్తుంది వరాలని
అది మాత్రం ఏం చేస్తుంది?
అదీ కాలం చేతిలో కీలుబొమ్మే..
ఎవరో ఉద్ధరిస్తారనుకోవడమేమిటి
ఎవరిని వారే ఉద్ధరించుకోవాలని గీతావాక్యం
ఎప్పటికప్పుడు మరిచిపోవడం
ఎప్పుడూ ఆశగా ఎదురుచూడ్డం
అనాదిగా సాగుతున్న రివాజే
రివాజులంటే జనానికెంత మోజో!!

-మహబూబ్ కమల్

'పనిష్మెంట్'

బానిసత్వం కాడికి
కొందరు ఎద్దులౌతారు
కొందరు పంచకింద
పాడి గేదెలౌతారు
యజమాని చెర్నాకోల దెబ్బ
నడిచే ఎద్దు మీదే మళ్లీ..మళ్లీ..
నొప్పి నషాళానికెక్కినా
అమ్ముడయ్యాక తలవాల్చాల్సిందే
బాధను గుర్తించమని కొమ్మెగరేస్తే
కొందరు గంగడోలు నిమురుతారు
ఇంకొందరు మరో దెబ్బ వేస్తారు

-ఎస్.ఆర్.పృథ్వి

పిల్లలు చెప్పిన మాట వినకపోతే

సింహాద్రి సరోజిని

సన్నజాజి తీవెలోయ్
సంపెంగ పూవ్వులోయ్
చిలిపి చిన్నారులోయ్
పాపలు సిలులొలికే చిన్నారులోయ్

అని ఒక కవి రాశారు. పిల్లలను పువ్వులతో పోల్చడం ఈనాటిది కాదు. పిల్లలనగానే మనకు వారి అల్లరే గుర్తుకొస్తుంది. అయితే ఈ పిల్లల అల్లరిలో కూడా అనేక తేడాలుంటాయి. కొందరు పిల్లలు గలగలా మాట్లాడితే, మరికొందరు మౌనంగా వుండి పరిసరాలన్నింటినీ గమనిస్తూ ఉంటారు. కొందరు పిల్లలు అమ్మానాన్నా చెప్పినట్లు బుద్ధిగా నడుచుకుంటే, మరికొందరు మొండిఘటాల్లా వుంటారు. కొందరు పిల్లలు పెద్దవాళ్ళు చెప్పిన పనులు చక్కగా చేసుకుపోతారు. మరికొందరేమో నిర్మొహమాటంగా చెయ్యమని పైకే చెప్పేస్తారు. మరికొందరు పైకి చెప్పకపోయినా, మనస్సులో చేయవద్దని నిర్ణయించుకుంటారు. పిల్లలు ఇలా చిన్నతనం నుంచే చెప్పిన మాట వినకుండా తయారయితే పెద్దలకు ముఖ్యంగా తల్లిదండ్రులకు ఎంతో బాధగా వుంటుంది.

పిల్లలను పువ్వులతో పోల్చాము కాబట్టి ఇక్కడ మనం ఒక విషయాన్ని జాగ్రత్తగా గమనించాలి. పువ్వు క్రమంగా పెరుగుతూ అది వికసించే సమయం వచ్చినప్పుడే వికసిస్తుంది. అలాకాకుండా దానిని మొగ్గలోనే వికసింప చేయాలనుకుంటే అది మొగ్గగానే వాడిపోయే ప్రమాదముంది. అలాగే పిల్లలను కూడా వారి వయస్సుకు తగినట్లుగా మంచి అలవాట్లను, పద్ధతులను వారికి జాగ్రత్తగా అర్థమయ్యేలా చేస్తే వారు వాటిని ఎలాంటి నష్టం లేకుండా గ్రహించగలుగుతారు. తల్లిదండ్రులు క్రమశిక్షణ పాటిస్తే అదే పిల్లలకూ అలవడుతుంది. పెద్దలు నియమబద్ధంగా, నిజాయితీగా వుంటే దానినే పిల్లలు కూడా అనుకరిస్తారు. అనుకరణ అనేది పసితనం నుంచే వుంటుంది. కాబట్టి పెద్దలు తమ ప్రవర్తన సక్రమంగా వుండేలా చూసుకోవాలి.

చెప్పిన మాట వినని పిల్లలను కొట్టీ, కోప్పడీ ప్రయోజనం వుండదు. పెద్దలు చెప్పిన విషయాలు గ్రహించి వాటికి అనుగుణంగా నడుచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వారికి ఓపికగా వివరించాలి. దానికోసం కొన్ని ఉదాహరణలను వారికి చూపాలి. పెద్దల మాట పట్టించుకోకుండా తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించడం వల్ల పిల్లలకు దెబ్బ తగలడమో, కాలడమో, మరొకటో జరిగిందనుకోండి. మేము చెప్పిన మాట వింటే అలా జరిగి వుండేది కాదుగదా అని వారికి చెప్పాలి. ఇకముందైనా అలా నడుచుకోవడం నష్టదాయకమని వారికి అర్థమయ్యేలా చేయాలి.

పిల్లలను దారిలో పెట్టాలనుకొన్నప్పుడు పెద్దలు దృఢచిత్తంతో వ్యవహరించాలి. ఎలాంటి బలహీనతలకు లోనుకాకూడదు. ఉదాహరణకు పిల్లలు ఎక్కువగా అల్లరి చేసినా, చెప్పిన మాట వినకపోయినా ఒక గంట వరకూ నీతో మాట్లాడను అన్నామనుకోండి లేదా ఈ రోజు టీవీ చూడనివ్వను అన్నామనుకోండి. దానిని కచ్చితంగా అమలు చేయాలి. పిల్లవాడు జారిగా ముఖం పెట్టగానే సరే ఇప్పటికి మాట్లాడుతాను లేదా టీవీ చూడనిస్తానని మెత్తబడకూడదు. మన బలహీనతను ఆసరాగా చేసుకొని పిల్లలు తమ పనులు గడుపుకుంటారు.

కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలు అల్లరి చేస్తుంటే కించపరిచే పేర్లతో పిలుస్తుంటారు. అది సరైన పద్ధతి కాదు. అలా పేర్లు పెట్టి పిలుస్తున్నప్పుడు వారి స్నేహితులు వింటే ఆటల్లో వారు కూడా ఆ పేర్లతో పిలిచి ఆటపట్టిస్తారు. ఇది పిల్లలు ఆత్మన్యూనతకు లోనయ్యేందుకు దారితీస్తుంది. దానివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. వారు పెద్దవారైనా కూడా ఆత్మన్యూనతతో బాధపడేందుకు అది కారణమవుతుంది.

కాబట్టి ఇల్లే పిల్లలకు తొలిపాఠశాల అని, తల్లిదండ్రులే తొలి గురువులని మనం గుర్తుంచుకోవాలి. పిల్లల అల్లరిని ఓపికగా భరిస్తూనే వారిని మంచి మార్గంలో మలిచేందుకు ప్రయత్నించాలి. వారి వ్యక్తిత్వాన్ని సమున్నతంగా తీర్చిదిద్దాలి. తల్లిదండ్రులు నిరంతరం పిల్లల ప్రవర్తనపై ఒక కన్నేసివుంచాలి. వారిని నిరంతరం సరిదిద్దతూనే వుండాలి. వారిని మంచి మాటల ద్వారా సరిదిద్దాలే తప్ప కించపరచడం ద్వారా సరిదిద్దాలనుకోకూడదు. కించపరిచో, హీనపరిచో సరిదిద్దజూస్తే అది చెడు ఫలితాలనే ఇస్తుంది. మనం కూడా పిల్లలను మంచిగా ప్రభావితం చేసే విధంగా మన ప్రవర్తనను, వ్యక్తిత్వాన్ని వుంచుకోవాలి.

అలాగే తల్లిదండ్రుల్లో ఒకరు పిల్లలను మంచిమార్గంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నపపడు రెండవ వారు జోక్యం చేసుకొని వెనకేసుకు రాకూడదు. తల్లిదండ్రులలో ఏకాభిప్రాయం లేదని పిల్లలు గమనిస్తే వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పురాదు. పైగా దానిని ఆసరాగా తీసుకొని తల్లికోప్పడితే తండ్రిదగ్గరకు వెళ్ళడం, తండ్రి కోప్పడితే తల్లిదగ్గరకు వెళ్ళడం చేస్తారు. తన భార్య లేదా భర్త అనుసరించే పద్ధతి రెండవ వారికి నచ్చకపోయినా పిల్లల ముందు దానిని వ్యక్తపరచడం ఏమంత మంచి పద్ధతి కాదు. ఆ విషయాలు పిల్లలు లేనప్పుడు చర్చించుకుంటే ఉపయోగకరంగా వుంటుంది. ★



'లఘుమిత్ర'

పూర్వం సుదర్శన తటాకంలో లఘుమిత్ర అనే చేప ఉండేది. దానికి అందచందాలతో ఉన్న శరీరమంటే ఎంతో ఇష్టం. నీటిలో తిరుగాడే కప్పల జిడ్డు శరీరాలను చూసి ఎంతో అనహ్యించుకునేది. ముఖ్యంగా దీర్ఘమిత్ర అనే పెద్దకప్ప అంటే ఇంకా అయిష్టం. దాని పెద్ద శరీరాన్ని చూడగానే ఒళ్లంతా కంపరమెత్తేది.

అయితే నీటిలోనూ, నేలపైనా తిరుగాడే కప్పల శక్తి చూసి ఒకింత ఆశ్చర్యపోయేది. తన అందమైన శరీరానికి ఉభయచర శక్తి కూడా తోడైతే తన కన్నా అదృష్టవంతులుండరని తలచింది. ఆ లక్షణాన్నెలాగైనా స్వంతం చేసుకోవాలని తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. అదేంటంటే..ప్రాణాయామం చేయడం. నీటిలో కావలసినంత గాలిని పీల్చుకొని ఒడ్డుపైకి వచ్చి చేతనైనంత సేపు ఉండి తిరిగి నీటిలోకి వెళ్లిపోవడం. అలా రోజూ చేస్తే కొద్దిరోజులకు ప్రాణామాయం వలన ఎక్కువ సేపు భూమిపై జీవించవచ్చని అనుకుంది.

ఓ మంచిరోజు చూసి ప్రాణాయామం ప్రారంభించింది. మూడో రోజు నీళ్లలోంచి బయటకు వచ్చి ఒడ్డుపై కళ్ళు మూసుకొని ఊపిరి బిగబట్టింది. చెరువులో నీళ్ళు తాగడానికి వచ్చిన ఏనుగుల మంద వలన చెరువుకు గండిపడింది. నీరంతా బయటకు రావడం మొదలైంది.

కాసేపటి తరువాత నీటిలో కెళదామని కళ్ళు తెరిచిన లఘుమిత్రకు, తగ్గిన నీటిమట్టం వలన నీరు చాలా దూరంలో కనిపించింది. పరిస్థితి గమనించి శక్తినంతా ఉపయోగించి నీటిలోకి దూకేందుకు ప్రయత్నించింది. కొంతదూరం మాత్రం వెళ్ళగలిగింది కానీ నీటిని చేరుకోలేకపోయింది. ఒంట్లోని శక్తంతా కోల్పోయినట్లయింది. ప్రాణవాయువు లేక ఊపిరి ఆడటం లేదు. ప్రాణాల మీద ఆశ వదులుకొని ఇసుకలోనే శోషవచ్చి పడిపోయింది.

ఇదంతా గమనించిన దీర్ఘమిత్ర వెంటనే తన మిత్రులందరినీ పిలిచింది. తుంగగడ్డి తెప్పించి వాటి ఒక కొసను లఘుమిత్రకు, రెండోవైపు తన మిత్రుల కాళ్లకు గట్టిగా కట్టింది.

అన్నింటినీ ఒకేసారి గెంటిస్తూ లఘుమిత్ర నీటిలో పడేట్లు చేసింది. నీటిలో పడగానే పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లయింది లఘుమిత్రకు. అప్పట్నించి తన అహంకారపూరిత ప్రవర్తనను మార్చుకోవడమే కాదు, శారీరక పరిమితిని మించిన దుస్సాహసాలెన్నడూ చేయలేదది.

-శాఖమూరి శ్రీనివాస్



చిన్నారి చిత్రకారులు



పి.వి. రాఘవేంద్ర, 9వ తరగతి
ప్రగతి విద్యానికేతన్, కుంభం

పి. హరిణి, 5వ తరగతి
రైల్వే హైస్కూల్, కాజీపేట

సిహెచ్. నాగేశ్వర్‌రావు, 8వ తరగతి
జడ్‌పి హైస్కూల్, మధురవాడ

ఎ. సుజిత్, 9వ తరగతి
ప్రగతి విద్యానికేతన్, కుంభం

కోటి ఆశలతో కొత్త సంవత్సరం

నేస్తాలూ,

మరో రెండు రోజుల్లో కొత్త సంవత్సరం వస్తోంది. మీరంతా ఎంతో ఉత్సాహంగా నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవాలని కోరుకుంటున్నాం. కొత్త సంవత్సరం నుండి కొత్తగా ఏమైనా నిర్ణయాలు తీసుకోవడం గానీ, మరేపనినైనా కాని మొదలుపెట్టేవాళ్ళు అనేకమంది ఉంటారు. డిసెంబర్ చివరితేదీ అర్ధరాత్రి నుండే కొత్తసంవత్సర వేడుకలు ప్రారంభమవుతాయి. 'హ్యాపీ న్యూఇయర్' అంటూ ఒకరికొకరు కరచాలనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటుంటారు.



కొత్త సంవత్సరం రోజు స్నేహితులకు, బంధువులకు, తెలిసిన వారికి, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియచేస్తారు కదా. శుభాకాంక్షలు తెలియ చేయడంలో గ్రీటింగ్స్ ప్రాముఖ్యత ఎంతో ఉంటుంది. రకరకాల బొమ్మలు, క్యాప్షన్స్‌తో అందమైన పేపర్‌పై రంగులో ముద్రించిన ఎన్నో రకాల

'మంత్రి తెలివి'

పూర్వం కాశీరాజ్యాన్ని సుధత్తుడనే రాజు పరిపాలిస్తుండేవాడు. అతను మూర్ఖుడు మాత్రమే కాక విచిత్ర వ్యక్తి. అతని వద్ద నీలకుడు అనే మంత్రి ఉండేవాడు. సుధత్తుడి మూర్ఖపు నిర్ణయాల వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంత్రి చూసుకునేవాడు. ఒక రోజు రాజు, మంత్రి కావేరీ నదికి వెళ్ళారు. ఆ నది పడమర నుండి తూర్పుకి ప్రవహిస్తోంది.

'మన రాజ్యం తర్వాత ఉన్న రాజ్యం పేరేమిటి?' అడిగాడు రాజు.

'రాజవరం' అని చెప్పాడు మంత్రి.

'మన రాజ్యం నుండి వెళుతున్న కావేరీ నీటిని రాజవరం రాజ్య ప్రజలు కూడా వాడుతున్నారన్నమాట' అని అనుకొని వెంటనే కావేరీ నదికి ఆనకట్ట కట్టించండని ఆజ్ఞాపించాడు.

రాజాజ్ఞ ప్రకారం కావేరీ నదికి ఆనకట్ట నిర్మించారు. అయితే నీటి ప్రవాహం అధికమై కాశీరాజ్యంలోని కొన్ని ప్రాంతాలు పూర్తిగా నీటమునిగాయి. ఆ ప్రాంతాల ప్రజలు వచ్చి మంత్రికి తమ బాధలు చెప్పుకుంటారు. రాజుకు వీరి బాధలు ఎలాగూ పట్టవు కనుక తానే ఏదైనా చేయాలనుకుంటాడు.

ఆ రోజుల్లో గడియారాలు లేవు కనుక రాజ్యం మధ్యలో ఉన్న ఓ చిన్నకోటలో గంటలు మోగించేవారు. ఒకసారి మోగిస్తే ఒక గంట అయినట్లు లెక్క. ఒక రోజు మంత్రి గంటలు కొట్టే వాడి దగ్గరకు వెళ్ళి..

'ఈ రోజు రాత్రి ప్రతి అరగంటకు ఒక గంట అయినట్లు మోగించు' అని ఆజ్ఞాపించాడు. మంత్రి ఆదేశం మేరకు గంటలు కొట్టేవాడు ప్రతి అరగంటకు ఒక గంట అయినట్లుగా గంట మోగిస్తాడు. అప్పుడు రాజుతో సహా అందరూ అర్ధరాత్రికే లేచికూర్చుంటారు. సూర్యోదయం ఇంకా కావడం లేదేమిటని ఆశ్చర్యపోతారు.

రాజు వెంటనే మంత్రిని పిలిపిస్తాడు. 'పొద్దున ఆరు అయినా ఇంకా సూర్యోదయం కావడం లేదేమిటని?' అడిగాడు.

అప్పుడు మంత్రి 'రాజా! పోయిన వారం మనం రాజవరం రాజ్యానికి నీరు పోకుండా ఆనకట్ట కట్టించాం కదా. వారు ఇప్పుడు ప్రతీకారంగా మన రాజ్యానికి సూర్యోదయం లేకుండా సూర్యున్ని బంధించారు' అని చెప్పాడు.

అప్పుడు రాజు 'వెంటనే కావేరి నదికి కట్టిన ఆనకట్టను తొలగించండి' అని ఆజ్ఞాపించాడు. ఆనకట్టను పడగొట్టే సమయానికి సూర్యోదయం అవుతుంది. రాజు ఎంతో సంతోషిస్తాడు. మంత్రి తెలివిని అందరూ మెచ్చుకుంటారు.

సేకరణ : **కుంజా సంతోష్‌కుమార్**, 9వ తరగతి,
లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్, భద్రాచలం, ఖమ్మం జిల్లా

గ్రీటింగ్ కార్డులు మనకు షాపుల్లో దొరుకుతాయి కూడా. అయితే కొందరు గ్రీటింగ్‌కార్డులను స్వయంగా కూడా తయారుచేసుకుంటారు. తమకు నచ్చిన బొమ్మను వివిధ రంగుల్లో వేసి పంపేవారు కొందరు. అందమైన గ్రీటింగ్‌కార్డులు షాపుల్లో దొరుకుతున్నప్పటికీ స్వయంగా తయారుచేస్తే ఎంతో సంతృప్తిగా ఉంటుంది కదా. కొద్దిపాటి ఖర్చుతోనే మంచి గ్రీటింగ్‌కార్డులు ఎలా తయారు చేయాలో ఈ వారం తెలుసుకుందాం.

<u>కావాల్సిన వస్తువులు :</u> డ్రాయింగ్ షీట్లు, కలర్ స్కెచ్ పెన్నులు లేదా వాటర్ కలర్స్, పెన్సిల్, రబ్బరు, గమ్ బాటిల్, పంపడానికి కవర్లు, తగినన్ని స్టాంపులు.

గ్రీటింగ్స్ తయారీ వారి వారి అభిరుచిని బట్టి ఉంటుంది. అందరూ ఇలాగే గ్రీటింగ్స్ తయారుచేసి పంపాల్సిన అవసరం లేదు. మీ పాఠశాలల్లో డ్రాయింగ్ గురించి చెబుతారు కనుక కొద్దిపాటి శ్రమతో అందమైన గ్రీటింగ్ కార్డులను స్వయంగా తయారు చేసుకోవచ్చు. ముందుగా మీరు ఎంచుకున్న కవర్ సైజును బట్టి అందులో ఇమిడే విధంగా డ్రాయింగ్ షీట్‌ను కత్తిరించుకోవాలి. చుట్టూ పెన్సిల్‌తో బార్డర్ లైన్ గీసుకోవాలి. మీకు బాగా గీయడం వచ్చిన బొమ్మలను షీట్‌లో ఏదో ఒక వైపుకు పెన్సిల్‌తో గీయాలి. బాగా వచ్చిందనుకుంటే నల్ల స్కెచ్‌పెన్‌తో అవుట్‌లైన్స్ గీయాలి. వాటర్‌కలర్స్ వాడే అలవాటు ఉన్నవారు 'జీరోపాయింట్ బ్రష్‌తో అవుట్‌లైన్స్ గీయవచ్చు. ఆ బొమ్మకు ఏఏ ప్రాంతంలో ఏ రంగు వేస్తే బాగుంటుందో చూసి వాటిని నింపాలి. బొమ్మకు వేసిన రంగులను డామినేట్ చేయకుండా బ్యాక్‌గ్రౌండ్ రంగులు వేయాలి. ఆ తరువాత పెన్సిల్ గీతలను చెరిపివేసి అవుట్‌లైన్‌ను కూడా స్కెచ్‌తో గీయాలి. ఆ తరువాత దాన్ని కవర్‌లో పెట్టి ఎవరికైతే పంపదలచుకున్నారో వారి అడ్రస్ రాసి తగినన్ని స్టాంపులు అంటించాలి. బొమ్మలు డ్రాయింగ్ పుస్తకాల్లో అసంఖ్యాకంగా దొరుకుతాయి కనుక మీకు నచ్చిన బొమ్మను గీయవచ్చు.

నూతన సంవత్సరం సందర్భంగా వారికి మీరు తెలియచేసే శుభసందేశాన్ని కూడా ఈ బొమ్మపైనే ఖాళీస్థలంలో రాయవచ్చు. కింద మీ పేరు కూడా రాస్తే తీసుకున్నవారికి బాగా గుర్తుంటుంది. మీరు ఎంతో ఖర్చుపెట్టి అందమైన గ్రీటింగ్ కార్డు ఇచ్చినా మీరు స్వయంగా కష్టపడి రూపొందించిన గ్రీటింగ్‌ను చూసి ఎవరైనా తప్పకుండా ఆనందిస్తారు, మిమ్మల్ని అభినందిస్తారు. మీకు కూడా నూతన సంవత్సర శుభాకాంక్షలు.

మీ నేస్తం

రుక్మిణి

"ఒరేయ్.. ఇగ మనకు తిండికి మాత్రం ఏ ధోకా లేదురా... హమ్మయ్య!" పచ్చబాబు అరుగు మీద ఆసనం వేస్తూ బీడీ వెలిగించాడు. చుట్టూ తీరుబాటుగా కూర్చున్న జనాలకు అదేదో 'సోది' కబురు కిందనే అనిపించింది. పనికి మాలిన పథకాలు.. అక్కరకురాని అవసరాలు అతి సొగసుగా చెప్పడంలో మన పచ్చబాబు ధిట్టేనాయె!

అంతకుముందు ఇదే చెట్టుక్రింద అరుగు మీదెక్కి పంచె.. చొక్కా వూడుతున్నా.. లెక్కచెయ్యకుండా చెడామడా ఐ.టి.. హైటెక్కుని ఒకటే కల్లు తాగిన కోతిలా చీదరబాదరాగా చిందులు తొక్కాడాయె! ఏమయింది? సమాచార విప్లవం.. ఉపాధి కల్పన.. కంప్యూటరు కోర్సులు.. విదేశీ మారక ద్రవ్యం.. ఐ.టి. ఎగుమతులు.. ఛ.. ఛ..!

"ధోకాలేదేమో గానీ పీకపూడిపోతుంది.. పస్జేసేదానికి 'ఆహారం.. పథకం' అన్నారు గదా.. వందల వందల కరువుబియ్యం మిషిన్లు చేసిన పనికీ.. ఎవడూ చెయ్యని పనిక్కూడా బియ్యం మిల్లులకే తరలిపోతుండె!" యాద్గిరి కాండ్రించి ఉమ్మి ఉస్సురని కూలబడ్డాడు.

"ఆ అజ్ఞానమే పనికిరాదు.. బి.టి – మన రాష్ట్రానికి వచ్చేసింది. ఇక మన పోరగాండ్లకు ఉద్యోగ భయం లేదు. తిండికి కరువులేదు!" పచ్చబాబు ఓ చిందువేసి చిటికె కూడా వేశాడు!

"బి.టి.? ఓర్నీ.. గా బి.టి. – బోల్‌గార్డు పత్తి గింజలేనా? పడిపాయె! మన రైతులందరూ గవి వేసినంకనే పురుగుల మందులు తాగి పుటుక్కుమన్నది. మళ్ళా గవిదెచ్చి పెడుతున్నారు!" జక్కులోడు మటమటలాడుతూ చీదరించుకున్నాడు. పచ్చబాబు రావిచెట్టుకేసి తలబాదుకున్నంత పనిచేసి చెవట్లు తుడుచుకుని ఉస్సురని కూలబడ్డాడు.

సర్సరెగానీ.. ఐ.టి. దాని సంగతేమాయె? అయిదారు రౌండ్లు పోరగాండ్లందర్ని ఊదర గొట్టి ఉన్న డబ్బులు ఊడ్చేసి పనికిరాని వెధవలకింద చేసిపారేస్తిరి. వేలకోట్ల భూముల్ని ఎవడెవడికో అప్పజెప్పి.. ఒప్పందాలు చేసుకుని.. అప్పులుచేసి తిప్పలు తెచ్చిపెడితిరి!" మల్లేశు బహుమంటగా ఒన కోపాన్నంతా కక్కాడు.

"అరె.. ఐ.టి. అంటే ఏంటి? సుదూర సమాచార సాంకేతిక పరిజ్ఞాన విప్లవం! దాన్ని ప్రపంచంలోనే మన రాష్ట్రాన్ని మొట్టమొదటి స్థానంలో నిలిపిపారేశాడు మన చంద్రబాబుగారు. అది దూర ప్రాంతాలకు చేరే.. చేర్చే విజ్ఞానం.. ప్రపంచం ఒక కుగ్రామం. దాని దోవ అది చూసుకుని అట్లా.. అట్లా.. వానపాంలా పల్లె పల్లె నుండి, సందు గొందుల్నుండి పాకి.. పాకి.. హైటెక్ సిటీ.. హైదరాబాదు మీదుగా అట్లా అమెరికాకు వెళ్ళిపాయె! మరిపుడు మహదానందంగా బి.టి..అంటే 'బయోటెక్నాలజీ' విప్లవం వచ్చి కూలబడింది!

బయో.. విప్లవం... అనేసరికి ఏ పనీపాటా.. తిండీతిప్పలూ లేవు. కాబట్టి అట్లా బుర్రకాయలాడించి అంతా వినడానికి సిద్ధపడి పోయినారు!

"అసలీ జినోమ్ పటం.. జానా బెత్తాకాదు.. జన్యు విప్లవం.. హుమ్మ్... జీవకణ పరిశోధన.. అదిగాని చేసిపారేస్తే అసలు మనకి ఆకలిదప్పులేగాకుండా – చావు మరణాలు కూడా వుండవన్నమాట! భగవంతుడు వ్రాసిన

రాతల్ని పూర్తిగా చెరిపి పారేసి మనిష్టం వచ్చినట్లు కష్టంలేకుండా బతకడం... !" జక్కులోడేమో అర్థంగాక నోరు తెరిచాడు. చూస్తే ఇదంతా ఏదో బుర్రతిరుగుడు యవ్వారంలాగుంది. మరయితే ఈ మాటలేమో కొత్తకొత్తగా వున్నాయిగదా!

"ఇదిగానీ మన 'బయోటెక్ హబ్బులో సాధిస్తే గింజల్లేని కూరగాయల్ని పండించుకోవచ్చు... తొక్కల్లేని అరిటి కాయలు.. సేపులు.. రోగాలు తగలని మిరపకాయలు.. పత్తి.. పటాలం.. అబ్బో! అసలు "విత్తనాల్లేకుండా గిత్తల"ను 'తయారు' చేసుకుని ఛల్.. ఛలో.. పొలాల వెంటబడి ఒకటే వ్యవసాయం! ఇక జూస్కో.. పాలంటేపాలు.. వెన్నంటే వెన్న... జున్ను.. హెరిటేజ్ పాకెట్లు.. ఇంటి ముంగిట్లో కుప్పలు తెప్పలు...

"విత్తుల్లేని గిత్తల" విషయంతో జక్కులోడి బుర్రంతా గిరగిరా తిరిగి పోయింది. ఇదేదో కానిపనిలా.. కాలజ్ఞానంలోని కడపటి పేజీలా అంతా గజిబిజిగా వుంది. చంద్రబాబుగారు ఇట్లాంటి విచిత్రాలే చేస్తాడు మరి!

"గురూ.. గురూ.. ఈ విత్తనాల్లేని గిత్తల సంగతేంది? ఈ జానోమూ బాణాలూ.. గింజల సంగతీ... బీటీ.. భలే బాగుందే?" గింజుకుంటూ అడిగాడు.

"ఒరే.. అదే మరి బి.టి. గమ్మత్తు! ఇపుడు నువ్వున్నావుగదా..నువ్వే వందా రెండు వందలూ.. ఎన్నిఏండ్లంటే అన్నేండ్లు బతికే మందులు తయారైపోతున్నాయి.

ముందు యాద్గిరి విరుచుకు పడ్డాడు.. మల్లేశుకు గుండాగినంత పనయింది. జక్కులోడు మాత్రం నిరుత్తరుడయ్యాడు.

"అదేందీ.. అన్నేండ్లు బతకటవే.. ఈ అయిదారేండ్ల బాబుగారి... బ్యాంకుగారి దెబ్బకే మేం పెడబొబ్బలు పెట్టిపోతున్నాంగదా ! వామ్మో.. వామ్మో.. ఇంగ బతకడం మా చాతకాదు గురూగారో...!"

మళ్ళా రెండోసారి రావి చెట్టుకేసి పచ్చబాబు తల లపలప బాదుకున్నాడు. "అది బయో విప్లవం.. దాంతో మనుష్యుల... జంతువుల ఆయుష్షు పెంచవచ్చు.. కొత్తకొత్త రూపాలు.. రంగులు.. వేషాలు.. మీసాలు వేటినంటే వాట్ని సృష్టించ వచ్చు!"

"అద్సరే.. మరి అంతలావైనపుడు మొన్న అలిగి అలకపాన్పులెక్కిన తెలుగు దేశం యమ్మెల్లేలకు మంత్రి పదవులు సృష్టించి వాండ్ల మొగాన పారెయ్యొచ్చుగదా! ఎందుకీ అసమ్మతుల పీకులాట.. గడబిడ!" యాద్గిరి తేరుకునిలేచి నింపాదిగా అడిగాడు. పచ్చబాబు మూడోసారి తల చెట్టుకేసి బాదుకున్నాడు.

"అర్రె.. మీకు బుర్రల్లేవ్! సమజ్‌కాదు.. కొత్తరకం జీవుల్ని తయారు చెయ్యటం అంటే అర్థం కావడం లేదురా.. దమాఖ్ లేదు.. అరె.. బి.టి.లో కొత్త వంగడాలు.. కొత్త పరిశోధనలు.. కొత్తరకాలు.. భోలెడన్ని ఉపాధి అవకాశాలు.. అమెరికా వాడి తలదన్నే కార్యక్రమం.. కథాకమామిషు..!"

రెండోసారి 'అమెరికా' అన్నపేరు విన్న యాద్గిరి దబ్బున వెనక్కు విరుచుకుపడి పోయినాడు.

"అంటే గురూ! అసలు ఈ బి.టి. దుకాణం ఎపుడు పెట్టిండూ? మరి ఎవడు వందల వందలేండ్లు బతికేటట్లు ఖరారు చేసుకుంటండ్రు... వార్నీ!" జక్కులోడు తబ్బిబ్బుపడిపోయాడు. పచ్చబాబు గుర్రుగా చూసి గొంతు సవరించుకున్నాడు!

"ఒరే.. సాపుర్‌జీ.. పల్లోంజీ గారికో మూడ్నాలుగొందల ఎకరాల భూమి ఇస్తే దాన్లో ఈ బయోటెక్ పార్కు... అది మన ఖండంలోనే అఖండమైంది... అసలు మన కుక్కలూ... పిల్లులూ... ఏనుగులూ... లొటపిటలూ.. వీటి రూపాన్ని మార్చి పారేస్తుంది.. అంతా అద్భుతం!"

మూర్ఛనుండి లేవబోయిన యాద్గిరి 'మళ్ళా ఎందుకని' సర్దుకుని వెనక్కు పడిపోయాడు. జక్కులోడికిదంతా గందరగోళంగా, తమాషాగుంది. పచ్చబాబు వెంటనే వీలుచూసుకుని తగులుకున్నాడు.

"ఒరే.. తోకలేని జంతువేదో చెప్పండ్రా.. చెప్పు.. చెప్పు..!"

యాద్గిరి వాయువేగంగా ఆలోచించి... గడబిడగా లటుక్కున 'మనిషి' అనేశాడు.

"అదీ.. అద్గదీ.. ఈ బయోటెక్ దెబ్బకు మన మనుషులక్కూడా తోకలు పుట్టించవచ్చన్న మాట! అంతా అద్భుతం! మెడకాయల్లేని లొటపిటలు.. రెక్కల్లేని కాకులు.. కాళ్ళేలేని కారెనుములు.. కండ్లులేని కుందేళ్ళు.." పచ్చబాబు తన్మయంగా చెప్పుకుపోతున్నాడు. జక్కులోడిలో పుంఖానుపుంఖాలుగా అనుమానాలు చెలరేగాయి...

"మరయితే గురూగారూ.. అసలు తోకలు తోకలంటున్నారుగానీ... అసలు చంద్రబాబుగారి మీద మాకేం నమ్మకం కలగడం లేదు. 'ఆదరణ' కింద పనిముట్లే ఇవ్వడంలేదాయె.. దీపం దీపం అని పూరాగా గ్యాసు బండలిస్తంలేదాయె! ముసిలోళ్ళ పింఛన్లుపాయె.. ఉన్న కార్డులన్నిటిని ఇరగ్గోసిరి.. ఉద్యోగాల్నే ఊడబీకుతున్నరా.. ఇంగ మరి మాకు మళ్ళా కొత్తగా 'తోక'ల్నిస్తారంటే నాకైతే నమ్మబుద్ధికాటం లేదండీ.. ఈ బి.టి. తోకలు మాలాంటోల్లకెందుకండీ....

పచ్చబాబు నోరు నోరంతా బార్లా తెరిచాడు!

★

అతను అమెరికా

లక్ష్మి

మా అబ్బాయి ఆస్ట్రేలియాలో ఆర్కిటెక్టుగా పని చేస్తున్నాడని చెబితే అలాగా అంటారు. లండన్లో డాక్టరుగా వున్నాడంటే అయ్‌సీ అంటారు. ఫ్రాన్స్‌లో ఇంజనీరంటే తీసిపారేస్తారు. అమెరికాలో వున్నాడంటే మాత్రం - ఏం చేస్తున్నాడని అడక్కుండానే - అమ్మో అంటారు! అదృష్టవంతులు మాత్రమే అమెరికాలో వుంటారని చెప్పుకుంటారు. అమెరికాముందు - జపాన్ చైనాలు, రష్యా బ్రిటన్లతో పాటు తదితర దేశాలు సమస్తం ఆఫ్టరాల్‌గా కొట్టిపారేస్తారు. పై చదువులకు అబ్బాయి అమెరికా వెళ్ళేడంటే చాలు వణికిపోతారు. చదువు పూర్తయ్యేక సంగతేమిటని అడగనే అడగరు. అమెరికాలోనే ఉద్యోగం దొరుకుతుందని చెబుతే వామ్మో అంటారు. సినీమాల్లో కూడా ఇదే తంతు! ఆ కథల్లో అమెరికానే పెద్దదిక్కుగా చెప్పుకుంటారు. చిన్నబ్బాయి అమెరికా నుంచి దిగుతున్నాడని చెబుతారేగాని స్విట్జర్లేండు నుంచి వస్తున్నాడని ఏ సినీమాలోనూ చెప్పరు. అబ్బాయి విదేశాల్లో వున్నాడంటే - చచ్చినట్టు అమెరికాలోనే వున్నాడని మనం అర్థం చేసుకోవాలి! మన ఆడపిల్లలకి పనిగట్టుకుని అమెరికా సంబంధాలే వెతుక్కుంటాం. అవసరమైతే భారీ ఎత్తున అప్పు చేసి అమెరికా సంబంధమే ఖాయ పరుచుకుంటాం. చాకులాటి కుర్రాడు చిత్తూరులో ఇంజనీరుగా వున్నాడంటే ఆఫ్‌కోర్సంటాం. అమెరికాలో అడుక్కుతింటున్నాడని చెప్పినా అమోఘమని ఆనందిస్తాం! ఆడపిల్ల తల్లితండ్రుల దృష్టి అస్తమానం అమెరికా మీదే వుండటం మామూలైపోయింది. ఆయింటో అమెరికా పేరు రోజుకి అరవైసార్లు వినిపిస్తూ వుంటుంది. తద్వారా ఆ యింటోవున్న పిల్ల కూడా అమెరికా పేరుకి బాగా అలవాటుపడి - మానసికంగా అమెరికాకు అంకితమైపోతుంది. అమెరికాను అపారంగా ప్రేమిస్తుంది. తనకి పెళ్లంటూ జరిగితే అమెరికాలో స్థిరపడ్డ అబ్బాయితోనే జరగాలని ప్రతిజ్ఞ కూడా చేసుకుంటుంది. అక్కడ్నించి అమెరికా మీద అందమైన కలలు కంటో ఇండియాని విసుక్కుంటుంది!

అమెరికా గురించి ఆ పిల్లకు ఏమీ తెలీకపోయినా - బాగా తెలిసినట్లు - ఇదే అమెరికాలో అయితే అంటో - ఇండియా పరిస్థితులకు వంక పెడుతుంది. అక్కడ జేబులు కొట్టేవాడికి పెద్ద బంగళాతో పాటు రెండు కార్లుంటాయనీ, నాలుగు ఫోన్లుంటాయనీ కథలు చెబుతుంది! మనం యావన్మందీ ఈ విధంగా అమెరికాని నెత్తినెట్టుకుని ఆరాధిస్తున్నాం గనకనే - ఆ ప్రెసిడెంట్‌తో సహా అక్కడి దొరలందరికీ మనమీద చిన్నచూపు రోజురోజుకీ అతి చిన్నచూపుగా మారిపోతుంది. వాళ్లకంటికి మనం అల్పజీవులుగా కనిపిస్తున్నాం. తమ దయాదాక్షిణ్యాలే మాకు రక్ష అని బోర్డు కట్టుకున్నాం. అనేక విధాల అనేకానేక రూపాల మనం ఆ దొరలకు దాసోహమంటున్నాం గనక ఆ దొరలకు అలుసైపోయేం. ఆఫ్టరాల్ ఇండియా అనే స్థాయిలో వాళ్లు మనల్ని పలకరిస్తున్నారు. మనతో సంబంధాలు పెట్టుకుంటున్నారు. అయినాసరె - వాళ్ల పట్ల మనకు గల ఆరాధనా భావం కించిత్తు తగ్గడం లేదు. ఉగ్రవాద శక్తిని ఉక్కుపాదంతో నొక్కేస్తానంటున్న అమెరికాని మనం ఆకాశానికి ఎత్తేస్తున్నాం. ప్రపంచంలో వున్న సమస్తమైన ఉగ్రవాద శక్తుల్ని అమెరికా ఒకే రకంగా చూడటం లేదు. తనకి అనుకూలంగా వున్న ఉగ్రవాదుల్ని పవిత్ర యోధులని పిలుస్తోంది. ప్రతికూలంగా వుండే వారిని పరమ రాక్షసులని తిట్టిపోస్తోంది. ఇది మనకి మింగుడు పడటం లేదు. అయినా సరె - అమెరికా పట్ల ఆశలు బోలెడు పెట్టుకున్నాం గనక - సరిపెట్టుకుంటున్నాం. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అమెరికా దొరలు దిక్కుమాలిన స్టేట్‌మెంట్లు అనేకం యిస్తూ వుంటారు. వాటిని మనకు అనుకూలమైన దిశలో అన్వయించుకుంటున్నాం!

గత సెప్టెంబరు పదకొండున ట్రేడ్ సెంటర్ల మీద ఆత్మాహుతి దాడులు జరిగినప్పుడు అమెరికా స్పందించిన తీరుకి - భారత పార్లమెంటు భవనంపై మిలిటెంట్లు దాడి చేసినప్పుడు స్పందించిన తీరుకి బోలెడు వ్యత్యాసముంది! లాడెన్ నిర్వాకంపై సాక్ష్యాలు చూపవలసిన అవసరంలేదని అప్పుడన్నది. మిలిటెంట్ల నేరంపై సాక్ష్యాలు చూపమని మనతో ఇప్పుడంటోంది. ఎవ్వరితోనూ చర్చలు జరపమని అప్పుడన్నది. పాక్ సర్కార్‌తో చర్చలు జరపమని మనకిప్పుడు సలహా యిస్తోంది. మా చర్యకు ఐ.రా.స.అనుమతి అవసరం లేదని అప్పుడన్నది. భారత్ చర్యను మేము సమర్థించమని ఇప్పుడంటోంది. అమెరికా రెండు నాలుకల ధోరణికీ ఇంతి సంగతులకు సంబంధమేమిటని సహృదయులు ప్రశ్నించవచ్చు. ఇండియాలో సగటు భర్త అమెరికాతంతుని బాగా వంటబట్టించుకుని బతుకుతున్నాడని చెప్పేందుకు - అమెరికాను ఉదాహరణగా తీసుకున్నానంతే!

ఇక్కడ సగటు భర్త తన యింటో అమెరికా ఆట ఆడుతున్నాడు. అతను కట్టుకున్న భార్యతో పాటు అతన్ని కన్నతల్లి కూడా అతని దగ్గిరే బతుకుతుంటారు. అత్తాకోడళ్లు తల్లీకూతుళ్ల లాగా బతుకుతుంటే ఏ సమస్యా రాదు. అట్లా బతికే సంసారాలు చాలా తక్కువ. అంచేత సగటు సంసారాల్లో అత్తాకోడళ్ల మధ్య ఐకమత్యం అంతంత మాత్రమే వుంటుంది. నా కొడుకు నేను చెప్పిన మాట కాదనడని అతని తల్లి అనుకుంటుంది! నా భర్త నాకు పరమ భక్తుడని అతని భార్య భావిస్తుంది! నిజానికి సగటు భర్తకి-కట్టుకున్న భార్య మీద మోజెక్కువగా వుంటుంది. ముసలి తల్లి మీద మంటెక్కువగా వుంటుంది. ఈ నిజాన్ని నిర్భయంగా ప్రకటిస్తే పుట్టగతులుండవనే భయంతో సాధ్యమైనంత వరకు గుండెల్లోనే దాచుకుంటాడు. మా అమ్మ నాకు కుడికన్ను అంటాడు. మా ఆవిడ ఎడం కన్ను అంటాడు. ఇద్దరూ నాకు రెండు కళ్లని ఇద్దర్నీ నెత్తిన పెట్టుకున్న బాణీలో ఇతరులకు చెబుతుంటాడు! ఏ కంటికి దెబ్బతగిలినా తట్టుకోలేనని ఆవేశంగా ఉపన్యాసాలిస్తుంటాడు!

తల్లికి ప్రతిరోజూ పాదాభివందనం చేస్తుంటాడు. ఆ దెబ్బతో తల్లి పడిపోతుంది. నా అనురాగ దేవత నువ్వేనని భార్యముందు పాడుతుంటాడు. దాంతో ఆ ఇల్లాలు దాసోహమంటుంది. ఒకరికి తెలీకుండా ఒకర్ని ఆకాశానికి ఎత్తేస్తుంటాడు. ఆహా ఏమి నా అదృష్టమని ఆడవాళ్లిద్దరూ ఒకరికి తెలీకుండా ఒకరు మురిసిపోతుంటారు. అమ్మాయికి అప్పడాలు కాల్చడం కూడా చేతగాదని అమ్మ అన్నప్పుడు - అవునా అని ఆశ్చర్యం ప్రకటిస్తాడు. మడీదడీ అంటో అత్తగారు చంపుకు తింటున్నారని భార్య ఫిర్యాదు చేస్తే మాత్రం - నీ చాదస్తంతో చచ్చిపోతున్నాం తల్లీ అని అమ్మని మందలిస్తాడు. కోడలు పిల్లకి ముగ్గులేయడం కూడా రాదని తల్లి చెబుతే - కాన్వెంట్‌లో చదివిన పిల్లకదా ముగ్గుల్తో టచ్‌లేక పోవచ్చుని తల్లికి సర్దిచెబుతాడు. అత్తగారు ఇంటి పనికి ఎగనామం పెట్టి సూర్యనమస్కారాలతో ప్రాణాలు తీస్తోందని భార్య నసిగినప్పుడు - నీకో నమస్కారం చేస్తాను తల్లీ సూర్యుడ్ని విడిచిపెట్టమని తల్లిని కోప్పడతాడు. అత్తా కోడళ్లు మాటా మాటా అనుకుంటే పెద్దదానివి తొందర పడకమ్మా అనితల్లినే హెచ్చరిస్తాడు. అంతమాత్రాన అతను భార్యా విధేయుడని చెప్పడానికి వీల్లేదు. కథ అడ్డం తిరిగితే భార్యని కూడా తీసిపారేస్తాడు. అన్నీ అమెరికా బ్రాండు బుద్ధులే! ★



పర్యాటకులను అలరిస్తున్న గులాబీనగరం

జి. సూర్య నారాయణ

గులాబీ నగరం అనగానే మనకు గుర్తొచ్చేది రాజస్థాన్‌లోని జైపూర్. దీనిని చాలామంది రాజస్థాన్ ముఖద్వారంగా పరిగణిస్తారు. చరిత్రలో దీనికి చాలా ప్రముఖమైన స్థానముంది. అక్బర్, జోధాబాయ్ వివాహంతో ఈ నగరంపై మొగలుల ప్రభావం ఎంతగానో వుంది. జైపూర్ నగర నిర్మాణానికి ప్లాన్ రూపొందించి, నిర్మించింది మహారాజా జైసింగ్. ఈ నగరాన్ని జైసింగ్ 1727లో నిర్మించాడు. అనంతరం ఆయన దీనిని తన రాజధానిగా చేసుకొని రాజ్యపాలన చేశాడు. ఆయన సింహాసనాన్ని అధిష్టించింది మాత్రం అంబర్ కోటలోనే.

గొప్ప పాలకునిగా, ఖగోళవేత్తగా, గణితవేత్తగా, గొప్ప ప్లానర్‌గా పేరుగాంచిన మహారాజా సవాయ్ జైసింగ్ (1699 - 1743) ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు పెద్ద నగరం అవసరమని భావించాడు. ఈ నగరానికి ప్రముఖ బెంగాలీ వాస్తుశిల్పి విద్యాధర్ భట్టాచార్య రూపకల్పన చేశారు. దీనిని భారతీయ వాస్తుకళా శాస్త్రమైన శిల్ప శాస్త్రం ఆధారంగా నిర్మించారు.

బ్రిటిష్ రాకుమారుడు ఆల్‌బర్ట్ 1863లో ఈ నగరాన్ని సందర్శించాడు. ఆ రాచ అతిథి గౌరవార్థం నగరంలోని ప్రధాన భవనాలన్నింటికీ గులాబీ రంగు వేశారు. ఆ నాటి నుంచి దానికి గులాబీ నగరమనే పేరు వచ్చింది. నేటికీ అనేక చారిత్రక కట్టడాలకు, ఇతర ప్రధాన భవనాలకు గులాబీ రంగునే వేస్తారు.

గులాబీ నగరం నేడు పర్యాటకుల ఆనందనిలయంగా వుంది. ఇక్కడి అనేక ప్రదేశాలు, కోటలు, మ్యూజియంలు, తోటలు, ఆలయాలు, ఇతర అందమైన ప్రదేశాలు రాజపుత్ర, మొగలాయి వాస్తుకళల మేలు కలయికగా వుంది.

ఇక్కడి హవామహల్ అద్భుతమైన కట్టడం. అది గులాబీ రంగులో ఐదు అంతస్తులతో అద్భుతంగా వుంటుంది. ఎర్రని రాయితో తయారుచేసిన జాలీలను ఈ కట్టడం కిటికీలన్నింటికీ అమర్చారు. ఒకప్పుడు అంతఃపుర స్త్రీలు ఈ జాలీల గుండా రాచ ఉత్సవాలు, పండుగ ప్రదర్శనలను తిలకించేవారట. వేసవి కాలంలో వేడిగాలులు చల్లగా మారడానికి వీలుగా ఈ జాలీలను అమర్చారు. ఈ హవామహల్‌ను 1799లో మహారాజా సవాయ్ ప్రతాప్ సింగ్ నిర్మించారు. నేడు దానిని ఒక మ్యూజియంగా మార్చారు. ఇందులో అనేక పెయింటింగ్స్, శిల్పాలు, హస్తకళలు, ఒకప్పుడు చలామణిలో వున్న రాచరికపు నాణాలు, ఆనాటి కళాఖండాలు కొన్ని ప్రదర్శనకు వుంచారు.

మొగల్, రాజపుత్ర వాస్తుకళలకు మేలుకలయికగా నిలిచిన మరో రెండు కట్టడాలు సిటీ ప్యాలెస్, మ్యూజియంలు. నాటి రాజులకు సంబంధించిన అనేక వస్తువులను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. ఈ హవామహల్ జైపూర్ నగరంలో ఏడింట ఒకవంతు భాగాన్ని ఆక్రమించి వుంది. చంద్రమహల్ ప్యాలెస్‌లో జైపూర్ రాజ వంశజుల గతాన్ని ప్రతిబింబించే అన్ని హంగులతో వుంది. చేతి రాతతో వున్న ప్రతులు, మీనియేచర్ పెయింటింగ్స్, ఆయుధశాల, పురాతన ఆయుధాలు, వజ్రాలు పొదిగిన కత్తులు, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను యిక్కడ చాలా జాగ్రత్తగా పరిరక్షిస్తున్నారు. ప్రపంచంలోకెల్లా పెద్దవైన రెండు ఇత్తడి జాడీలు వున్నాయి. వాటిని మహారాజా సవాయ్ మాన్‌సింగ్ - 2 కోసం తయారు చేశారు. ఆయన 1902లో ఇంగ్లండ్ యాత్రకు వెళ్ళినపుడు వీటిలో గంగా జలాన్ని నింపి తనతో తీసుకువెళ్ళాడు. వాటిని కూడా ఇక్కడ ప్రదర్శనకు పెట్టారు.

సిటీ ప్యాలెస్‌కు దగ్గరలోనే జంతర్ మంతర్ వుంది. ఇక్కడ సూర్యరశ్మి ఆధారంగా కచ్చితమైన సమయాన్ని చెప్పవచ్చు. సూర్య, చంద్ర గ్రహణాలను కచ్చితంగా గుర్తించేందుకు కూడా ఇది ఉపయోగపడుతుంది. మన దేశంలో వున్న ఇలాంటి గడియారాలలో యిది అతి పెద్దది. దీనిని కూడా సవాయ్ జైసింగ్ - 2 నిర్మించారు.

కేవలం సిసోడియా రాణి కోసం నిర్మించిన సిసోడియా రాణి ఉద్యానవనం ఎంతో సుందరంగా వుంది. ఈ ఉద్యానవనంలో అద్భుతమైన రాజభవనం, అందమైన ఫౌంటెన్‌లు, పూదోటలు మనల్ని కట్టిపడేస్తాయి. రాధాకృష్ణుల కథను ఆధారంగా చేసుకొని చిత్రించిన అందమైన చిత్రాలు, మట్టి బొమ్మలు యిక్కడ వున్నాయి.

అంబర్ పర్వతాల ముందు భాగంలో రాజ కుటుంబం వేసవిలో నివసించేందుకు జల్ మహల్ (సరోవర భవనం) నిర్మించారు. అద్భుతమైన వాస్తుకళతో వున్న రాంబాగ్ భవనాన్ని నేడు చక్కటి టూరిస్టు హోటల్‌గా మార్చారు.

అంబర్ కోటకు వెళ్ళే మార్గంలో రాజపుత్రుల స్మారక స్థూపం వుంది. జైపూర్ వ్యవస్థాపకుడైన సవాయ్ జైసింగ్ - 2 స్మారక స్థూపం వాటన్నింటిలో చాలా గొప్పగా వుంది. దానిని తెల్లని చలువరాయితో నిర్మించారు.

జైపూర్ చుట్టుపక్కల అనేక కోటలు వున్నప్పటికీ అంబర్ కోటకు గొప్ప ప్రాధాన్యత వుంది. ఎందుకంటే అది రాజపుత్రుల తొలి రాజధాని. దాదాపు ఆరు శతాబ్దాలపాటు వారు అంబర్ కోటనుంచి పాలన చేశారు. ఈ అంబర్ కోట నిర్మాణాన్ని మాన్‌సింగ్ -1 1592లో ప్రారంభించాడు. ఆయన తరువాత రాజ్యానికి వచ్చిన జైసింగ్ - 1 దానిని పూర్తిచేశాడు. ఇక్కడి రాజభవనంలోని ప్రధాన ఆకర్షణ అద్దాల మేడ. దీని నిర్మాణంలోని ప్రత్యేకత ఏమిటంటే ఇందులో ఒక్క కొవ్వొత్తిని వెలిగిస్తే అది వెయ్యి కొవ్వొత్తుల వెలుగునిస్తుంది. ఈ కోట చుట్టూ చూడదగిన అనేక ఇతర భవనాలు, ఆలయాలు వున్నాయి. ఈ నగర రక్షణ కోసం 1734లో నహార్ కోటను నిర్మించారు. ఈ కోట గోడలపై అద్భుతమైన మట్టిబొమ్మ లున్నాయి. ఇప్పుడది గొప్ప పిక్నిక్ ప్రదేశంగా వుంది. స్థానికులు పెద్ద సంఖ్యలో యిక్కడకు పిక్నిక్‌ల కోసం వస్తుంటారు. ఆసియాలోని అతి పెద్ద ఫిరంగి 'జై వానా'ను యిక్కడ ప్రదర్శనకు పెట్టారు. దానితో 35 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించవచ్చు. నేడు జైపూర్ పాత కొత్తల మేలు కలయికగా వుంది. వజ్రాల నగలు, కట్ డైమండ్స్, ముత్యాలు, అనేక రకాల హస్త కళలు, తోలు వస్తువులు, దంతపు బొమ్మలు, నీలి పింగాణి, చక్కటి ఫ్యాబ్రిక్ పెయింటిగ్‌లకు ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా వుంది. ★



జలమహల్

ఈ సంవత్సరం



క్రీడల్లో పుంజుకున్న ఆంధ్ర

మారేపల్లి లక్ష్మణ్

వాలీబాల్ మహిళలు 31 ఏళ్ల విరామం తర్వాత జాతీయ టైటిల్‌తో శుభారంభం చేయగా, పుల్లెల గోపీచంద్ ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌గా నిలవడం... కోనేరు హంపి జూనియర్ వరల్డ్ చెస్ టైటిల్ గెలవడం... రెండో భారత మహిళా గ్రాండ్ మాస్టర్‌గా నిలవడం.... పెంట్యాల హరికృష్ణ భారత్ తరపున పిన్నవయస్సులో గ్రాండ్ మాస్టర్ సాధించి విశ్వనాథన్ ఆనంద్ రికార్డును చెరపడం.... వి.వి.ఎస్.లక్ష్మణ్ టెస్ట్ క్రికెట్‌లో గవాస్కర్ పేరిట వున్న అత్యధిక పరుగుల రికార్డును అధిగమించడం... ముఖేష్ కుమార్ జాతీయ హాకీ జట్టు కెప్టెన్‌గా ఎంపికవ్వడం... మూడు పటిష్టమైన క్రీడా పురస్కారాలు రాజీవ్ ఖేల్ రత్న, ద్రోణాచార్య, అర్జున అవార్డులు రాష్ట్రానికి లభించడం... టెన్నిస్ సంచలనం సానియా మీర్జాకు ఫ్రెంచ్, వింబుల్డన్ టోర్నీలలో డైరెక్ట్ ఎంట్రీ ద్వారా పాల్గొనే గొప్ప అవకాశం దక్కడం... జాతీయ క్రీడల పతాకాల పట్టికలో ఒకస్థానం పైకి ఎగబ్రాకడం... పతకాలు రెట్టింపు సాధించడం... ఇవన్నీ 2001లో ఆంధ్రప్రదేశ్ ప్రతిభకు నిదర్శనాలు, మధురానుభూతులు కాగా కొన్ని చేదు జ్ఞాపకాలను కూడా మూటగట్టుకుంది. గాయాలు, మృత్యువులు వెన్నంటి వుండి ఆంధ్రకు శాపంగా మారాయి.

రైల్వేకు బ్రేక్ వేసిన ఆంధ్ర మహిళలు

ఈ ఏడాదిని వాలీబాల్ మహిళలు స్వర్ణాక్షరాలతో లిఖించదగ్గ రీతిలో అద్భుత విజయంతో ప్రారంభించారు. 14 సార్లు వరుసగా జాతీయ మహిళల వాలీబాల్ టైటిల్‌ను గెలుపొంది రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తూ పోతున్న రైల్వే జట్టు జైత్రయాత్రను ఆంధ్రప్రదేశ్ మహిళలు అత్యంత గొప్ప ప్రదర్శనతో అడ్డుకున్నారు. దాంతో 1970లో చివరిసారిగా గౌహతిలో జాతీయ వాలీబాల్ టైటిల్‌ను గెలుచుకున్న ఆంధ్ర మహిళలు 31 ఏళ్ల విరామం తరువాత మళ్లీ ఆ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టులో పి.రాధ, శ్రీదేవి, లత చక్కని నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా కొన్నేళ్లుగా పొడగరి రాధిక అద్భుత స్పయికింగ్‌తో రాష్ట్ర జట్టును ఆదుకుంటోంది. పంజాబ్ జాతీయ క్రీడల్లోనూ అదృష్టం చిన్నచూపు చూడడంతో కాంస్యంతో సంతృప్తి పడాల్సి వచ్చింది. మరోవైపు వలసలతో పురుషుల వాలీబాల్ జట్టు స్థాయి దిగజారుతూ వస్తున్నది.

చెస్‌లో ప్రకంపనలు

చెస్‌లో ఆంధ్రప్రదేశ్ సంచలన విజయాలను నమోదు చేసింది. అమోఘ ప్రతిభను కనబరుస్తున్న పెంట్యాల హరికృష్ణ, కోనేరు హంపిలు సాధించిన విజయాలు ఈ క్రీడలో భారత్‌కు ఉజ్వల భవిష్యత్తు వుందని రుజువు చేశాయి. చాలా మంది ఇతర ఆటగాళ్లు కూడా ప్రతిభను చాటుకున్నారు. ఏషియన్ వ్యక్తిగత చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రశంసార్హమైన ఆటతీరును కనబర్చటం ద్వారా హరికృష్ణ భారత్‌లోనే అత్యంత యువ గ్రాండ్ మాస్టర్‌గా ఆవిర్భవించాడు. విశ్వనాథన్ ఆనంద్ పేరిట వున్న ఈ రికార్డును చెరిపివేయడమే గాక ఆనంద్ వారసుడు హరికృష్ణే అని చెస్ పండితుల ప్రశంసలు పొందాడు. 14 ఏళ్ల కోనేరు హంపి ఏథెన్స్‌లో వరల్డ్ జూనియర్ చెస్ టైటిల్‌ను సాధించడం ద్వారా తన ప్రతిభను చాటింది. ఎస్.విజయలక్ష్మి తర్వాత భారత్‌లో రెండో మహిళా గ్రాండ్ మాస్టర్‌గా అవతరించింది.

ఆస్ట్రేలియా జట్టుతో ఈడెన్ గార్డెన్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో 281 పరుగులు చేయండం ద్వారా వి.వి.ఎస్.లక్ష్మణ్, గవాస్కర్ పేరున వున్న అత్యధిక పరుగుల రికార్డును సవరించడమేగాక, అవిజేయులమన్న ఆస్ట్రేలియా నమ్మకాన్ని వమ్ముచేసి భారత క్రికెటర్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. అప్పటి వరకు 16 టెస్టలలో వరుస విజయాలను సాధిస్తూ వస్తున్న ఆస్ట్రేలియాను వరుసగా రెండు టెస్టలలో ఓడించడమేగాక సిరీస్‌ను 2-1తో గెలుచుకోవడానికి లక్ష్మణ్ అందించిన ఆత్మవిశ్వాసం ఎంతో తోడ్పడింది.

పేరు తెచ్చిన బ్యాడ్మింటన్

జాతి గర్వించదగ్గ విజయాన్ని అగ్రశ్రేణి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపిచంద్ అందించాడు. ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇంగ్లండ్ టైటిల్‌ను నెగ్గడం ద్వారా ఈ ఆంధ్రప్రదేశ్ ఆటగాడు త్రివర్ణపతాకాన్ని రెపరెపలాడించాడు. 21 ఏళ్ల కిందట ప్రకాశ్ పదుకునే సాధించిన విజయాన్ని పునరావృతం చేశాడు. మరోవైపు జ్వాలా గుత్తి, శృతి కురియన్‌లు జాతీయ డబుల్స్ ఛాంపియన్‌లుగా నిలిచారు. వారు ఫైనల్లో టాప్‌సీడ్ జంట అపర్ణ పోపట్, మధుబితా బిస్తలను ఖంగుతినిపించారు. జాతీయ క్రీడల్లో రాష్ట్రం సాధించిన స్వర్ణాలలో సగం బ్యాడ్మింటన్ నుంచి వచ్చినవే. బ్యాడ్మింటన్‌లో ఆరు స్వర్ణాలకు గాను అయిదు స్వర్ణాలు, మూడు రజతాలు, మూడు కాంస్యాలను సాధించింది. సాంకేతిక కారణాల వల్ల ఆ ఒక్క స్వర్ణం చేజారింది. లేకపోతే అదీ గెలుచుకొని క్లీన్‌స్వీప్ చేసేదే.

రాలిన తారలు

ఇటీవలి కాలంలో క్రీడల్లో రాష్ట్రం పేరు ప్రఖ్యాతులు అంతర్జాతీయ స్థాయిలో మారు మ్రోగుతుండగా అదే స్థాయిలో గాయాల వల్ల, మృత్యుఒడి చేరడం వల్ల తారలను కోల్పోయింది. చెస్‌లో కొత్త తారలు అద్భుత విజయాలతో అంతర్జాతీయంగా ఎదిగితే అంతే సంఖ్యలో చెస్‌లో ఉజ్వల భవిష్యత్తు గల రాష్ట్ర తారలు నెలకొరిగారు. ఒరిస్సాలోని పూరిలో జరగాల్సిన స్పాస్ స్ప్రెక్లబ్ ఫైడ్ రేటింగ్ చెస్ టోర్నీలో పాల్గొనడానికి వెళుతూ సెప్టెంబర్‌లో ఉజ్వల భవిష్యత్తు వున్న అయిదుగురు చెస్ కూనలు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారు. వారిలో ఆసియా అండర్-10 బాలికల ఛాంపియన్ దాసరి మిను, పదకొండేళ్ల ఆసియా అండర్-10 బాలుర మాజీ ఛాంపియన్ మేకల అభినవ్‌తో పాటు పదిసంవత్సరాల హరిచరణ్, గోదావరిఖనికి చెందిన శేఖర్, హైదరాబాద్‌కు చెందిన ఎనిమిదేళ్ల మాధురి వున్నారు. ఇంటర్నేషనల్ మాస్టర్ పి.డి.ఎస్.గిరినాథ్ తీవ్ర గాయం పాలుకాగా, మరో ఇద్దరు స్వల్ప గాయాలకు గురయ్యారు. జాతీయ క్రీడల శిక్షణా శిబిరంలో వర్ధమాన జిమ్నాస్ట్ పరశురాం తీవ్రగాయానికి గురై శాశ్వతంగా క్రీడకు దూరం కాగా, మరో ఇద్దరు జిమ్నాస్టలు రమేష్, విజయ్‌కుమార్‌లు కూడా అదే పరిస్థితులలో వున్నారు. మోయినుద్దౌలా క్రికెట్ టోర్నీ సందర్భంగా ఒకరు, హాకీ టోర్నీలో ఒకరు గాయపడగా, జావెలిన్ త్రో విసరడంలో పొరపాటు జరిగి మరో క్రీడాకారుడు మృత్యుముఖంలోకి చేరాడు.

అవార్డుల పంట

ఈ సంవత్సరం రాష్ట్ర క్రీడారంగానికి అవార్డుల పంట పండింది. మూడు ప్రధానమైన పురస్కారాలు మనకు లభించాయి. భారత క్రీడా రంగంలో అత్యున్నత పురస్కారమైన రాజీవ్ ఖేల్ రత్న ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్ పుల్లెల గోపీచంద్‌ను వరించింది. గోపీచంద్‌ను ఉన్నత తీరాలకు చేర్చిన బ్యాడ్మింటన్ గురువు, ఎందరో భావి క్రీడాకారులను తీర్చిదిద్దిన ఎస్.ఎం. ఆరిఫ్ ద్రోణాచార్య అవార్డును అందుకున్నారు. గురుశిష్యులకు ఒకే సంవత్సరంలో అవార్డులను అందుకోవడం విశేషం. అర్జున అవార్డును మరో ఆంధ్రతేజం వాలీబాల్ క్రీడాకారుడు పి.వి.రమణకు దక్కింది.

పంజాబ్ జాతీయ క్రీడల్లో మొదటి అయిదు స్థానాలలో నిలవాలన్న రాష్ట్ర ఆశయం నీరుగారినా మణిపూర్ క్రీడల కంటే రెట్టింపు సంఖ్యలో పతకాలు సాధించడం గొప్ప ఊరటను, రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వనున్న జాతీయ క్రీడల్లో మరింతగా రాణించడానికి కావలసిన ఆత్మ విశ్వాసాన్ని నింపింది. వ్యక్తిగత అంశాలలో రాష్ట్ర క్రీడాకారులు చక్కగా రాణించి పతకాలు సాధించారు. ముఖ్యంగా వాటర్ స్పోర్ట్స్ అయిన రోయింగ్, కయాకింగ్‌లలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఈసంవత్సరం ఆంధ్రప్రదేశ్ క్రీడల్లో పుంజుకుందనే చెప్పవచ్చు. ఇదే స్థాయిలో రాణిస్తే, ప్రభుత్వం దృష్టి సారిస్తే వచ్చే సంవత్సరం కూడా మన క్రీడాకారులు మరిన్ని అద్భుత విజయాలను సాధించడానికి ఎదురు చూస్తున్నారు. ★

వన్ ప్లస్ వన్ ఈక్వల్ టు వన్

సైదులు ఐనాల

వరసగా మూడ్రోజులు సెలవులు, మధ్యలో ఒక ఆదివారం, మొత్తం నాలుగు రోజులు సెలవులు దొరకడంతో మనసంతా ఇంటివైపుకు మళ్ళింది. క్యాంపస్ కొచ్చి మూడు నెల్లయ్యింది. సెలవులు వరసగా దొరక్కపోవడంతో పోదామనుకున్నా పోలేకపోయాను. క్లాస్ నుండి రాగానే బట్టలు బ్యాగ్‌లో సర్దుకొని బయల్దేరుతుంటే నా ఫ్రెండ్ శ్రీను కూడా సై అన్నాడు. మరింత ఆనందంతో ఎగిరి గంతేశాను. పన్నెండు గంటల ప్రయాణంలో ఎక్కడ బోర్ కొడుతుందోనని భయపడ్డాను. ప్రతిసారీ వాడు నాతో పాటు బయల్దేరతాడు. అసలు వాడు పక్కనుంటే ఇట్టే కాలం గడిచిపోతుంది. ఇద్దరం కలిసి యూనివర్సిటీ బస్ స్టాప్ కొచ్చి నిలబడ్డాం. పావుగంటైనా బస్సు రాకపోయేసరికి నాలో టెన్షన్ మొదలైంది. అప్పటికే పదిసార్లయినా వాచీకేసి చూసుంటాను.

"ట్రైన్ అందుతుందంటావా?" వాడు పలకలేదు. ఏంటిరా ఒక్క బస్సైనా రాలేదు. రోజైతే రయ్ రయ్‌న తిరుగుతుంటాయ్?

* * *

ఏరా నీకసలు రావాలనుందా? కోపాన్ని దిగమింగలేక కోపాన్నంతా గుమ్మరించినంత ఆవేశంగా అన్నాను.

"మైడియర్ ఫ్రెండ్ ఎందుకంత టెన్షన్ కూల్... కూల్‌గా ఆలోచించు అసలు పెద్దవాళ్లెమన్నారో తెలుసా?"

"అదిప్పుడంత అవసరమంటావా? నీళ్ళలో కదిపిన ప్రతిబింబంలా ఎందుకంత కోపం" కూల్‌గా అన్నాడు.

"నేనొకటి అడగనా"

"ఏంటో ఆ ధర్మ సందేహం!!"

"ఆలోచిస్తానంటే అడుగుతాను."

"సరే ఆలోచిస్తాను అడుగు"

"ఒకటికి మరొకటి కలిస్తే ఎంత?"

ఏంటి ఆ పిచ్చి ప్రశ్న "వన్ ప్లస్ వన్నేనా?!"

అవును 'వన్‌ప్లస్ వన్నే"

"రెండవతుందీ!!!"

నవ్వాడు... తెమిలి తెమిలి నవ్వాడు. వాడెందుకలా నవ్వాడో నాకర్థం కాలేదు. వీడిలాంటి పిచ్చాడెవరో "వడ్లగింజలో ఏముంటుందన్నాట్ట"

నవ్వాపుకొని "1+1 = 1" అవుతుందిరా."

"అదెలా కుదురుతుందన్నాను"

"అవును కుదురుతుందన్నాడు."

"నీవు మాథ్స్‌లో వెరీపూర్ అన్నాన్నేను."

"నీకు సామాజిక అవగాహన బొత్తిగా లేదన్నాడు."

అదంతవసరమా! అన్నాన్నేను.

అవసరమే! అప్పుడే తెలుస్తుంది 1 + 1 = 1 అని.

ఇంతలో బస్సు రావడంతో మాటలాపి బస్సెక్కాం.

మళ్ళీ ఎందుకో 1+1=1 ఎలా అవుతుందన్న నందేహం వచ్చింది. వాడ్నే అడిగి తెలుసుకుందామనుకుంటే అహం అడ్డొచ్చింది. మాథ్స్‌లో వందకి తొంభై మార్కులు తెచ్చుకున్న నేను 1+1 ఎంతో తెలియనంత అమాయకుడనుకున్నాడా వాడు. అయినా ఎందుకో సందేహమే. యేమైనా లాజిక్కుందేమో. అసలు అడిగేస్తే పోలే!

ఇంతలో స్టేషన్ వచ్చింది. హడావిడిగా దిగి టికెట్ తీసుకొని మూడవ నెంబర్ ప్లాట్‌ఫాం మీదకెళ్ళి రిజర్వేషన్ కంపార్ట్‌మెంటులోకెక్కి కూర్చున్నాం. ట్రైన్ కదిలింది. వాచీకేసి చూసి "చాలా కరెక్ట్ టైంకి కదిలిందే" ఎక్కింది మన ట్రైనేనా? పొరపాటున వేరేదేదైనా ఎక్కామా?" అంటూ వికారమైన ముఖం పెట్టి అడిగేసరికి కోపం వచ్చింది నాకు.



నా మొహం చూసి "సారీ బాబూ బుద్ధి తక్కువై అన్నాననుకొని ఈసారికి వదిలేసెయ్", రెండు అరిచేతులు అడ్డుపెట్టి తలవంచి అనేసరికి నవ్వొచ్చింది.

రైలు స్టేషన్నొదిలి పరుగందుకొంది. చెట్లు, కరెంటు స్థంభాలు వెనక్కు ఉరుకుతున్నాయ్. చల్లని గాలి – కిటికీ సందుల్లోంచి వచ్చి మొహం మీద పడుతుంటే ఆహా!!! ఎంత హాయిగా వుందీ?! గాల్లో తేలియాడుతున్న వెంటుక్రల్ని సరి చేసుకుంటూ పైకి చూశాను. "అసలే చలికాలం. దానికి తోడు ఈ గాలి. మూసెయ్యయ్యా! మూసెయ్ కిటికీ" పై బెర్త్ మీద పడుకున్న సదరు ప్రయాణీకుడు కసురుకున్నాడు కట్టె విసిరినంత కఠినంగా. "ఏం మనుషులో ప్రకృతిని చూసి ఆనందించలేని గుడ్డివాళ్ళు" చేసేది లేక ఆ సమయంలో గొడవ పడటం ఏ మాత్రం ఇష్టం లేక కిటికీ కొద్దిగా క్రిందకు లాగాను. ఎక్కింది రిజర్వేషన్ కంపార్ట్‌మెంటయినా జనంతో కిక్కిరిసింది. విషయం ఏంటని నా పక్కనున్న పొడుగాయన్నడిగాను "ఏదో మీటింగు కొచ్చారట" అసహనంగానే బదులిచ్చాడు.. బస్‌స్టాప్‌లో నా అసహనానికి ఇక్కడ ఈతని అసహనానికి వీళ్ళేనన్నమాట కారణం. పనీపాట లేదు. గొడవలు, స్ట్రైకులు, దిగ్బంధనాలు, మీటింగులంటూ రోజులకు రోజులు గడిపేస్తుంటారు.

ఎప్పుడైనా ఆలోచించారా ఉద్యమాలు, ఊనకబుర్లు కూడుబెడతాయని? ఇంకా నా అసహనాన్నంతా వెళ్ళగక్కాలనిపించింది వాళ్ళపై. చూస్తే జాలేసింది. అందరి ముఖాలూ అలసినట్లున్నాయి. పాపం ఉదయం నుండి ముద్దయినా ముట్టారో లేదో! అప్రయత్నంగా బ్యాగులోంచి ఏమైనా తీసి ఇవ్వాలనిపించింది. ఇస్తే తీసుకోకపోతే ఎలా? మనసు బాధపడుతుంది. ఆ ఆలోచనే భయపెట్టింది. అంతటితో ఆగిపోయాను.

నా సీటు పక్కనున్న ఖాళీజాగాలో ఐదుగురు వచ్చి ఇరుక్కున్నట్లుగానే నిల్చున్నారు. ఒదిగొదిగి కూర్చున్నారు. భుజాన వేసుకొనే తువాళ్ళు తలకి చుట్టుకొని ముఖాలు కనపడనంత భద్రత చేసుకొన్నారు ఎవరికి వాళ్ళు. చలిపులికి వాళ్ళుకూడా భయపడ్డారనిపించింది. బ్యాగులోంచి స్వెట్టర్ తీసి వేసుకొని మఫ్లర్ చెవుల్నిండా చుట్టేసుకున్నాను.

"ఏరా మనం విజయం సాధిస్తామంటావా!"

"అసలు ఈ ఆందోళన గురించి ముఖ్యమంత్రి ఒక్క నిమిషమైనా ఆలోచిస్తాడంటావా? ఇంకా ఉన్న ఇద్దరూ ప్రశ్నలను – సంధించకముందే "ఈ దెబ్బతో ముఖ్యమంత్రి నిద్దట్లో కూడా కలవరిస్తాడు" పొడవాటి జుత్తును సవరించి మాసిన ముఖాన్ని

రుమాలుతో తుడ్చుకొంటూ చెప్పాడు కురచగా చామనఛాయున్నతను. వాళ్ళందరిలో అతను కొద్దిగా ఆత్మస్థైర్యం కలవాడనిపించింది. ఇంకా మాటలు కొనసాగిస్తున్నట్లు.

"మనమేమన్నా ఒకళ్ళిద్దరం వచ్చామా? వేల సంఖ్యలో కుటుంబానికొక్కరం చొప్పున వచ్చాం. రాష్ట్ర చరిత్రలోనే ఇంతమందితో హైదరాబాద్ ముట్టడి జరగలేదని అంటున్నారు" అతని మాటలకనుగుణంగా చేతుల కదలిక కనుబొమ్మలు ముడి వేస్తుంటే ఆసక్తిగా చూస్తూ వింటున్నాను.

"సమయం ఏడు గంటలు కావస్తుంది. మరికొద్ది క్షణాల్లో వార్తలు. ఎవరో పాకెట్ రేడియో సౌండు పెంచి వింటున్నారు. రేడియోలో టీవీ ఛానెల్స్. వారెవ్వా టెక్నాలజీ ఎంత ఎత్తుకెదిగిందీ? ఇంట్లో టీవీ జేబులో కొచ్చిందన్నమాట!!

హైటెక్ అభివృద్ధంటే ఇదేనేమో.

రేడియోలోని టీవీ ఛానెల్‌లో వార్తలు వస్తుంటే అంతా ఆసక్తిగా వింటున్నారు.

కార్మికులు తలపెట్టిన హైదరాబాద్ దిగ్బంధనం విజయవంతమైనట్లు కార్మిక నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ట్రాఫిక్ స్థంభించిపోయింది. అత్యవసర సర్వీసులు మినహా ఏ సర్వీసులు నడవలేదు. జనంతో రోడ్లన్నీ క్రిక్కిరిశాయి. ఇందిరా పార్కునుండి సాగిన ఈ మహా ప్రదర్శనకు పేరున్న నాయకులెవ్వరూ లేకపోవడం విశేషం. అందుకే ఇది ప్రజల ఉద్యమమని రాజకీయ విశ్లేషకులంటున్నారు. అసెంబ్లీ వైపు దూసుకెళ్ళిన కొందరు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ప్రదర్శనపై లాఠీఛార్జి జరగడంతో ఆందోళనకారులకు – పోలీసులకు మధ్య వాగ్వివాదాలు జరిగాయి. ఇంతమందితో జరిగిన ఈ ప్రదర్శన అదుపు తప్పకుండా నిరసన ప్రదర్శనగానే చివరికంటా కొనసాగడం మరో విశేషం. చెదురు మదురు సంఘటనలు తప్ప శాంతిభద్రతలెక్కడా అదుపు తప్పలేదని నగర పోలీస్‌కమీషనర్ తెలిపారు.

అనంతరం నిజాం కాలేజీ గ్రౌండులో జరిగిన సభలో పలువురు నాయకులు తమ డిమాండ్లను ముఖ్యమంత్రికి సమర్పించినట్లు చెప్పారు. ప్రభుత్వం తన మొండి వైఖరిని మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి కార్మికుల డిమాండ్లు తీర్చే స్థితిలో ప్రభుత్వం లేదని, కార్మికులు అర్థం చేసుకొని ఉద్యమాలకు స్వస్తి చెప్పాలని తీర్మానించగా మంత్రులంతా ముఖ్యమంత్రి నిర్ణయానికి ఏకీభవించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా కార్మిక నాయకులు – ఆందోళన ఆవేశంగా మారి తరువాత జరిగే సంఘటనలకు ముఖ్యమంత్రి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

మళ్ళీ తొమ్మిది గంటలకు ప్రసారమయ్యే ప్రత్యేక న్యూస్‌లో కలుసుకుందాం. రేడియో మూగబోయింది. అందరి ముఖాలు ఆకుకూర కాడల్లా వాలిపోయాయి.

కిటికీ తెరలేపి ఆకాశం కేసి చూశాను. చుక్కల్ని కమ్మిన చీకటి, అవమానంతో చంద్రుడు మబ్బుల్ని కప్పుకున్నట్లు, వెలుగుల్ని మింగుతున్నట్లుంది. భారంగా వస్తుంది గాలి. మెడచుట్టూ కమ్ముకున్న గాలి ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే కిటికీ తెరదించాను.

"ఏంటిరా ఏదో జరుగుతుందనుకుంటే మరేదో జరిగేట్లుంది" గళ్ళ అంగీ వేసుకున్నతను జుట్టు సరిచేసుకుంటూ మాటలు సాగించడానికన్నట్లున్నాడు. నిశ్శబ్దాన్ని పగలగొట్టిన శబ్దం. "నిజమే కీడెంచి మేలెంచమన్నారు" అసలు ఈ మధ్య ఏ ఉద్యమం చివరికంట సాగింది"?! "మొదట్లో ఉన్నంత ఊపు చివరికంటా నిలబడ్డ పాపాన పోలేదు కదా!!" ఇక తట్టుకోలేక ఇంకా అల్లాంటి నీరసపు మాటలు వినలేనన్నట్లు బక్కపల్చగానున్న తను నోరు విప్పాడు. ఆగండ్రా అలా అని ఏ డిమాండ్లూ సాధించుకోకుండానే ఉద్యమాలు ఆగిపోయాయా? ఐనా వాటి దారి వేరు. ఈ రోజు మన ఉద్యమం వేరు. మనది ప్రజా ఉద్యమం. ప్రజల ఆగ్రహం, ప్రజ్వరిల్లితే పదింతలవుతుంది ఆ" ఆవేశంగానే అన్నాడు.

ఎక్కడుంది లోపం? పైపై మెరుగుల్ని చూసి అంచనా వేయలేం కదా? వారి మాటలు నన్ను ఆలోచనల్లోకి విసిరాయి.

"కొన్ని డిమాండ్లు తీర్చుకొని సంతృప్తి పడటం, మరికొన్నింటిని వాయిదా వేయడం, కొన్నింటిని ఊసెత్తకపోవడం, మరికొన్ని మధ్యనే ఆగిపోవడం, ఇదే నేటి ఉద్యమాల పరిస్థితి. అసలు ఉద్యమాలు ఎందుకు? ఎవరు? ఎవరిపై? వీటికి సరైన సమాధానంవెతకాలి. అప్పుడు గాని ఈ పరిస్థితికి మూలాలు కన్పిస్తాయి. అక్కడ దొరుకుతుందేమో ఈ ఎందుకు, ఎవరు, ఎవరిపై".

"రాణుల కోసం రాజ్యాల కోసం, పెత్తనాన్ని పదిలపరుచుకోవడం కోసం, కుర్చీల్ని కాపాడుకోవడం కోసం యుద్ధాలు జరిగినట్లు చరిత్ర చెపుతుంది"

"బానిసత్వంపై తిరుగుబాటు", "వర్గపోరు, బలవంతులపై బలహీనుల పోరాటం, భూస్వాములపై భూమిలేనోడి ఆవేశం" రెండు పార్శ్వాలు. ఒకటి ఆధిపత్యం నిలుపుకోవడానికైతే రెండవది "స్వేచ్ఛకోసం". సమాజంలో వున్నప్పుడు సమాజాన్ని మరిచి ఏ సిద్ధాంతాన్ని తయారు చేయలేం'. "దేన్నీ విమర్శ చేయలేం ప్రపంచంలో మనం". అందుకే ప్రపంచ పరిణామాలూ మనపై ప్రభావం చూపెట్టడం, ఒక్కోస్సారి తల్లకిందులవడం. అసలు వీటన్నింటికీ అసంతృప్తే కారణమనిపిస్తుంది. ఎందుకు అసంతృప్తి? ఎందుకైనా కావచ్చు. దౌర్జన్యంపై కావచ్చు. దోపిడీపై కావచ్చు.

"నిరసన నుండి నిలువెత్తు ఎగిసిన ఏ ఉద్యమమైనా మట్టి కరిచిందా? లేదనే సమాధానం వస్తుంది. "రాజకీయ నిరుద్యోగులు నడిపే ఉద్యమాలు చరిత్రలో ప్రజల కోసం పోరాడిన ఆనవాళ్ళు ఏమైనా వున్నాయా? ప్రశ్నిస్తున్నంతనే పారిపోతున్నట్లుంది గాలి. కిటికీ సందుల్లోంచి రైలు కూత వేటుకు గాయమైన శబ్దం. మలుపు తిరుగుతుందనుకుంటూ ముందునుండి వెనుక పెట్టె వరకూ వంకరగా కన్పిస్తుంది.

"రాజకీయ దాహంతో జరిగిన ఉద్యమాలు పదవులకు దాసోహమై, ప్రజల్ని వంచించిన నాయకుల్ని చరిత్ర మర్చిపోతుందా? ప్రజల సానుభూతిని పొందిన ఉద్యమాలెన్ని? వేళ్ళమీద లెక్కించొచ్చేమో!!

''వాచీకేసి చూసి తొమ్మిదయింది వార్తలొస్తాయ్. రేడియో ఆన్ చెయ్‌మామా" చలిపులి పంజావిప్పుతున్నట్లుంది. బ్యాగ్‌లోంచి స్వెట్టర్లు తీస్తున్నారు, కొందరు కప్పుకున్న శాలువాల్నే సరిచేసుకుంటున్నారు. ఆ అయిదుగురు చెవులు నిక్కించి రేడియో వింటున్నారు. వాళ్ళలో ఆత్రుత, వణుకుతున్న పెదాలు, చలికో, మరిదేనికైనా?!!

"రాష్ట్రంలో పలుచోట్ల సమ్మెకు మద్దతుగా ఆందోళనలు జరిగాయి. దాదాపు అన్ని జిల్లాల్లో పరిస్థితి అదుపు తప్పడంతో పోలీస్ అధికారులతో హోంమంత్రి హడావుడిగా సమావేశమయ్యారు. కొన్నిచోట్ల ఈ పరిస్థితి ఉధృతమైంది. విద్యార్థి, యువజన, దళిత, మహిళా సంఘాలు కార్మికుల ఉద్యమానికి మద్దతు తెలిపారు. "మూడు గంటల్లోనే రాష్ట్రమంతా తిరగబడింది" "రాష్ట్రమంతా కాదు ప్రజలంతా" వివరణ చేశాడు మరొకతను. కాస్త వార్తలు విన్నియ్యండ్రా? ఇంకొకరు కసిరినట్లనడంతో ఎవరూ మాట్లాడలేదు.

"జరుగుతున్న సంఘటనలపై అధికార్లంతా నివ్వెరపోతున్నారు. పరిస్థితి చేజారకముందే ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రతిపక్షాలు ముఖ్యమంత్రిపై వత్తిడి తెచ్చాయి.

"మరో ప్రపంచం – మరో ప్రపంచం పిలిచింది
పదండి ముందుకు పదండి'' అని పాడాలనిపించింది.

"ఏమయ్యా మళ్ళీ ఆ కిటికీ పైకెత్తావా!? ఎన్నిసార్లు చెప్పాలి! దించు" పక్క తిరగేస్తూ కసిరాడు పై బెర్త్‌పై పడుకున్న పండిత మహాశయుడు. "దేశమంతా కాలి బూడిదవుతున్నా ఇల్లాంటోళ్ళకు పట్టదు. మొద్దుల్లా చదలు పట్టినా కానరు.

"ఎముకలు కుళ్లిన వయస్సు మళ్ళిన
సోమరులారా చావండి'' అని పాడాలనిపించింది.

"ఇదిలా ఉండగా మన రాష్ట్ర ముఖ్యమంత్రికి అమెరికా ప్రభుత్వం బెస్ట్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ అవార్డును ప్రకటించినట్లు వైట్‌వైస్ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ బ్యాంక్ విధానాల్ని విజయవంతంగా అమలు చేస్తున్నందుకు ఈ అవార్డును ప్రకటించినట్లు అమెరికా అధ్యక్షుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ దేశాలన్నింటికీ ఆదర్శమని ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు ముఖ్యమంత్రికి పంపిన లేఖలో పేర్కొన్నారు"

"ఇల్లు కాలి పోతుందంటే సుట్ట కాల్చుకోవాలి అగ్గిపుల్లిమ్మన్నాట్ట" ఆ మాటతో గొళ్లున నవ్వారంతా "చూశావా చిన్నయ్యా కార్మిక శక్తి ఏ పాటిదో" తలపాగ గట్టిగాచుట్టుకుంటూ కనుబొమ్మ లెగరేస్తూ అన్నాడొకతను.

నిద్రాదేవత ఆవరించడంతో ఆ తరువాతేం జరిగిందో తెలియలేదు. వాచీకేసి చూశాను. ఉదయం ఆరు యాభై అయ్యింది. రేడియోలో ప్రాంతీయ వార్తలు అంతా ఆసక్తిగా వింటున్నారు.

''కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం ఒప్పుకుంది. ప్రజల తీర్పును కాదనలేకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి చెప్పగా, మరోప్రక్క కార్మికనాయకులు ఉద్యమ ఫలితమేనన్నారు.

ఏది ఏమైనా "ఇది ప్రజా ఉద్యమమని" ''ప్రజల చైతన్యానికి నిదర్శనమని'' రాజకీయ విశ్లేషకులంటున్నారు!!

ఇంకా ఏవేవో మాటలు, ఎవరెవరివో వ్యాఖ్యానాలు, కాదంటున్న ప్రభుత్వం అవునంటున్న రాజకీయ వాదులు...

"నిజమే ఇది అక్షరాల ప్రజల చైతన్యమే .. ప్రజల ఉద్యమం, ప్రజల ఆవేశాలకు ప్రతిరూపం" కిటికీలోంచి గాలి చక్కిలిగింతలు చేస్తుంది. తూర్పు కొండల్లోంచి సూర్యుడు చీకట్లను చెరుపుకుంటూ విజయ గర్వంతో పైకొస్తున్నాడు. చీకటిపోతూ వెలుగొస్తుంది"

ఏరా "ఇప్పుడు తెలిసిందా ఏదో ఒక రోజున కులం, మతం అనే తేడా లేకుండా అంతా ఒక్కటవుతారని" భుజం మీద చెయ్యేస్తూ లేచి కూర్చున్నాడు శీను "ఇంతకీ ఆ "వన్‌ప్లస్ వన్ ఈక్వల్ టూ వన్" అర్థమయిందా?"

సమాధానంగా తల పంకించాను'' పెదాలపైని ఆనందాన్ని కళ్ళలో చూపిస్తూ బ్యాగు భుజాని కేసి పదా స్టేషన్ వచ్చిందన్నాడు. పల్లెగాలి స్వాగతిస్తుంటే విజయగర్వంతో కాలుమోపాను మా ఊరుగడ్డపై. ★

తొలగిన ముసుగు

సీనియర్ కాలమిస్టు, అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్వీఆర్‌గా సుపరిచితులైన ఆర్.వెంకటేశ్వరరావు పదేళ్లు సోవియట్‌లో వుండి వచ్చారు. ఆ అనుభవతో ఆయన సోవియట్ సోషలిజం ఎందుకు దెబ్బతినిపోయిందో వివరించేందుకు ఈ పుస్తకం రాశారు. తొలగిన స్వర్గం అనే పేరును బట్టి ఆయన రచనలో సోవియట్ జీవితం ఎంత అద్భుతంగా వుండేదో రాసి వుంటారని పాఠకుడు ఆశిస్తాడు. తీరా పుస్తకం చదివిన తర్వాత అలా టైటిల్ ఎందుకు పెట్టాడా అని ఆశ్చర్య పోతాడు. ఎందుకంటే ఆయన ఉద్దేశంలో అది మేడిపండు. మనిషి పౌరపనీ విశ్వాసాన్ని హరించిన వ్యవస్థ. ఆధునిక ప్రపంచంలో వస్తున్న మార్పుల నేపథ్యంలో గోర్బచెవ్ దాన్ని గమనించాడు. సోషలిజం తమ పాలిట శాపం అనుకునే స్థితిలో ..... వ్యక్తిని అణచిపెట్టిన రాజ్యం వ్యక్తిని సమాజానికి పోటీ పెట్టిన రాజ్యం సమాజ శ్రేయస్సు పేరిట వ్యక్తిని బలి పెట్టిన రాజ్యం వ్యక్తి చైతన్యం కలగగానే పటాపంచలై పోయింది ఇది ఆయన విశ్లేషణ. ఆయన ఆలోచనా ధోరణి అర్థం కావడానికి ఈ ముక్కలు చాలు.

సోషలిజం దెబ్బ తినడానికి అనేక కారణాలు, లోపాలు వున్నాయనేది నిర్వివాదాంశం. వాటిని సక్రమంగా గుర్తించి సరిదిద్దుకుంటే భవిష్యత్తులోనైనా మేలు జరుగుతుంది. కాని ఆర్వీఆర్ చేసింది అది కాదు. అంతటినీ వక్ర రూపంలో చిత్రించడానికి తాపత్రయ పడ్డారు. కొంత మందికి సోవియట్ అంటే వీరభక్తి అని మరి కొందరికి తగని ద్వేషమని అంటూ తను మాత్రం ఏదో సమతుల్యతతో పరిశీలన చేయబోతున్న అభిప్రాయం మొదట్లో కలిగించే ఆర్వీఆర్ నిజంగా రాసిందంతా పైపై పరిశీలనకు పరిమితమైన పాక్షిక చిత్రణ మాత్రమే.

తొలగిన స్వర్గం,
రచన:ఆర్వియార్;వెల:రూ. 35;
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రముఖ పుస్తక విక్రేతలు.

సోవియట్‌లో ప్రతిదానికీ కొరత. ఎడతెగని క్యూలు. సరుకులు నాసిగా వుంటాయి. అందువల్ల విదేశీ వస్తువుల కోసం ఎగబడుతుంటారు. స్వేచ్ఛ వుండదు. కమ్యూనిస్టు నాయకులకు ప్రత్యేక సదుపాయాలుండటం అందరి విమర్శకు గురవుతుంటుంది. అనవసరమైన నిఘాలు, ప్రశ్నలతో అభద్రతా వాతావరణం. జాతి కలహాలు. ధన వ్యామోహం. అక్కడ క్రమశిక్షణ భయం వల్ల ఏర్పడిందే కాని నిజమైంది కాదు. సోషలిస్టు మానవుడి గురించి మనకున్న ఊహలు తప్పు.

ఇంకా ఇలాటి అనేకానేక వ్యాఖ్యానాలు చేసిన రచయిత అంతటితో ఆగకుండా పాశ్చాత్య దేశాలతో పోల్చి మాట్లాడతారు. పారిశ్రామిక దేశాలలో క్రమశిక్షణ సహజంగా వుంటుందట. ఇలాగే పాశ్చాత్య దేశాల సమర్థతను కీర్తించే భాగాలు చాలానే రాశారు.

సోవియట్ అనుభవంలో పొరబాట్ల గురించి విమర్శనాత్మకంగా చెప్పవచ్చు. కాని ఈ రచయిత చెప్పిన వాటిలో కొత్త అంశాలేమీ లేకపోగా చెప్పిన తీరులో ఆవేదన కన్నా అపహాస్యం అధిక్షేపణ అధికంగా కనిపించుతుంది. తన అనుభవాలను బట్టి మంచి చెడ్డలు స్పందించే ఒక సగటు మధ్య తరగతి మనిషి మాటలవలె పుస్తకం నడుస్తుంది. క్యూల గురించి సర్వీసింగ్ కోసం తను పడిన అవస్థల గురించి పదే పదే రాస్తారు. అంతకంటే మౌలికమైన అంశాలేమీ ఆయన గమనించనే లేదా? అసలా దృష్టి వుందా అని సందేహం కలుగుతుంది. సోవియట్‌లో లోపాలను వివరంగా పేర్కొన్న రచయిత విజయాలను సదుపాయాలను ఒక్క ముక్కలో కొట్టేస్తాడు. మన దేశంలో బస్సు ఎక్కినంత తేలిగ్గా అక్కడ విమానం ఎక్కవచ్చని, ఎంతైనా చదువుకోవచ్చని ఇలాటి విషయాలు యథాలాపంగా చెప్పేసి విమర్శలపైనే కేంద్రీకరిస్తారు.

సోవియట్ జీవితం నిజంగా అంత దుర్భరంగా వుంటే ఆర్వీఆర్ వంటి వారు వెళ్లి పదేళ్లు వుండివచ్చేవారా? అసలు ఎక్కడో తెలుగు రచయితను పిలిపించి అనువాదకుడుగా పెట్టుకుని ఉత్తమ గ్రంథాలు తర్జుమా చేయించడం సోషలిజం ఔన్నత్యానికి ఒక ఉదాహరణ కాదా? అలాటి ప్రశ్నలు ఆయనకు రావు. సోషలిజంలో దొర్లిన లోపాలే ఏకరువు పెడతారు. ఉపయోగించిన భాష కూడా ఎగతాళిగా సాగుతుందే గాని ఎక్కడా వేదన ధ్వనించదు. సోషలిస్టు మానవుడు ఒక్కసారిగా ఆవిర్భవించడం సాధ్యం కాదని మాట వరుసగా అంటూనే సోవియట్ వారిలో తాను గమనించిన ప్రలోభాలను పూస గుచ్చుతారు. అంత కాలంలోనూ ఆయనకు సోవియట్‌లో ఉత్తేజ కరమైన అంశాలే కనిపించలేదని అంతా చదివిన పాఠకుడు అనుకోవడంలో తప్పులేదు. సోవియట్‌పై ఎంతగానో దుమ్మెత్తిపోసే అమెరికన్ రచయితలు కూడా అక్కడి సదుపాయాలను సామాజిక భద్రతను అనివార్యంగా ప్రశంసించడం చూస్తాం. వామపక్షవాది అయిన ఆర్వీఆర్‌లో అదీ దాదాపుగా లేదు.

గోర్బచెవ్ వచ్చిన తర్వాత చేపట్టిన చర్యలను ఆహ్వానించే ఆర్వీఆర్ తదనంతర ఫలితాలతో కూడా వైఖరి మార్చుకోలేకపోవడం ఆశ్చర్యం కలిగించుతుంది. ఆయన వ్యక్తి చైతన్యం కలిగించగానే సోషలిజం పటాపంచలై పోయిందని చేప్పేశారు. అంతేగాక ఎల్సిన్‌ను కూడా ప్రస్తావిస్తారు. ఆయన రచన పొడుగునా కమ్యూనిస్టేతరులు, వ్యతిరేకుల వ్యాఖ్యలను, ప్రాచీన శ్లోకాలను ఉటంకించడం తప్ప మార్క్సియన్ కోణం నుంచి మాట్లాడిన వారిని ఒక్కరంటే ఒక్కరిని పేర్కోరు. సోవియట్ విచ్ఛిన్నానికి తెలుగు కవులు రచయితలెందరో వున్నారు కాని ఆర్వీఆర్ దృష్టి మాత్రం వేరుగా వుంది. ప్రత్యక్ష అనుభవంతో రాశారు కనుక ఈ పుస్తకం చదవచ్చుకాని ఏదో రాజకీయ సైద్ధాంతిక అవగాహన లభిస్తుందని భావించితే మాత్రం నిరుత్సాహమే ప్రాప్తిస్తుంది. సోషలిజం ఎదురు దెబ్బ తినడం వల్ల కలిగిన ఆవేదనకు తోడు అభ్యుదయ మేధావుల మనుకునే వారు ఈ పరిణామాన్ని ఇంత అసంబద్ధంగా చూడటం ఆ ఆవేదనను మరింత పెంచుతుంది." ఈ గుణపాఠం బట్టి సిద్ధాంతాన్ని పునః;పరిశీలించుకోవాలన్నదే నా ఆకాంక్ష" అంటున్న ఆర్వీఆర్‌కు ఆచరణపై గాక సిద్ధాంతంపైనే నమ్మకం సడలిందని వేరే చెప్పాలా?

-తెలకపల్లి రవి

ప్రతీకారం

మనకు స్వాతంత్ర్యం లభించి 53 ఏళ్ళు గడిచినా నేటికీ సామాజిక న్యాయానికీ, మానవ హక్కులకు అనేక సవాళ్ళు ఎదురవుతున్నాయి. వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది. దళితులకు రాజ్యాంగం యిచ్చిన హక్కులను కాలరాయొద్దని కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ ఉద్యమం నిర్వహిస్తోంది. ఆ ఉద్యమానికి సహాయ సహకారాలందించాల్సిందిగా ప్రగతిశీలురందరినీ కోరుతోంది. కమిటీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను అందరి దృష్టికి తేవడానికి ఈ పుస్తకాన్ని ముద్రించారు.

ప్రతిఘటన

ప్రచురణ: కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ, **వెల:** రూ. 5, **ప్రతులకు:** ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

శారీరక వ్యాయామం శరీర ఆరోగ్యాన్ని కాపాడుతుంది. మానసిక వ్యాయామం మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. ఈ రెండింటిలో మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమైనది. నిర్మాణాత్మకంగా ఆలోచించటం మానసిక వ్యాయామం. శారీరక వ్యాయామం కోసం భౌతిక క్రీడలున్నట్లే మానసిక వ్యాయామం కోసం ఈ కవిత్వ క్రీడలు అవసరమని కవి భావన. ఉపాధ్యాయులు, విద్యావేత్తలు మాత్రమే కాదు తల్లిదండ్రులు, పెద్దలు, ఎవ్వరైనా సరే ఈ కవిత్వ క్రీడల్ని పిల్లలకు నిర్వహించి వారిలోని సృజనాత్మక శక్తులను అద్భుతంగా వెలికితీయవచ్చు.

పిల్లలలో మినీ కవిత్వ రచనా నైపుణ్యాలు

రచన: డా॥ రావి రంగారావు, **వెల:** రూ. 50. **గ్రంథాలయ ప్రతి:** రూ. 100, **ప్రతులకు:** విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.



ఈ కవితా సంపుటిలోని కవితలుకొన్ని ఆకాశవాణి, విశాఖ కేంద్రం ద్వారా ప్రసారం కాగా, మిగిలినవిఆంధ్ర భూమి, ఆంధ్రప్రభ, ప్రజాశక్తి మున్నగు దినపత్రికలు, అనేక సాహిత్య పత్రికలు ప్రచురించాయి.

గుండె గాయాలు,

రచన: ఎస్.ఆర్. పృథ్వి, **వెల:** రూ. 25, **ప్రతులకు:** శ్రీమతి పి. ఉషారాణి, 3-3, మేడపైన, మధురానగర్, కాకినాడ, విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు.

సమాజ రుగ్మతలను రూపుమాపే రచనలు కావాలి

పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు ఎనిమిదవ ఏటనే పద్యాలు రాసి ఆశుకవిగా ఎదిగిన వ్యక్తి కవికోకిల డాక్టర్ జ్ఞానానంద కవి. ఆయన కలంనుండి ఆమ్రపాలి, అక్షరాభిషేకం, ఆహ్వానం, వంశధార, గోల్కొండ, వెలుగుబాట, తరంగమాల వంటి నలభై ప్రసిద్ధ ఆధునిక పద్యకావ్యాలు జాలువారి తెలుగుజాతిని జాగృతం చేశాయి. సామాజిక చైతన్య విలసితమైన ఆయన రచనలు ఉస్మానియా, ఆంధ్ర, మైసూర్, బెంగుళూరు వంటి విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా ఎంపికవడం ఆయన సాహిత్య కృషికి నిదర్శనం. దాశరథి, మాడపాటి హనుమంతరావు, ఎం.ఎస్.రాజలింగ, అయ్యదేవర, కోదాటి నారాయణరావులాంటి ప్రముఖ సంఘ సంస్కర్తలతో కలిసి విశాలాంధ్ర ఉద్యమంలో పాల్గొని కవితాగానం చేశారు.

1922 జులై 16న విజయనగరం జిల్లా బలిజపేట మండలం పెదపెంకి గ్రామంలో సురగారి ఎల్లయ్య, సురగారి పోలమ్మకు ద్వితీయ సంతానంగా జన్మించారు. అట్టడుగు దళిత కుటుంబంలో జన్మించినా తన చిన్ననాటినుండే కవిత్వాన్ని ఆరాధించేవారు. బాల్యంలో 8వ ఏటనే తన మిత్రులు, అప్పటి రాజులు, జమీందారుల సమక్షంలో చిన్న చిన్న కవితలు రాజుల సమక్షంలో చదివి వారు ఇచ్చే వెండి నాణేలతో పుస్తకాలు కొనుక్కొని చదువుకునేవారు. విజయనగరం సంస్కృత కళాశాలలో విద్యను పూర్తి చేసుకొని కాకినాడ మెక్లారిన్ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేశారు. ప్రభుత్వం ప్రచురించిన 2,6,9,10 తరగతుల తెలుగువాచకాలకు రైటర్‌గా కొనసాగారు. ఆయన రచించిన 'ఆమ్రపాళి' 1975లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఉత్తమ కవితగా ఎంపికైంది.

సాహిత్యం సర్వ మానవ సమాజ శ్రేయస్సుకు దోహ దపడుతుంది. అది పద్య కవిత్వమైనా, అభ్యుదయ కవిత్వమైనా, మినీ కవిత్వమైనా, హైకూలయినా సమాజ శ్రేయస్సనే దృష్టి కలిగి ఉండాలి. సమాజంలోని కుళ్ళును కడిగే ఉపయోగ పడే అంశం అందులో ఉండాలి.

ఆంధ్రాయూనివర్శిటీ 'కళాప్రపూర్ణ' డాక్టరేట్‌ను, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం డి.లిట్ ప్రదానం చేశాయి. 80 ఏళ్ళ వయస్సు వచ్చినా ఆయన సాహిత్య కృషి కొనసాగుతూనే ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆయన్ను పద్మశ్రీ పురస్కారానికి కూడా ఎంపిక చేసింది. ఆయనతో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు..

మీ సాహితీ జీవితంపై ప్రముఖ రచయితల ప్రభావం ఉందా?

చిన్ననాటినుండి నాకు పద్య కవిత్వమంటే ఇష్టం. వేమన, శ్రీనాథుడు తదితర ప్రముఖ రచయితల కవితలను చదువుతూ మనసులో స్మరించుకుంటూ ఉండేవాడిని. 8వ ఏటనుండే కవితలు చెప్పడం ప్రారంభించాను. జాతీయ నాయకులు, ఆంధ్రప్రదేశ్ అవతరణ ఉద్యమ నాయకులు డాక్టర్ అయ్యదేవర కాళేశ్వరరావు స్ఫూర్తితో విశ్వనాథ సత్యనారాయణ, జాషువా దీవెనలతో నా రచనలు సాగాయి.

ఆధునిక సాహిత్యంపై మీ అభిప్రాయం ఏమిటి?

ఆధునిక సాహిత్యం మంచి పోకడలు పోతోంది. వైవిధ్యమైన భావాలతో సాగుతోంది. సమాజంలో వేగంగా మారుతున్న సంస్కృతికి అనుగుణంగా సాహిత్యం అభివృద్ధి చెందుతోంది.

వచన, పద్య కవిత్వాలు సమాజాన్ని ఏ విధంగా జాగృతం చేస్తున్నాయి ?

సాహిత్యం సర్వమానవ సమాజ శ్రేయస్సుకు దోహదపడుతుంది. అది పద్య కవిత్వమైనా, అభ్యుదయ కవిత్వమైనా, మినీ కవిత్వమైనా, హైకూలయినా సమాజ శ్రేయస్సనే దృష్టి కలిగి ఉండాలి. సమాజంలోని కుళ్ళును కడిగే ఉపయోగ పడే అంశం అందులో ఉండాలి.

ఇప్పుడు వస్తున్న వాదాలపై మీ అభిప్రాయం ఏమిటి ?

ఏ వాదమైనా ఒంటరి పోరాటం చెయ్యలేదు. సమాజంలో ఏ విముక్తి ఉద్యమమూ సానుభూతివర్గాల సహకారం లేకుండా విజయవంతం కాదు. అంతేకాకుండా ఏ వాదానికైనా పరిమితులు ఉంటాయి. ఏదీ సమగ్రం కాదు. ఇతర సిద్ధాంతాల్లోని ఆచరణాత్మకతను గ్రహించడం అవసరం. అప్పుడు మాత్రమే నిగ్గు తేలుతుంది. ఏ వాదమైనా మానవ మహోన్నతికి దారి చూపేదిగా ఉండాలి.

మీ కుటుంబ జీవన విధానం ఎలా ఉంది? మీ ప్రభావంతో ఎవరైనా సాహితీరంగంలోకి ప్రవేశించారా?

ప్రభుత్వం ఇస్తున్న ఫించనుతోనే నా శేష జీవితాన్ని గడుపుతున్నాను. 80 ఏళ్ళు వచ్చినా పూర్తిగా రచనలకే కేటాయిస్తున్నాను. మాకు మొత్తం నలుగురు సంతానం. పెద్దకుమార్తె డా॥శరత్ జ్యోత్స్నా రాణి రచయిత్రిగా పేరు పొందడమే కాక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో తెలుగు రీడర్‌గా పనిచేస్తోంది. పెద్దకుమారుడు శిరబిందు హైదరాబాద్‌లో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గాను, మరో కుమారుడు రసజ్ఞశ్రీ కాకినాడలోనే ఎసిటిఓగా పనిచేస్తున్నారు. మరో కుమార్తె శిరీష మనోజ్ఞ పార్వతీపురం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్నారు.

ప్రస్తుత సమాజంలో కవులకు ఆదరణ ఉందంటారా?

వుంది, కాదనలేం. అయితే సమాజంలో ఉన్న బలహీనతలు వారిపై కూడా పడుతున్నాయి. అట్టడుగు వర్గాల కవులను చిన్న చూపు చూసే ధోరణి వ్యక్తమవుతోంది.

మీరిచ్చే సందేశం ఏమిటి ?

యువకవులు, రచయితలు నిరంతరం అధ్యయనం చేయాలి. జీవితాన్ని, సమాజాన్ని చదవడంతో పాటు రాయడం నేర్చుకోవాలి. ఇప్పుడు కొత్తగా వస్తున్న వారు మంచి రచనలు చేస్తున్నారు. సమాజంలో ఉన్న రుగ్మతలను ప్రతిబింబించే రచనలతో పాటు వాటికి పరిష్కార మార్గాలను కూడా రచయితలు చూపెట్టగలగాలి.

సమాజం నేడు అనేక సమస్యలతో విలవిల్లాడుతోంది. అవిద్య, అనారోగ్యం, నిరుద్యోగం, కులవివక్ష, కాలుష్యం తదితర విషమ సమస్యలు పెరుగుతున్నాయి. ఇలాంటి సమస్యలను విస్తృతంగా వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి కవులు, రచయితలు, సాహితీవేత్తలు కృషి చేయాలి.

-ఇంటర్వ్యూ : యడవల్లి శ్రీనివాసరావు, వాతాడ నవీన్‌రాజ్, కాకినాడ.

పోలీసు తూటాలకు బలైపోయిన విప్లవ దీపం

యు.రామకృష్ణ

పిల్లలకూ పెద్దలకూ ఎంతో ఇష్టమైన రోజది.

పిల్లలైతే ఆ రోజెప్పుడొస్తుందా అని నెలల తరబడి ఎదురుచూసే రోజది.

ఓ నెల రోజుల ముందు నుండే తనకు తెచ్చి పెట్టాల్సినవి అమ్మానాన్నలకు చెపుతూ ముద్దు ముద్దుగా మారాంచేసే పిల్లలకు అతి ముఖ్యమైన రోజది.

అత్తమామలు కొత్త అల్లుళ్ళను ఇంటికి తీసుకువచ్చి తగిన విధంగా సత్కరించే రోజది.

ఇంటిముంగిట తమ బిడ్డలు ఆనందంతో కేరింతలు కొడుతుంటే వారిని చూసి తృప్తిపడే పెద్దలకూ ఇష్టమైన రోజది.

అయితే అంత ముఖ్యమైన ఆ 'దీపావళి' పండుగ రోజున ఆ ఊళ్ళో ఏ ఇంటా కనీసం 'నూనె ప్రమిద' వెలుగు కూడా కానరాని విషాదకర వాతావరణం అలముకుంది.

గొప్పింటి వారి ముంగిట ఓ చిచ్చుబుడ్డి... మధ్యతరగతి గృహస్థు ఇంట ఓ మతాబు, పేదింటి వద్ద ఓ కాకర పువ్వొత్తు కూడా వెలిగించని దుర్దినమైంది ఆ గ్రామస్తులకు దీపావళి.

బాణాసంచా వెలుగులతో అమావాస్య చిమ్మచీకట్లను పారద్రోలి పండు వెన్నెలను సాక్షాత్కరింపచేసే పండుగ ఆ గ్రామస్తులకు కాళరాత్రి అయ్యింది ఆ రోజు రాత్రి.

ఆనందంగా గడపాల్సిన ఆ రోజు... వండుకున్న పిండి వంటలు... కనీసం భోజనం కూడా ముట్టలేదా గ్రామస్తులు.

తాను ధనిక రైతు కుటుంబంలో పుట్టినా, పేద, ధనిక తారతమ్యాలు రూపుమాసిపోయి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆనందమయ జీవితం గడపాలనే సమాజం రావాలని కాంక్షించి, అందుకోసం అతి చిన్న వయస్సులోనే పోరాటమే తన బాటగా ఎంచుకున్న చింతపల్లి పాపారావు ఆత్మ బలిదానం చేసిన రోజది.

***

"సూరంపల్లి"

కృష్ణాజిల్లా గన్నవరం తాలూకాలో వుంది.

1949 అక్టోబర్ 21వ తేదీ...

ఆ రోజు దీపావళి పర్వదినం...

వడివడిగా సూర్యుడు నడినెత్తి కెక్కుతున్నాడు.

హడావిడిగా ఊళ్ళోకి ఓ పోలీస్ వ్యాన్ వచ్చి, ఓ భూస్వామి ఇంటి ముంగిట ఆగింది.

అప్పటికే పోలీస్ వ్యాన్‌కోసం ఎదురుచూస్తూ అక్కడ పోగైన భూస్వాములు, పోలీసులు వెళ్ళాల్సిన దిక్కు చూపించి వారికేవేవో చెప్పారు.

వచ్చినంత వేగంగా మళ్ళీ కదిలిందా పోలీసు వ్యాను.

సరాసరి అది ఆ ఊరి డాక్టర్‌గారి ఇంటిముందు ఆగింది...

పోలీసులు వ్యాన్ నుండి బిలాబిలా దిగుతున్నారు.

ఆ ఇంట్లో రక్షణ పొందుతున్న కామ్రేడ్ చింతపల్లి పాపారావు వారిని గమనించి, క్షణంలో ఆ ఇంటి ప్రహరీగోడ దూకాడు.

ఆ మెరుగు వేగానికి బిత్తరపోయిన పోలీసులు క్షణంలో తేరుకొని వెంటపడ్డారు.

అయితే గోడదూకిన పాపారావు తప్పించుకు పోవడానికి సాధ్యంకాని రీతిలో అది నిర్జన ప్రదేశం అయ్యింది.

ఆ ప్రదేశంలో పోలీసులు ఎంతదూరం నుండి తుపాకీ పేల్చినా ఆ వీరుని ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతాయి.

మరోమార్గంలేక ఆ దాపునేవున్న ఓ పెద్ద గుబురుపొదలో దూరబడ్డాడు.

కాసేపు పోలీసుల మెదళ్ళు మొద్దుబారిపోయాయి.

తమ కళ్ళముందే మెరుపువేగంతో గోడదూకిన వ్యక్తి అంతే మెరుపు వేగంతో తప్పించుకుపోయాడనుకున్నారు.

అయినా తప్పించుకుపోవడానికి అదంతా నిర్జన ప్రదేశం.

అలాంటి ప్రదేశంలో మనిషి కనబడకుండా పోవడం అసాధ్యం అనుకున్నారు పోలీసులు.

వారి తుపాకులకు 'దూరదర్శిని గేజ్' బిగించబడి వున్నాయి.

వాటిగుండా సుదూరంలోవున్న చిన్న వస్తువులనైనా స్పష్టంగా చూడొచ్చు.

దానిద్వారా చూస్తే పోలీసులకు కొంతదూరంలో ఓ పెద్ద పొద కనిపించింది.

దానిచుట్టూ పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి వలయాకారంగా నిలుచున్నారు.

మలబారు పోలీస్ క్యాంప్ స్పెషల్ డిఎస్పీ పళనియప్పన్ హెచ్చరికగా గాలిలోకి తుపాకీ పేల్చాడు.

అయినా ఆ పొదలో ఎలాంటి అలికిడీ లేదు.

పోలీసులు చుట్టుపక్కల పోగుచేసిన రాళ్ళను పొదలోకి విసురుతూ, పాపారావును బయటకు రమ్మని పెద్దగా అరుస్తున్నారు.

అయినా ఆ పొదలో నుండి ఎలాంటి కదలికాలేదు.

ఇద్దరు, ముగ్గురు పోలీసులు ఆ పొదలోకి దూరే ప్రయత్నం చేస్తే డిఎస్పీ పళనియప్పన్ వారిని వారించాడు.

పొదలో ఉన్న పాపారావు వద్ద రివాల్వర్ ఉండొచ్చని, అలా వెళ్ళినవారు కుక్కచావు చస్తారని ఊహించి డిఎస్పీ అలా వారించాడు కాబోలు.

ఆ పొదలోకి ఎన్ని వందల రాళ్ళు పడ్డాయో లెక్కలేదు. ఆ దరిదాపుల్లో విసరటానికి ఇక రాళ్ళు కూడా అయిపోయాయి.

'ఫైర్....!'

డిఎస్పీ నుండి ఆర్డర్ వెలువడింది.

ధన్... ధన్.... ధన్...

నలువైపుల నుండీ ఆ పొదలోకి తుపాకీ గుళ్ళు దూసుకుపోయాయి.



ఎన్ని గుళ్ళు ఖర్చయి పోయాయో లెక్కలేదు.

అయినా ఆ పొద నుండి ఎలాంటి కదలికాలేదు.

కనీసం చిన్న మూలుగు కూడా వినిపించలేదు.

పోనీ పొదలోకి వెళ్ళి చూద్దామా అంటే ఆ వెళ్ళినవాడు అక్కడే ప్రాణాలు విడుస్తాడేమోనన్న భయం.

కాసేపు కాల్పులు నిలిపివేశారు పోలీసులు.

అంతలో పొదలో నుండి ఓ వైపుకు రక్తం పారడం పోలీసులు గమనించారు.

పాపారావు మరణించాడని రూఢి చేసుకున్న తర్వాతే పోలీసులు పొదలోకి వెళ్ళారు. రక్తం ఓడుతున్న పాపారావు మృతదేహాన్ని బయటకు తెచ్చారు.

తుపాకీ గుళ్ళ వర్షంతో ఆ దేహం తూట్లు... తూట్లు... పడిపోయింది.

ఆ విధంగా ఆ వీరుని విప్లవ జీవితం ముగిసిపోయింది.

వీరులను తుదముట్టించినంత మాత్రాన విప్లవపథం ఆగిపోతుందని కాబోలు ఆ పోలీసుల ఊహ.

'పీడన', 'దోపిడీ', 'అసమానతలు' ఉన్నంత కాలం అలాంటి వీరులు ఎందరికో స్ఫూర్తి ప్రదాతలు అవుతారని ఆ పోలీసులు ఊహించలేకపోయారు.

***

కామ్రేడ్ చింతపల్లి పాపారావు 1922వ సంవత్సరంలో గన్నవరం తాలూకా బుద్ధవరంలో ధనికరైతు కుటుంబంలో భూషయ్య, సుబ్బమ్మ గార్లకు జన్మించారు.

ఆ దంపతులకు పాపారావు మూడవ కుమారుడు.

ఐదవ తరగతి మాత్రమే చదువుకున్న పాపారావు రాజకీయాలలో ప్రవేశించి, స్వయంకృషితో భాషాజ్ఞానాన్ని పెంపొందించుకొని అనేక సిద్ధాంత గ్రంథాలను అధ్యయనం చేసి మంచి వక్తగా రూపొందాడు.

స్వాతంత్ర్యోద్యమం సాగుతున్న కాలంలో 1939వ సంవత్సరం జనవరి 23వ తేదీన గన్నవరం కోనాయి చెరువు వద్దగల రామమందిరంపై జాతీయ జెండాను ఎగురవేశాడు.

బూతిమిల్లిపాడు మునసబుగా పనిచేస్తూ

కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన నిర్విరామంగా పాల్గొంటుండేవాడు.

ఆ రోజుల్లో మునసబుగిరీ చేసే వారంతా సహజంగా భూస్వాములకు, ప్రభుత్వానికీ తొత్తులుగా ఉండి, పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరించే తీరు ఎక్కువగా ఉండేది.

కానీ పాపారావు వ్యవహార శైలి దానికి భిన్నంగా ఉండేది.

తాను మునసబుగిరీ చేసినంతకాలం పేదల పక్షపాతిగానే ఉన్నాడు.

ప్రభుత్వ జీఓలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేస్తుండేవాడు. తమ రికార్డుల ప్రకారం తేలిన బంజరు భూములను ఆక్రమించి అనుభవించమని పేదలను ప్రోత్సహించేవాడు.

పాపారావు పరోపకారం, నిస్వార్థత పైఅధికారులను ముగ్ధులను చేస్తుండేది.

అతనిని మునసబుగిరీని తొలగించాలని భూస్వాములు ఎంత ఒత్తిడి తెచ్చినా కలెక్టర్, ఆర్డీఓ వాటిని ఖాతరు చేసేవారు కాదు.

ఎంతైనా వారు ప్రభుత్వ అధికారులు. పైవారి ఆదేశాలను అమలు చేయటం వారి విధి. చివరకు వారు పాపారావు మునసబుగిరీని రద్దుచేయక తప్పలేదు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటీష్ ప్రభుత్వం కమ్యూనిస్టుపార్టీని నిషేధించింది.

ఆ ప్రభుత్వం నాయకుల అరెస్ట్‌కై వారంట్లు జారీ చేసింది. నాయకులు రహస్య జీవితం గడుపుతూ ఉద్యమాలు నిర్వహించాల్సి వచ్చింది.

ఆ సమయంలో 18 సంవత్సరాల వయస్సున్న పాపారావు నాయకులకు అన్ని విధాలా సహాయపడుతూ వారి మధ్య కొరియర్‌గానూ, ప్రజల మధ్య కార్యకర్తగానూ పనిచేశాడు.

యువకులను కదం తొక్కించిన పాపారావు

1942లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించారు. అప్పుడు పాపారావు గన్నవరం తాలూకాలో విధి విరామం లేకుండా నలుమూలలా తిరిగి బలమైన యువజనోద్యమాలు నిర్మించాడు.

ఆటల పోటీలు, వైజ్ఞానిక కార్యక్రమాలు, వయోజన విద్యా కేంద్రాల ద్వారా గ్రామీణ యువతరాన్ని ఆకర్షించి వారు చెడు మార్గాలవైపు వెళ్ళకుండా వారిలో నూతన చైతన్యం కలిగించడానికి ఎనలేని కృషి చేశాడు.

1947లో ప్రకాశం ఆర్డినెన్స్‌వల్ల ఎందరో కమ్యూనిస్టులను నిర్బంధించారు. మరెందరో అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు.

ఆ సమయంలో ప్రపంచ యువజన సమాఖ్య ప్రతినిధి వర్గం గన్నవరం తాలూకా చిన ఓగిరాల వచ్చినపుడు పాపారావు అహోరాత్రులు కృషిచేసి 50 వేల మంది ప్రజలను సమీకరించాడు.

రైతులపై ప్రభుత్వ నిర్బంధాన్నెదిరించిన రైతు నాయకుడు

రెండో ప్రపంచ యుద్ధం మూలంగా బండి పట్టాలు, పలుగులు, పారలు, ఎరువులు మొదలైన వ్యవసాయావసరమైనవి దొరకక రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. వాటిని బ్లాక్ మార్కెట్లో కొనుక్కోవాల్సి వచ్చేది.

మరోవైపు తాము పండించిన పంటలను తక్కువ రేట్లకు ప్రభుత్వానికి లెవీ రూపంలో చెల్లించాలి. అందువల్ల ఆనాడు బ్లాక్ మార్కెట్‌కు, లెవీ విధానానికి వ్యతిరేకంగా పోరాడాడు.

ఆ కాలంలోనే గన్నవరంలో నిర్మించిన విమానాశ్రయం కోసం బ్రిటీష్ ప్రభుత్వం తీసుకున్న భూములకు నష్టపరిహారం ఇప్పించడానికి కృషిచేశారు.

రైతులు తమ ఎడ్లబండ్లన్నిటినీ తెచ్చి విమానాశ్రయ నిర్మాణంలో పనిచేయాలని ప్రభుత్వం 'భారత రక్షణ చట్టం' క్రింద నిర్బంధంగా ఆదేశించింది. ఆ పనికి కాంట్రాక్టర్‌గా ఉన్న గ్యానన్ డంకర్లీ తమ కింద పని చేయాలని, తాము ఇచ్చిన కూలినే తీసుకోవాలని రైతులను నిర్దేశించాడు. దీనిపై అట్లూరి శ్రీమన్నారాయణ, ముక్కామల నాగభూషణం, కాట్రగడ్డ వెంకటనారాయణలతో కలిసి పాపారావు గన్నవరం తాలూకాలోని 64 గ్రామాల రైతాంగాన్ని ఎడ్లబండ్లతో సహా సమీకరించాడు. కేసరపల్లి నుండి ఆత్కూరు వరకూ, బుద్ధవరం నుండి బాహుబలేంద్రునిగూడెం వరకూ రోడ్లపై బండ్లు నిలబెట్టి విమానాశ్రయం వద్దవున్న జిల్లాకలెక్టర్ వద్దకు రైతులతో ప్రదర్శన నిర్వహించాడు.



రైతుల ప్రదర్శన, సంఘీభావం చూసిన కలెక్టర్ వారి కోర్కెలను ఆమోదించారు. వాటిని అమలు చేయడానికి ఒక తాహసీల్దారును నియమించి కాంట్రాక్టర్, రైతు సంఘ ప్రతినిధులతో ముగ్గురితో కూడిన కమిటీని ఏర్పాటుచేశాడు.

* * *

విజయవాడలో జరిగిన ఒక హత్యకు సంబంధించి గన్నవరంలో తన సహచరుడుగా పనిచేస్తున్న అట్లూరి శ్రీమన్నారాయణపై బనాయించిన అక్రమ కేసులో ఉరిశిక్షపడింది.

ఉరిశిక్ష అమలు చేయడానికి రాజమండ్రి తరలించే సందర్భంలో నిర్బంధంలో ఉంచిన అట్లూరి శ్రీమన్నారాయణను పోలీసుల నుండి తప్పించడానికి పాపారావు ఒక పథకం రచించాడు. అది తెలుసుకున్న పోలీసులు వందల మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంవల్ల అట్లూరిని తప్పించలేకపోయాడు. అయితే మరో ప్రత్యామ్నాయ ఏర్పాటు ద్వారా పోలీసుల కళ్ళుగప్పి అట్లూరి మార్గమధ్యంలో తప్పించుకున్నాడు.

ప్రజాసేవకోసం ముందుకు వచ్చిన కార్యకర్తలు తమ ఆస్తులను త్యాగం చేయాలని తేలప్రోలులో జరిగిన ఒక సమావేశంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు కోరినప్పుడు పాపారావు తన వాటాకు వచ్చిన ఆస్తి మొత్తాన్నీ, ఏడెకరాల మాగాణిని కమ్యూనిస్టుపార్టీకి ఇచ్చివేశాడు. అంతేకాదు తన జీవిత సర్వస్వాన్నే ప్రజలకోసం త్యాగం చేశాడు.

ఎంత ప్రచారంలోనైనా పార్టీ పిలుపుకు వెనుకడుగు వేయని, నిర్బంధాలకు చెక్కుచెదరని మనో నిబ్బరం పాపారావుది.

క్రమశిక్షణ తాను ముందుగా అమలు జరిపి ఇతరులతో అమలు జరిపించే ఆదర్శం పాపారావులోని ప్రత్యేకత.

స్వసుఖం కోసం ఒక్క నిమిషం కూడా ఆలోచించి ఎరుగడు.

ప్రజాసేవద్వారా పీడిత ప్రజల హృదయాలను చూరగొన్నాడు.

1948నుండీ నైజాం సంస్థానంలో (తెలంగాణా)లో రైతాంగ సాయుధ విప్లవ పోరాటం ఉధృతమైంది. అదే సమయంలో ఇండియన్ యూనియన్‌లో ఉన్న కోస్తాజిల్లాలు, ముఖ్యంగా కృష్ణాజిల్లాలో కమ్యూనిస్టుపార్టీపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్నది. ప్రభుత్వం దొరికిన కమ్యూనిస్టులను కాల్చి చంపి వేయిస్తున్నది.

దీనితో పాపారావు 1948 మార్చి నుండి రహస్య జీవితం ప్రారంభించారు. సూరంపల్లిలో ఒక డాక్టర్ ఇంటిలో రక్షణ పొందుతున్న పాపారావును భూస్వాములు పసిగట్టి 1949 అక్టోబర్ 21వ తేదీన (ఆ రోజు దీపావళి) పోలీసులకు సమాచారం అందించారు.

తనకు కొరియర్‌గా ఉన్న అర్జా రంగారావు (సావారిగూడెం) పార్టీకి చెందిన వేరే కార్యక్రమంలో ఉండగా, పోలీసులు వస్తున్న సమాచారం ముందుగా తెలుసుకోలేకపోయాడు పాపారావు.

పోలీసులకు పట్టుబడి అమరుడయ్యాడు.

28 సంవత్సరాల వయస్సులోనే అమరత్వం పొందిన పాపారావు ఇండియన్ యూనియన్‌లోని ఆంధ్రప్రాంతంలో ప్రభుత్వ తుపాకీ గుండ్లకు బలైన తొలి విప్లవవీరుడు. అశేష జనసామాన్యం ఆరోజున అశ్రుతర్పణ విడిచింది.

స్వార్థపరులు చివుకుతూ మరణిస్తారు.
నిస్వార్థపరులు నవ్వుతూ అమరులవుతారు!

★

"కోటలో పాగా"

కొండబాబు



కల్పనాథ్ కథ చెప్పుకుపోతున్నాడు. నిర్మాత భద్రం, డైరెక్టర్ దర్శన్ సోఫాలకు చేరగిలబడి వింటున్నారు.

..దీంతో వాణి శ్రీదేవికి ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. "ఎవరక్కడ?" అంటూ ఆమె వేసిన కేకకు ఆమె భర్త కైకాల సత్యనారాయణ చేతులు నలుపుకుంటూ వచ్చాడు. "పిలిచావా?" అంటూ

"నువ్వెందుకు..? చేతకాని వాడివి! ఆ ఎస్పీకి బుద్ధి చెప్పాలి.. సమయానికి మా అన్నయ్య కూడా లేడు" అందామె అసహనంగా.

అప్పుడే వచ్చాడు వెంకటేష్ "మీ సమస్య నేను పరిష్కరిస్తా మేడమ్.. ఆ ఎస్పీకి బుద్ధి చెపుతా! మేడమ్ వాణిశ్రీదేవంటే ఏమిటో వాడికి తెలియజేస్తా" అన్నాడు.

ఆమె సందిగ్ధంగా చూసింది అతనివైపు.

"మీకేమీ సందేహం అవసరం లేదు మేడమ్.. ఎస్పీకి బుద్ధి చెప్పే పని నాకొదిలెయ్యండి.. ఆ ఎస్పీకి ఒక కూతురుంది. ఆమెను హ్యాండిల్ చేస్తే చాలు ఎస్పీ దారికొస్తాడు" అన్నాడు వెంకటేష్.

"శభాష్" అంది వాణిశ్రీదేవి సంతృప్తిగా..

ఎస్పీ కూతురుగా రెండో హీరోయిన్‌ని కూడా పెట్టుకోవచ్చు.. కట్ చేస్తే.. వెంకటేష్ ఆ రాత్రి వాళ్ళమ్మ శారదకు లెటర్ రాయడం ప్రారంభిస్తాడు.

మళ్ళీ కట్ చేస్తే పల్లెటూరిలో వున్న వాళ్ళమ్మ శారద, వెంకటేష్ రాసిన ఉత్తరం చదువుకుంటూంది.

వెంకటేష్ బొమ్మ లెటర్‌పై ఇన్‌ఫోకస్ చేస్తాం.. లెటర్‌పైనుంచి అతను మాట్లాడుతూ కనిపిస్తాడు.

"అమ్మా.. పాతికేళ్ళ క్రితం.. నిన్ను అవమానించి, నాన్నకు దూరం చేసిన నీ ఆడపడుచు, నా మేనత్త అయిన వాణిశ్రీదేవి ఇంటికి చేరాను. కోటలో పాగా వేశాను. ఇక ఆమె సామ్రాజ్యాన్ని కబళించడమే తరువాయి. ఆమెను దారికి తెస్తా.. నీకు క్షమాపణ చెప్పిస్తా.."

మధ్యలోనే అందుకున్నాడు దర్శకుడు. "ఇదేదో సినిమాలో ఉన్న సన్నివేశంలాగుంది."

"అయితే మరీ మంచిది సార్.. ఆ సినిమా హిట్టయింది కాబట్టి.. ఇదీ హిట్టవుద్ది" అన్నాడు. భద్రం సంతృప్తిగా..

కల్పనాథ్ ఊపిరి పీల్చుకున్నాడు.

* * *

ఇలాంటి సినిమా కథలు కోకొల్లలు విని వుంటాం. అయినా అలాంటి సినిమాలే వస్తుంటాయి. చూస్తుంటారు. సరే చర్చ అది కాదు. సినిమాల్లోనే కాదు.. పిచ్చాపాటి మాట్లాడుకునేటప్పుడు జన సామాన్యమూ అనుకునే మాట 'కోటలో పాగా వేశాం' అనే దాని గురించి.

ఈ పదానికి యథాతథ అర్థం తీసుకుంటే, కోటలో.., పాగా అంటే తలపాగా వేశాం అని అర్థం. తలపాగా అంటే పెద్ద కండువాని తలకు చుట్టుకోవడం. శ్రామిక జనాలు ఎండనుంచి రక్షణగా, అవసరానికి పైపంచగా దానిని వాడుతుంటారు. ఒకప్పుడు పండితులు, రోజోద్యోగులు మాత్రం ఒక హోదాకు చిహ్నంగా వాడేవారు. అది సరే, కోటలో పాగా వేయడమంటే ఏమిటి? అనేది ప్రశ్న.

లక్ష్యంలో ఒక ప్రధాన దశకు చేరుకోవడాన్ని -సామాన్యార్థకంలో కోటలో పాగా వేశాడంటారు. అంటే 'జొరబడ్డాం.. ఇక పని పూర్తి చేయడమే తరువాయి' అర్థంతోనన్నమాట.

కోటకూ, పాగాకూ ఏం సంబంధం? ఇదేం అర్థం? అనేది మనముందున్న చర్చ.

ఎంతో చదువూ, పాండిత్యం, ప్రతిభా సిఫారసులు ఉంటేగానీ రాజోద్యోగం దొరికేది కాదు పూర్వం. రాజోద్యోగం వస్తే, తలపాగా హోదాగా చుట్టి కొలువుకు బయలుదేరేవారు. ఇదే కోటలో పాగా అంటే అర్థం చెపుతారు కొందరు. కాని దాని అర్థ విస్తృతికి ఇది సరిపడదేమో!

పూర్వం రాచరిక యుద్ధాలు జరిగేప్పుడు కోటను గనుక స్వాధీన పర్చుకోగలిగితే, దాదాపు రాజ్యం మొత్తం వశమయినట్లే. కాబట్టే రాజులు శత్రురాజుల కోట ముట్టడికి ప్రాధాన్యమిచ్చేవారు. అందుకే శత్రురాజులకు కోట ఒక పట్టాన వశమవకుండా కొండలపై, ఎత్తయిన ప్రదేశాలపై కోటలు కట్టేవారు. అయినా రాజులు పరస్పరం కోటల ముట్టడికి ఉపాయాలు, ప్రత్యామ్నాయాలు ఆలోచించేవారు.

ఆ విధంగా కోటలు వశపర్చుకోడానికి 'ఉడుము'ల ఉపయోగం మొదలైంది. ఉడుము అంటే సర్పజాతి జంతువు. అది ఎలాంటి ప్రదేశాన్నయినా గట్టిగా కరచి పట్టుకు ఉండిపోగలదు. కాబట్టి సైనికులు ఒక కోటలోకి ప్రవేశించాలంటే తొలుత ఉడుమును ప్రవేశపెట్టేవారు.

ఒక బలమైన పొడవాటి తాడును ఉడుము నడుముకు కట్టి, బలంగా పైకి విసిరేవారు. అది కోటలో పడేది. పడిన చోట గట్టిగా పట్టుకునేది. సైనికులు ఆ తాడు పట్టుకుని ఒకరి తర్వాత ఒకరు మెల్లగా కోటలోకి ప్రవేశించేవారు. కాని, తాళ్ళు పరికరాలతో కోటల దగ్గరకు వెళ్ళడం శత్రువులకు అనుమానం కలిగిస్తుంది. కాబట్టి అయిదారు బారల పొడవుండే తలపాగాను విప్పి ఒక చివర ఉడుమును కట్టి కోటలోకి విసిరేవారు.

ఈ ముట్టడి దశను వార్తాహరుల ద్వారా దళాధిపతులకు చేరవేసే వారు క్లుప్తంగా అందులో. ఈ దశకు వార్తకు ఉపయోగించేపదమే 'కోటలో పాగా వేశాం' అనేది. అంటే "పాగా వేయడం వరకు పని అయింది, సైనికులు ప్రవేశించడం.. ఇక తర్వాత పనులు మిగిలి ఉన్నాయి. మరికొందరు సైనికుల్ని పంపండి" -ఇలా ఉండేదన్నమాట. కోటలో పాగా వేయడమంటే అది! ★

పాఠక స్పందన

ప్రభుత్వ అమసర్థత రుజువైంది

23-12-2001 ఆదివారం ప్రజాశక్తిలో ప్రచురించిన కవర్ స్టోరీ 'ఉగ్రవాద సవాలు - ఉద్రిక్త స్వరాలు' చాలా బాగుంది. దేశంలో జరుగుతున్న ఉగ్రవాద చర్యల గురించి కళ్ళకు కట్టినట్లు వివరించారు. దేశ అత్యున్నత చట్ట సభ అయిన పార్లమెంట్ భవనం దగ్గర కూడా తగిన రక్షణ కల్పించలేని ఈ అసమర్థ ప్రభుత్వం దేశ ప్రజలను ఏ మేరకు రక్షించ కలుగుతుంది అనే సందేహం కలుగుతోంది. అలాగే బాలవికాసం, కచేరి కూడా చాలా బాగున్నాయి.

- అరుణ, విజయవాడ

పులకింప చేసిన పులికాట్

డిసెంబర్ 16వ తేదీ సంచికలో ప్రచురించిన 'పులికాట్ పులకింత - నేలపట్టు గిలిగింత' వ్యాసం ఎంతో బాగుంది. వ్యాసకర్తకు కృతజ్ఞతలు. నెల్లూరు జిల్లాలోని ఉప్పు నీటి పులికాట్ సరస్సు గురించి తెలియజేసిన వ్యాసాలు ఎంతో ఆకర్షణీయంగా వున్నాయి. అక్కడి పక్షులు, చేపలతో పాటు నెల్లూరుకు 80 కి.మీ. దూరంలోని దొరవారి సత్రం గురించి తెలియజేసినందుకు ధన్యవాదాలు

- వై.రాంబాబు, శాంతి, బి.వి.రావు, కె.ఎస్.కృష్ణ, ఎమ్.సౌందర్య, వెల్లలూరు, గుంటూరు జిల్లా

ఆదరణ కరువైన వృద్ధులు

బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం అనేవి ప్రతీ జీవి తన జీవితంలో ఎదుర్కొనే దశలు. నేటి హైటెక్ యుగంలో వృద్ధులు ఆదరణకు నోచుకోలేకపోతున్నారు. ఇది వారికి ఒక శాపంగా పరిణమించకుండా వారి బిడ్డలు, ప్రభుత్వం, శ్రద్ధ వహించాలి.

- బట్టా రామకృష్ణ, సౌత్‌మోపూర్ గ్రామం, నెల్లూరు జిల్లా



చదవండి! చదివించండి!!

నిజాన్ని నిర్భయంగా చాటేది
ప్రజల పక్షాన నిలిచేది

ప్రజాశక్తి
దినపత్రిక

హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, తిరుపతిల నుండి ప్రచురణ.